# సమూహం

## బి.సి.అస్తిత్వవాద యువ కవిత్వం

సంపాదకుడు

డా. చింతం ప్రవీణ్ కుమార్


బి.సి. రైటర్స్ వింగ్

హైదరాబాద్

# SAMOOHAM

**BC IDENTITY POETRY**

BC WRITERS WINGS (B.W.W)

First Edition: **December 2016**

Copies: 2000

Rs: 100/- 2$

Cover Image: **D.N.Chary**

For Copies:

Phoole Ghar,

# 16-10-236, Shiva Nagar,

Warangal - 506 002.

Cell: 9346 886 143

&

All leading Book Shops

Layout, Cover Design & Printing

**FRONTLINE GRAPHICS**

Kumarpally, Hanamkonda,

Warangal - 506001

Cell: 9849 669 214

Cell: 9849 105 467

## “బహుజనులారా ఏకంకండి”
## సంఘం పిలిచింది (బీసీ కులాల పట్టిక)

**- గుమ్మడి వెంకటేశ్వర్లు**

సంఘమంటరారో– దాని సంగతేందోవిందాము
సంఘశక్తి లేకుంటే – భంగపాటు తప్పదంట ॥సం॥
ఎండుడొక్కలోళ్ళంతా– ఏకమై సాగాలట
ఎనకబడ్డ వాళ్ళమంత– వెల్లువలా కదలాలట ॥సం॥
చాకలి, మంగలి, కుమ్మరి, కమ్మరి, యాదవ, వంజర
పూసలి, దాసరి, వడ్డెర– రంగరాజు భట్రాజుల ॥సం॥
శ్రీవైష్ణవ, సాతానులు, పద్మశాలి, పల్లెకాపు
పాములోళ్ళు, పటకారులు– గంగపుత్ర, ముదిరాజుల ॥సం॥

ఆరెకటిక, కటిక, గాండ్ల– తేలికుట్ల, పింజారులు
బుక్క, పకీరువాళ్ళు– కొప్పువెలమ, శెట్టిబలిజ ॥సం॥
సాధుశెట్టి, గౌండ్ల కులం– దూదేకుల, తూర్పుకాపు
మేథర్, మెహతర్, లద్దాఫ్,పెటిక, అగరు, వన్నెకాపు ॥సం॥
బాలసంతు, బహురూపీ– బుడబుక్కల, దొమ్మరోళ్ళు
జోగీజంగం, దక్కలి– పిచ్చికుంట్ల, వీరముష్టి ॥సం॥
గంగిరెడ్డవారు, బోయ–తలారి, పెదబోయ, పాసి
మేదరి, మేరే– పరికముక్కు, నీలక్రాంతి
మున్నూరుకాపు, బలిజ – వాల్మీకి, కళింగ, బండ
దేవరోళ్ళు, చిత్రకార– దేవాంగ, కళావంతుల ॥సం॥
శ్రీశయన, నాగవశం – క్రిష్ణబలిజ, కంద్ర, కోస్టి
జక్కల, జింగర్, హట్కర్–మధుర,మాలి,స్వకుల,సాతి ॥సం॥

అచ్చుకట్ల, కూనపులి– మందుల, పెద్దమ్మలోళ్ళు
కాటిపాపల, కింతల– కళింగ, కంజరాబట్ట ॥సం॥
మొండివారు, చుండువాళ్ళు– నాగవడ్డి, పంబాలోళ్ళు
ఈడిగ, ముచ్చి, నూసి– గవర, గౌదవ, నకాసోళ్ళ
పొట్టప్పు, వంశరాజ్– బందర, కొప్మారి, కచ్చి
నూర్‌భాషా, పాలినాటి వెలమలు– మాతుర, మాలి ॥సం॥
భవసారక్షత్రియులు– వాడబలిజ, వన్నెరెడ్డి
చిప్పొల్లు, గౌడబ, సగర– సూర్చ బలిజ, నోసి, పల్లి ॥సం॥
జోసినందివాలాలు– చిత్తరి, గునియర్, గొండ్ల
నెక్కర్, నక్కల, యాట– కిరాటక, ఎల్లాపి, జాండ్ర ॥సం॥
కరభక్తులు, కాయికోలన– కరికులభక్తులు, కుర్ని
నెయ్యల, కొర్చా, మహేంద్ర– గుడాల, కౌకాడి, పార్ధి ॥సం॥
అగ్నికుల క్షత్రియ, నీల్లి– వన్యకుల క్షత్రియ
శాలీవాహన, తెలికుల– తెనుగోళ్ళు అటకార ॥సం॥
తమ్మలి, తోగటి, గనిక దొని షాది, రెడ్డిక
మొండిపట్ట, పల్లిరెడ్డి – చొపెమారి, బెస్తవాళ్ళ ॥సం॥
అయ్యరకల, కూరాకుల– నగర, సొండి, శిష్టకరణ
బొందిలి, కలింకోమటి– పొందర, వరాల, పట్ర ॥సం॥
విశ్వబ్రాహ్మణ, ఆరె, క్షత్రియ–
ఉప్పర, ఓడలు, గాజుకాపు ॥సం॥
బీసి, యస్సీ, యస్టీ– ఎనభైశాతం వుండగ
అగ్రకులాలోళ్ళే మనల అణగ దొక్కి కులుకుతాన్రు ॥సం॥
సొమ్మొకడిది, సోకొకడిది– ఓటొకడిది, సీటొకడిది
చెల్లదు ఇక చెల్లదంటు సమాజాన్ని మార్గగోరె ॥సం॥

## అంకితం

ఆత్మగౌరవం కేవలం రాజకీయ నినాదం కానక్కర్లేదని అదొక జీవన విధానంగా మారాలన్న ఆకాంక్షలో భాగంగా 'వెంటాడే కలాలు-వెనుకబడిన కులాలు' కవిత్వం వెలువడింది. వెంటాడే కలాల' కవులు కులాలు, కులవృత్తుల,ఆ వృత్తుల్లో ఉన్న తమ తాతలు,తండ్రులు,తల్లులు పడిన బాధలకు తమ తరపు చైతన్యంతో పల్లవి కట్టే ప్రయత్నం చేశారు. దళితోద్యమకారులు బి.సిలను తమతో కలుపుకుపోవడానికి నిరాకరించినప్పటికీ సహనుభూతికి,స్వీయానుభూతికి తేడా ఉండదని నిరూపించే క్రమంలో ఉద్యమ జైత్రయాత్ర చేరుకున్న డెడ్ ఎండ్ గోడలను పగలగొట్టే ఊతం ఈ "వెంటాడే కలాలు-వెనుకబడిన కులాలు" కవితా సంకలనం. 2001లో జూలూరి గౌరిశంకర్ సంపాదకత్వంలో ఇరవై మూడు మంది కవుల కవిత్వంతో స్పృహ సాహితీ సంస్థ ద్వారా వెలువడింది బి.సి.సూర్యోదయ కవిత్వం. సాహిత్య చరిత్రలో బి.సిల గొంతులోంచి బి.సిలుగా పలికిన బి.సి ఆత్మగౌరవ కవిత 'వెంటాడే కలాలు-వెనుకబడిన కులాలు'. నిచ్చెన మెట్ల సమాజంలో మధ్యస్తంగా ఉన్న నడిమి కులాల గొంతుకకు అక్షర రూపమైంది కవిత్వం. సకల వృత్తుల సమస్త చిహ్నాలు తెలుగు సాహిత్యంలో అస్థిత్వ సంతకాలుగా మారిన వేళ ఆ జీవితాల ఆక్రందనలే అక్షరాలుగా మారిన ఒక చారిత్రక సందర్భంలో 'వెంటాడే కలాలు' వెలువడింది.

ఈ విధంగా బి.సి అస్థిత్వ సాహిత్యానికి దారులు వేసారు 'వెంటాడే కలాల కవులు.

బి.సి కవిత్వంలో సూర్యోదయాన్ని చూపిన ఆ కవులను
మనసావాచా గౌరవిస్తూ వారికే -

ఈ 'సమూహం' అంకితం.

# సమూహ గానం

**ఈ** కవిత్వమొక సమూహ గానం. ఇదొక సామూహిక ఆర్తనాదం. ఆర్ద్రనాదం. ఈ నాదాలన్నీ వాదాలు, సంవాదాలు కావచ్చు. సంవేదనలు మాత్రం ఒక్కటే. ఈ కవుల సమూహం బి.సి. సామాజిక వర్గం. ఈ కవిత్వం రాసిన కవులు ఊళ్ళో ఉన్నందుకు గర్వపడటం లేదు. వాడలో లేనందుకు సంతోషమూ పడటం లేదు. అటు అగ్రవర్ణమూ కాలేక ఇటు ఉగ్ర వర్ణంగా మారనూ లేక సతమతమవుతున్నారని అర్థమవుతున్నది. వీళ్ళు అంబేడ్కర్–పూలే ఆలోచనా ధార వెంట కొనసాగుతున్నట్లు బోధ పడుతుంది. అయితే వీళ్ళంతా రాజ్యాధికారం కోసం అడుగుతున్నారని, దేనికైనా, ఎంతకైనా తెగించి పోరాడాలని అంటున్నారని అనుకోలేం. ఈ కవుల కవితల్లో వ్యక్తమైన కులవేదన మాత్రం నిజం. వీళ్ళు ఎవరితో కలవాలో, ఎవరితో నడవాలో, ఎవరెవరితో కలబడాలో ఎవరి ప్రక్కన నిలబడాలో, ఎవరికి ఎదురునిలిచి తలపడాలో దారులు స్పష్టపడనట్లుగా తెలుస్తూనే ఉంది. పోనీ ఈ కవులు ఆత్మగౌరవం ఒక్కటే మాకు కావలసిందని కూడా అడుగుతున్నట్లు లేదు. ఆత్మ గౌరవం కంటే ముందు అన్నం అడుగుతున్నారు. బ్రతుకులు చితికి పోయాయంటున్నారు. జీవితాలు శిథిలమయ్యాయంటున్నారు. చేతివృత్తులు ధ్వంసమయ్యాయంటున్నారు. వీళ్ళేమీ మనువాద వ్యతిరేకులు కాదు. వీళ్ళను తనువాదులు అనుకోవచ్చు. తమ తనువులు, తమ తలరాతలు సరిగ్గా లేవని మాత్రం అంటున్నారు. గ్లోబలైజేషన్‌ను ఒక ప్రధాన కారణంగా చూపుతున్నారు. అంతకు మంచి కూడా ఏమీ మాట్లాడటం లేదు. తమ సామాజిక స్థితిగతులు, తమ కుల అనుభవాల వత్తిళ్ళలోంచి కాకుండా తమను 'ఉసిరికాయ మూటలు' అని సంభావిస్తున్న వత్తిడి బృందాల కారణంగానే అంబేడ్కర్ అని, పూలే అని, సామాజిక న్యాయమని, బౌద్ధం అని అంటున్నారనంటే వీరి చైతన్యంలోని నిజాయితీని శంకించినట్లువుతుంది.

బి.సి. కులాల పట్ల, బి.సి. కులాలు సంఘటితం కావటం పట్ల ఎవరి అవగాహనలు వారికి ఉన్నాయి. ఎవరి అధ్యయనాలు వారివి, ఎవరి సిద్ధాంతాలు వారికి ఉన్నవి. బి.సి.లు కలవరని, బి.సి.లు బి.సి.లతో కలిసి ఉండలేరని ఒక స్థిర

నిశ్చితాభిప్రాయం ప్రచురంగా ఉంది. ఇది వాస్తవం కూడా. వేల ఏళ్ళుగా ఈ కులాలు శ్రామిక కులాలు, ఉత్పత్తి కులాలు, చాకిరీ కులాలు. వీళ్ళు ఆధారపడ్డవారు. ఆశ్రితులు. ఈ ఆశ్రిత సంబంధం వల్ల అంత త్వరగా వదులుకోవలసిన వాటిని వదులు కోలేరు. నిరాకరించాల్సిన వాటిని నిరాకరించలేరు. ఉగ్రతకు వీళ్ళ జీవన విధానంలో పెద్దగా స్థానం లేదు. ఉగ్రించి ఉరకడానికి వీరికి ధైర్య సాహసాలు చాలవు. ఎందుకంటే వీళ్ళను ఏ మిషనరీలు చేరదీయలేదు. ఏ మత ఔదార్యమూ ఉద్ధృతంగా వీళ్ళకు చదువు సంధ్యలు నేర్పలేదు. కనీసం ఒక బైబిల్‌నైనా బహుకరించలేదు. గత దశాబ్దిన్నర కాలంగా తెలుగు గ్రామాలలోని శూద్రకులాల నుంచి మతం మారుతున్న వాళ్ళను గమనించి చూడండి... ఈ బి.సి. కులాలకు తాము హిందువులమని తెలుసో లేదో కాని, క్రైస్తవులు కారని మాత్రమే తెలుసు. హిందూమతం, బ్రాహ్మణీయ భావజాలం లాంటి మాటలు బి.సి. కులాల చదువుకున్న యువకుల నోటినుంచి అరుదుగా వినపడతాయి. కులాధిక్యతతో బలంగా తలపడాలంటే నీకొక ప్రత్యర్థి మతముండాలి. ఆ మతం పట్ల కనీస స్థాయిలో విశ్వాసమైనా ఉండాలి. భ్రమలైనా ఉండాలి. ఈ రెండూ బి.సి. కులాలకు ఉన్నాయని బలంగా చెప్పలేం. ఈ సంపుటిలో భిన్న బి.సి. కులాలకు చెందిన కవుల స్వరాలను కొంచెం ఆలకించండి. ముఖ్యంగా యాదవులు, సర్ణకారులు, గౌడ కులాలకు చెందిన కవులు రాసిన కవితలను పరికించండి. స్వర భేదం, స్వర తీవ్రత మనకు తెలుస్తుంది. అదే విధంగా చాకలి, మంగలి కులాలకు సంబంధించిన కవితలను ఒకటికి పదిమార్లు చదివి చూడండి. 'స్వర హీనత' 'స్వర లుప్తత' మనకు కవిపిస్తుంది. వీరిని లొంగిపోయిన కులాలు, వంగిపోయిన కులాలు, కుంగిపోయిన కులాలు అని రేపు ఎవరైనా సులభంగా వర్గీకరించవచ్చు. అందులో సామంజస్యమే ప్రశ్నార్థకం. రాజ్యాధికారం వైపు శరవేగంతో బహుజన సమూహం, సమాజం కదులుతూ ఉన్నదని గత రెండు దశాబ్దాలుగా వింటున్నాం. నాలుగు ఎన్నికలు వాటి అనుభవాలు చూశాం. అగ్ర వర్ణ నాయకత్వాన్ని గానీ, ఉగ్ర వర్ణ నాయకత్వాన్ని గానీ బి.సి.లు నమ్మడం లేదనేది వాస్తవం. ఇటువంటి స్థితిలో బహుజన మేధావులకు బి.సి. కులాల మీద ఎటువంటి అవగాహన ఉందో చూడాలి... "అధిక శాతం జనాభా కలిగిన బి.సి.ల్లో ఇప్పటికీ ఐక్యత అన్నమాటే రావడం లేదు. పైగా బ్రాహ్మలు తమ ఆధిపత్యాన్ని కొనసాగించడానికి ముందుకు తెచ్చిన హిందుత్వ రథానికి గుర్రాలుగా ఉపయోగపడుతున్నది బి.సి.లే. బి.సిలంతా ఇంకా హిందూవులమనే భ్రమలోనే బ్రతుకుతున్నారు. హిందూ మతమే కులవ్యవస్థను సృష్టించిందని, అదే మన మధ్యల చిచ్చు పెడుతోందనే వాస్తవాన్ని తెలుసుకోలేకపోతున్నారు. కుల వ్యవస్థ వల్ల

ఆపాదింపబడిన వివక్ష కూడా వీరి మీద నామ మాత్రంగానే ఉండటం కూడా వెసులుబాటును కల్పిస్తోంది. అందుకే బీసీ కులాలు ఎంత వీలైతే అంత ఎక్కువగా హిందూవైజ్ కాగలిగాయి. బ్రాహ్మణిజాన్ని తరాలుగా మోసేందుకు సిద్ధపడ్డాయి బీసీ కులాలు. బ్రాహ్మణిజం ఆడిస్తున్న ఆటలో పావులుగా మారుతున్నవి కూడా బీసీలే" అని చరిత్రలో బి.సి.లను దోషులుగా నిలబెట్టజూస్తున్న శక్తులు కూడా హిందూవైజయ్యాయని డివిజన్ పాలిటిక్స్‌ను అటు రాజకీయ రంగంలోనూ, ఇటు సాహిత్య సాంస్కృత రంగంలోనూ ప్రతిఫలిస్తున్నాయని పై వాక్యాలు ప్రబలంగానే ఉదాహరణలుగా నిలుస్తాయి. వీటిని 'గురివింద గింజ' రాజకీయాలు అని అనసూలేం. అనకుండా ఉండనూ లేం. ఏది ఏమైతే నేం? కలదు కలదని చెపుతున్న కులం, మతం, బ్రాహ్మణీయ భావ జాలం మనందరి మధ్య కుల తిరుగుతూ ఉన్నది. బహుజన రాజకీయ వైఫల్యాలను కప్పి పుచ్చేందుకు దానిని బి.సి.లు కలిసి రాకపోవటంగా చూపటం, నింద బి.సి.ల మీద వేయడం ఒక చరిత్రను వంచించడం, వక్రీకరించడమే. బి.సి. నాయకుల వైఫల్యం ఎక్కడుందంటే వారు పూర్తిస్థాయి దళారులుగా మారక పోవటంలో ఉంది. అధికార రాజకీయ వ్యవస్థలోకి త్వరత్వరగా చేరుకోలేక పోవటంలో ఉంది. ఆ నాయకులు తొలుత దళారులుగా పూర్తి స్థాయిలో పరిణతి చెందాలి. ఆ పిదప ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి రాజ్య బెదిరింపు ఉద్యమాల్లాంటివి చేపాట్టాలి. రాజ్య రమతో స్నేహ, సాంగత్యాలు నెరపాలి. ఇది ప్రతికులం నుంచీ జరగాలి. కనుక ముందు మనం దళారులను రూపొందించుకోవటంలో నిమగ్నులం కావాలి.

క్రయ, విక్రయ రాజకీయవాదులుగా మారాలి. తెలుగుదేశం చేసింది పుణ్యమో, పాపమో కాని బి.సి.లకు ఒక రాజకీయ అస్తిత్వ ప్రతిష్టను తెచ్చిపెట్టింది. ఇది కొన్ని కులాలకే లబ్ధిని చేకూర్చింది. హైదరాబాద్, రంగారెడ్డి ఇంకా అట్లాంటి సామ్యంగల నగరాలు లేదా జిల్లా కేంద్రాల నుంచి శక్తివంతమైన నాయకులు ఉద్భవించిన మాట వాస్తవం. అయితే అగ్రకుల నాయకుల ఫిరాయింపులకు దొరికినంత శీఘ్ర సామాజికామోదం ఈ నాయకులకు దక్కని మాట కూడా వాస్తవమే. ఇక్కడ లోపం బి.సి. కులాలదే ఇవి వ్యాపార కులాలుగా కనీసం మనస్తత్వ పరంగానైనా ఎదగాలి. ఇవి జరగడానికి వందల ఏళ్ళ సామాజిక రాజకీయ పరిణామాలు మన పరిసరాల్లో జరగాలి. ఎవరైనా పెద్దనోట్లను రద్దు చేసినంత సులభంగా, సునాయాసంగా పెద్ద కులలను రద్దు పరచలేరు. నిమ్న కులాలను మరీ ముఖ్యంగా అస్సలు రద్దు పరచకూడదు. ఎవడి కులం వాడికొక ప్రైడ్. కులాన్ని మోసేవాడు కూడా ఎప్పుడూ అవసరమే. సామాజిక శాస్త్రవేత్తలు సమాజంలో నేరం ఎంత అవసరమో, కులం కూడా అంత అవసరం అని ఎందుకనడంలేదో ఎప్పటికీ అర్థం కాదు. కుల గర్వాంధత

దట్టంగా వ్యాపింపజేసి ఇప్పుడు కులాలను వెళ్ళ గొడతామంటే ఎలా సాధ్య పడుతుంది? ఇప్పుడు మనం ఏలికలకు ఒక ప్రతిపాదన పంపవచ్చు. కులాలను వాటిని వెన్నంటి వచ్చే మతాలను నిర్మూలించండి. ఏ ప్రాంతం వాడైతేనేమి గురజాడ అనలేదా 'మతములన్నియు మాసిపోవును. జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును' అని. కుల నిర్మూలనను అమాయకంగానైనా మరోసారి అడుగుదాం. లేదా 'స్వచ్ఛంద కులత్యాగ ప్రకటన' సామూహికంగా లాల్ బహుదూర్ స్టేడియంలో గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధుల సమక్షంలో ఈ ఈవెంట్‌ను చక్కగా నిర్వహించుకోవచ్చు.

ఇంతకూ చెప్పేదేమంటే కులమొక తరగని ఇంధన వనరు ఎవరికైనా సరే.

అయితే బి.సి. కులాలు కూడా ఈ తరగని ఇంధన వనరులోనే మండుతున్నాయి. మండిస్తున్నాయి. మాటలను మంటలుగా కాకపోయిన చిన చిన్న రవ్వలుగా రాజేస్తున్నాయి. ఆ రవ్వలోంచి పుట్టిందే ఏ సమూహ కవిత్వోద్యమం.

'నూతన ప్రజాస్వామ్య వ్యవస్థకు నాంది పలుకబోతున్నాం' అని సమూహంలోంచి ఏరుకొండ నర్సింహులు ఎలుగెత్తుతున్నాడు.

'ప్రాంతీయ జనతా విప్లవాల కోసం/ చచ్చిందెవరు చంపిందెవరు/చచ్చి చరిత్ర కెక్కిన వాళ్ళలో నా వాళ్ళెందరు...?' అంటూ చిర్రా రాజేష్ ఖన్నా లెక్కలు అడుగుతున్నాడు.

'ఓట్లాయుధాలతో సిద్ధంగున్నం/ఇక మేము పూలే- అంబేద్కర్ బాటలో నడుస్తం
మమ్మల్ని మేమే పాలించుకుంటాం' అని కొండ్రు బ్రహ్మం తెగేసి చెపుతన్నాడు.

'అన్ని మారినమ్ గనీ మా బతుకులే / ఎప్పటి శిప్ప ఎనుగల్నే అన్నట్టున్నయ్ సూస్కుంటుంటే మారయిగనీ/ మార్చే ప్రయత్నం జెయ్యమని నా కొడుక్కన్న జెప్పాలె' నని కృత నిశ్చయాన్ని సొన్నాయిల కృష్ణవేణి ప్రకటిస్తున్నది.

ఇక కొలపాక శ్రీనివాస్
'సముద్రం తలాపుకుంటే సరిపోదు
సముద్రం మనదవ్వాలి' అని నిర్ద్వంద్వంగా చెపుతున్నాడు.

'ఏండ్ల నాటి ఆధిపత్యం ఎదుర్కొవడానికి
మారకత్తి నూరు తున్నం' అని మడత భాస్కర్ ఆవేశించి బయలు దేరుతున్నాడు.

రాపాక శ్రీనివాస్ డిస్కవరీలో..
' బలసిన సింహాన్ని/బరెగొడ్లు తరుముడు
బండెక్కి చూసి బహుఖుషయిన' అంటున్నాడు

డా॥ కందాళ శోభారాణి 'మరణానికి దగ్గరైన కులాలు' గురించి మాట్లాడుతూ-

"ఆధునిక రాజ్యం/ఉత్పత్తి కులాలకు ఏం చేసింది?/వృత్తులను పరిరక్షిస్తనని
సంక్షేమ పథకాలను వర్తింపజేస్తనని/ వాగ్దానాలు చేసి బిసిలు మీరంటూ

నామకరణం చేసింది" అని రాజ్య నిర్వాకం గురించి తేల్చి చెప్పింది. మట్టి చక్రం మనుషులను ఎలా తిప్పింది వివరించాడు సముద్రాల కుమారస్వామి. కుమ్మరి చక్రం కాదది బతుకు చక్రంగా గుర్తించమంటున్నాడు. ఐదేళ్ళు నోట్లోకి పోలేని దినాలు దాపురించిన కారణం 'ఐదు వృత్తుల ఐదువేళ్ళు పిడికిలి బిగించక పోవడం వల్లనే' అని దేవరకొండ భగవాన్ నిర్ధారించాడు. ఊళ్లో ఉపాధి లేక వలసవెళ్ళిన చేనేతన్నల చేయూతలేని వైనాన్ని రామా రత్నమాల వర్ణించింది.

"దొరోడా! నువ్వు దొరసాని దగ్గరే ఉండు బిడ్డా!/ బహుజన మహిళ బందూకవుతున్నది జాగ్రత్త" అంటూ అంబటి భాగ్య హెచ్చరిస్తున్నాది. లైంగిక దోపిడీ గురించి మాట్లాడతున్నది. తమని తాము సావిత్రి భాయ్ ఫూలేలు; చాకలి ఐలమ్మలం అని దృఢంగా చెపుతున్నది.

"ఊరంతా తాటి కమ్మలతో నువ్వు ఇండ్లు కప్పితే/ నీ ఇంటి పునాదులే కదులుతున్నాయి" అంటూ గీత కార్మికుడు గతిని, స్థితిని తెలియజేస్తున్నాడు అగపాటి అరుణ్. చాకళ్లు లేకపోతే సాంప్రదాయాలే సాగవని రాయరాకుల కార్తికరాజు అంటున్నాడు. 'బిసి అంటే బాక్ వర్డ్ క్లాస్ కాదు/ బిసి అంటే బాక్ బోన్ క్లాస్' గా నిర్వచిస్తున్నాడు బంటి శ్రీనివాస్ యాదవ్.

మాది ఎన్కబడ్డ కులం కాదు. ఎనక్కబడేసిన కులం అంటోంది జంగం హైమావతి.గ్లోబలైజేషన్ తెచ్చిన మార్పులు తమ జీవితాలకు ఎటువంటి ముప్పును తెచ్చి పెట్టాయో తెలుపుతున్నది. "మనిషి మరిచినా చరిత్ర మారదుకదా' అంటూ ప్రపంచానికి పెద్దోడు అయిన కంసాలి గురించి పలుకుతున్నాడు దార్ల నాగేంద్రాచారి.

ప్రతి పగలునూ రాత్రిగానే భరించిన చీకటి బతుకుల చావు చిత్రాలకు చరమగీతం పాడమని బిల్లా మహేందర్ కోరుతున్నాడు.

కుల నామ మొక్కటే మిగిలిందని తెలుస్తూనే- జయవీర్ కోటగిరి "ఇవ్వాల బహుజనులకు వారసత్వమంటే/ కులాలు కాదు/ వర్గాలు కాదు/ కులాల మూలాలు ఊడబీకే/ సంఘ జ్ఞానం" కావాలంటున్నాడు.

వజ్జీరు ప్రదీప్ మాత్రం సామాజిక న్యాయాన్ని భుజానికెత్తుకోకుండా మిగిలిపోయిన నిస్సహయతను చెపుతూనే "కదులుతున్నాం/ రాజ్యాధికారం వైపు/ ఇక మోస పోయేది లేదు/ ఇది పీష్వాల కాలం కాదు/ బహుజన కాలం" అని ప్రకటిస్తున్నాడు

అడప రాజు''రావాలందరు/రణమో రాజ్యమో తేల్చుకునేందుకు/ అగ్రభావజాలమనే అమానుషాన్ని/ అంత మొందించేందుకు!/ బిసిలంటే/ఉసిరికాయ మాటలుకాదు/ ప్రశ్నించే పిడికిళ్ళ తోటలు/ ఉద్యమ జల ఊటలు" గా అభివర్ణిస్తున్నాడు

నయా రాచరికపు సంకెళ్ళు తొలగించటానికి 'సామాజిక పిడికిళ్ళు' బిగుస్తున్నాయని ఎలకట్టె శ్రీనివాస్ అంటాడు. చేరాల సూర్యనారాయణ నేతన్న

ఛిద్రమైన బతుకును చూసి "సగం గుంట తవ్వి మగ్గం పెట్టుకున్న మా నేతన్న/ ఆ సగం గుంటలోనే కూరుకు పోతున్నడు" అని విషాధిస్తున్నాడు.

మహజనం పేరిట చింతం నాగరాజు పరిణామ క్రమాన్ని కవితాత్మక ఉద్వేగంతో వివరించాడు. జంబూ ద్వీప చక్రవర్తులు క్రమేణా బీసీలుగా వ్యవహరింపబడటాన్ని తెలిపాడు. పేర్లు ఏవైనా, ఎన్నైనా 'మేము మూలవాసులం' అనే అవగాహనతో ఉన్నాడు. అయితే రాజ్యాధికారం కోసం ఇప్పుడిప్పుడే మౌనాన్ని వీడి/ కాలు కదుపుతున్నోళ్ళం అంటూ తాము కోల్పోయిన ఒకప్పటి స్థితిని, దశను తిరిగి అందుకోవాలనే ఆకాంక్షను వెలిబుచ్చుతాడు. మనుషులు మనుషులుగా కాకుండా 'కులంగా నమోదు చేయబడ్డారు బీసీలుగా –' అని ఆక్షేపిస్తుంది వంగాల యశోద.

మానవ హక్కులను సాధించుకునేందుకు 'బంగారపు పనిచేసే వారందరం సంఘటిత మవుదాం" అని అనంతోజు మోహన కృష్ణ ఆశిస్తాడు. పట్టెడ మీద పడాల్సిన దెబ్బ బతుకు ఆయువు పట్టుమీద పడిందని చెపుతున్నాడు

కంచెర్ల శ్రీనివాస్ ప్రత్యేక స్మశాన స్థలం అడుగుతున్నాడు. అసమానతలు అన్నీ చెప్పి చావులో సమానత్వం కావాలంటున్నాడు. వీలయితే ఇతని వేదనను ఆలకించండి లేదా ఏ అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ ఔదార్యంలోనైనా ఒక విద్యుత్ వాటికను మంజూరు చేయించండి.

గూడురు ఉమ ఆరె కులం పక్షాన పశ్చాత్తపం ప్రకటిస్తోంది–

"పసుల గొంతు కోసి/పండుగ చేసుకోవడానికి/మాకేం మనసులేదనుకున్నారా?/ జానెడు పొట్ట నింపుకోవడానికి/ జంతువుల సంపుతన్నామే కానీ యాట కూర మొత్తం మేమే తింటామా ఏందీ?? అని నిలదీస్తోంది.

కాపన్న వెతలు అంటూ చేరాల సుధాకర్ ఒక వృత్తాంతాన్ని విడమరచి చెపుతున్నాడు.

తొలకరి వాన ఎదురు చూపునుంచి చినుకులు గింజలుగా రాలాక అమ్ముకో బోయినపుడు ఎదురైన అనుభవాన్ని వివరిస్తాడు– "మాయగాళ్ళ నోట్లో అన్నం కాపన్నకు మిగిలేది సున్నం" అని తేలుస్తాడు.

'కొలమానాలే కులమైనదాన్ని/నేనెట్లయిత బీసీని' అని రేనా ఈశ్వరయ్య దొమ్మరి తనం ఎట్లా తనకు అపాధితమైందో స్త్రీ స్వరంతో చెపుతాడు. "ఎవరికి సమీ కాని దాన్ని/ ఆధార్‌తో ప్రభుత్వ లెక్కల్లో చేరిన దాన్ని/వోటు కోసమే బీసీల జాబితాలో చేర్చబడినదాన్ని/ రాజ్యం చేసిన రంకుకు వ్యభిచారినైన దాన్ని" కులానికి ఓటుగా తప్ప ఇక ఏ గుర్తింపూ లేకపోటమే విషాదం. రాజ్యం ఏం చేస్తుందో సూచించాడు ఈశ్వరయ్య. ఈ తీవ్ర స్వరం మునుముందు దూషణను ఆశ్రయిస్తుందో, ఆగ్రహ తీవ్రతను హుందాగా సాధిస్తుందో చూడాలి.

మరో కవి బూర్ల వెంకటేశ్వర్లు అడుగుతున్నాడు – "అయ్యా!/ మీకు ఇనపడుతున్నదా/ మీ మానానికి బట్టగట్టినోళ్ళు/ బతికి బట్ట గడుత లేరు" అని. 'అవ్వ దారపోగు లెక్క' అయినా, నాయ్న 'నీళ్ళల్ల దీపం లెక్క' అయిపోయినా తమ నేత బతుకులు మారలేదనే అంటున్నాడు. కదురుమీద రంగురంగుల వాక్యాల దారాల్ని తన గుండె లెక్కనే సుట్టుకుంటూ వస్తున్నడు.

కోల్పోయిన రాజ్యం తిరిగి పొందటానికి యుద్ధం కదా చేయాల్సిందని చిత్రా రాజేష్‌ఖన్నా యుద్ధ తంత్రాన్ని నేర్పుకుంటున్నడు. 'సిజేరియన్ చేసైనా బిడ్డను బైటికి తీయాల్సిందే' అని నిర్ధారిస్తున్నాడు.

సొన్నాయిల నరేష్కుమార్ 'కులకళేభరం'తో సంవాదం చేస్తున్నాడు. దేవుడికి మనువు మదమెక్కిందని నిరాకరించి "పశుమాంసం తినే నేనూ/ నరమాంసం తినే నువ్వూ/ఎప్పటికీ ఒకటి కాలేం వదిలేయ్ నన్ను!!!" అంటూ 'శర్మ'తో మాట్లాడుతాడు.

తనకు నాగలికి ఉన్న సంబంధం తెగిపోయిందని వడ్ల సాయిలు చారి విచారిస్తాడు.

'వీరమల్లులు' అనుభవించబోయే 'రాజ్య' భోగాలను తలచుకుని తలెత్తుతున్నాడు గిరవర్మ చింతం. కులం ముల్లును కవిత్వంలో పెరికి వేస్తానంటున్నాడా!?

ఇక బహుజన తత్వాన్ని ఒడిసిపడుతూ ఇట్యాల వెంకట కిషన్ కవితను చూడండి.

బాపు...!/ నన్నెవరైనా మీ తండ్రెవరయ్యా అని అడిగితే.../ నెత్తికి తువ్వాల...,పెయిమీద బురద చుక్కల పొక్కల బనీను/ జబ్బ మీద నాగలి నడుముకి దగ్గరగా గుంజికట్టిన ధోతి/ గర్వంగా చెప్తాను నా తండ్రి ఒక రైతని/ తన చెమట చుక్కలతో ఈ నేలని సారవంతం చేసినోడు/తన పిడికిలితో ఈ దేశానికి నాగరికతని నేర్పినోడు/ అతడు జీవితాన్నే పోరాటంగా నెరిగిన సాగిపోయే నాగలికొన/అతడి దెబ్బలు తింటూనే కరిగిపోతూ వాడిని కోల్పోని గడ్డపార/ అతడు బొజ్జలూ నిమిరే, మీసాలు మెనలేసే పరాన్న జీవి కాదు,/పండితుడు కాడు ప్రవచనాలు చెప్పే మతగురువు కాడు/ అతడు వాస్తవములో బ్రతికే ఒక బుద్ధుడు/ అతడు తనతో బాటు కింది వర్గాలు / ఎదగాలని కోరుకొనే సాహు మహారాజు వారసుడు అంటాడు.

చింతం ప్రవీణ్ దూషణ బాణ భాషణాన్ని అందులోని అట్రాసిటీని ఎత్తి చూపుతున్నాడు.

"దొమ్మరిదానా/ పిచ్చకుంట్లోడ/ బహురూపులోడ/ అయ్యా!/ ఇవి తిట్లా...? /పలకరింపులా...?/ గొల్లోనికి మల్లెపువ్విత్తే/ బోటిపేగుల చాలోడా/ సాకలి– కోసం సన్నాసులు కొట్టుకోవడం/ అయ్యా...!/ ఇవన్నీ తిట్లా?/పొగడ్తలా? చెప్పమంటున్నాడు.

'కూడు గుడ్డకోసం/దేహాన్నే గూడుగా మార్చుకున్న సంచారులు' గురించి కూడా ప్రవీణ్ 'మిసిలీనియస్ ఖాతా' తెరిచి చూపిస్తున్నాడు. ఈ ఖాతాలోకి పెద్దనోట్లు కాకుండా కొంత 'గౌరవం' డిపాజిట్ చేయండి చాలు.

సహజీవనం, సమజీవనం ఏ సమాజానికైనా అవసరమే. దీనిని ఆయా సామాజిక రాజకీయ వ్యవస్థలు ఆహ్వానిస్తాయా, అనుమతి, ఆమోదాలు తెలుపుతాయా లేదా అన్నదే సమస్య. ఆహ్వానాలు, అనుమతి, ఆమోదాల కోసం నిరీక్షించకుండా ధిక్కరిస్తూ పోవడమే మార్గం. నిరసనే దారి. ప్రతిఘటనే అజెండా, అవమానింపబడిన వాడు మాట్లాడితే అందులో సాహిత్య/కవిత్వ సౌందర్యాలను వెతకలేం. వెల్లడవుతున్న వెతల్లోని ఒక ఆక్రోశం మాత్రం వినబడతూనే ఉంటుంది. వినాల్సిన చెవులున్నాయో లేదో తడిమి చూసుకోవాలి. ఆలకించే హృదయం ఉందో లేదో వెతుక్కోవాలి. ఆలోచించే మెదడు ఉందో లేదో తెలుసుకోవాలి.

ఈ కవిత్వం
వినే చెవుల కోసం
ఈ వేదన
ఆలకించే గుండె కోసం
ఈ వాస్తవ ప్రకటన
ఆలోచించే బుర్రల కోసం...
ఈ అనుభవ వ్యక్తీకరణ సామాజిక మార్పు కోసం
ఈ సమూహగానం రాజ్యాధికారం కోసం

**– సీతారాం**

ఖమ్మం
12-12-2016
'మిలాద్ ఉన్ నబీ'

## మూలాల్లోంచి... సమూహంలోకి..

తెలుగుసాహిత్యంలో బిసి వాదాన్ని బలంగా నాటిన వెంటాడేకలాలు వెలువడిన 15 సంవత్సరాలకు మళ్ళీ అదే పదునుతో, అంతే చైతన్యంతో ఇప్పుడు సమూహం పేరు మీద బి.సి. కవుల బి.సి. అస్తిత్వవాద కవితా సంకలనం రావడం నిజంగా సంతోషించవలసిన చారిత్రక సంఘటన. వెంటాడేకలాలు కవితా సంకలనంలో ఇరవై ముగ్గురి కవిత్వం ఉంటే యిప్పుడు వస్తున్న సమూహం సంకలనంలో 38మంది కవుల కవిత్వం ఉంది అనేకంటే బీసీ సమాజపు జీవితాలు అక్షరాక్షరం ఉన్నాయి అంటే సబబుగా ఉంటుందేమో. అయితే ఇప్పుడు వెంటాడే ప్రశ్న ఒక్కటే వెంటాడేకలాలు వచ్చి 15 ఏండ్లు అవుతుంది కదా మరి పదిహేను యేండ్ల నుంచి బిసి కవులందరూ ఎందుకు ఇంత నిర్లిప్తంగా, స్తబ్దంగా ఉన్నారు? ఆధునిక తెలుగు సాహిత్యంలోని అన్ని ప్రక్రియల్ని తమ సాహిత్యంతో సుసపన్నం చేసిన ఇప్పటికి చేస్తున్న బి.సి. కవులు రచయితలు, విమర్శకులు ఎందుకు బి.సి. వాదాన్ని బలమైన వాదంగా ఎస్టాబ్లిష్ చేయలేక పోయారనేది బి.సి. కవులనే కాకుండా బి.సియేతర కవుల్ని కూడా తీవ్రంగా తొలుస్తున్న సమకాలీన ప్రశ్న.

ఎప్పటినుంచో బి.సి. సాహితీకారులు తమ జీవితాల్లోంచి, అనుభవసారాల్లోంచి సాహితీ సృజన చేస్తున్నప్పటికి ఎందుకు వీళ్ళ సాహిత్యం బి.సి. అస్తిత్వవాద సాహిత్యంగా గుర్తించబడలేదు? అందుకు కారణం బి.సి. విమర్శకుల బాధ్యతారాహిత్యం వల్లనా లేక బి.సి.యేతర విమర్శకులు పట్టించుకోకపోవడం వల్లనా ? ఈనాడు దీని వెనుక దాగిన కారణాలేమిటో వెతికి బట్ట బయలు చేయాల్సిన బాధ్యత ఈనాటి తరం మీద ఉంది. ఈ బాధ్యతను భుజాన వేసుకున్న బీసీ రైటర్స్ యూత్‌వింగ్‌ను తప్పక అభినందించవలసిందే. ఏది ఏమైనప్పటికీ ఈ సంకలనం ఇలా పురుడుపోసుకొని మనచేతుల్లోకి రావటానికి భూమికను తయారు చేసి, ఎంతో శ్రమకోర్చి కవులందరితో కవితల్ని రాయించి పుస్తక రూపంలో తీసుకొస్తున్న యువకవి, విమర్శకుడు డాక్టర్ చింతం ప్రవీణ్ కుమార్ అక్షరాల అభినందనీయుడే.

యిప్పుడు రాజకీయంగా చూసినా బి.సి. నాయకులు అన్ని పార్టీల్లో ఉన్నారు కాని, అందరు కలిసి ఏకమై ఒక ప్రత్యామ్నాయ పార్టీని పెట్టి రాజకీయ శక్తిగా తయారై రాజ్యాధికారాన్ని సాధించుకోలేక పోతున్నారు. దీనికి కారణం బిసిల్లో ఉన్న ఆర్థిక, సామాజిక, రాజకీయ అసమానతలే కారణం కావొచ్చు. ఒకవేళ బి.సిలందరూ తమలోని తారతమ్యాలను, బేదభావాలను పక్కకు పెట్టి ఏకమైతే మాత్రం బి.సి.ల శక్తి ముందు ఏ శక్తి నిలబడలేదనేది నిర్వివాదాంశం. మరి ఎందుకు అందరు ఏకం కావట్లేదని మిలియన్‌డాలర్ల ప్రశ్న. ఈ విధంగా ఆలోచిస్తున్న క్రమంలోనే కేవలం రాజకీయాల్లోనే కాదు ఈ అనైక్యత బి.సి సమాజంలో కూడా చోటు చేసుకోవడం మూలాన ఆ ప్రభావాలన్నీ సాహిత్యంపై పడడం తత్ఫలితంగా బి.సి. సాహిత్యం కూడా ఒక వాదంగా నిలదొక్కుకోలేకపోయిందనేది సుస్పష్టంగా తెలుస్తున్నది.

ఆధునిక తెలుగు సాహిత్యంలో వాదాలుగా నిలదొక్కుకున్న స్త్రీవాదం, దళితవాదం మరియు మైనారిటీ వాదాలను పరిశీలిస్తే ఆ సాహిత్యాన్ని సృష్టించిన కవులు రచయితలు రాశిలో తక్కువైనా వాళ్ళు సాహిత్యకారుల్లో మరియు పాఠకుల మనస్సులో వేసిన ముద్ర చాలా గాఢమైనది. తెలుగు సాహిత్యంలో పైన పేర్కొన్న ఉద్యమాలు బలమైన వాదాలుగా నిర్మించబడటానికి కారణం వాళ్ళు ఉద్యమస్ఫూర్తితో మరియు కమిట్‌మెంట్‌తో కవిత్వాన్ని రాయడమే. ఆ విధంగా నిర్మించబడటానికి ఒకరిద్దరు కవులు తమ వ్యక్తిగత జీవితాల్ని కూడా త్యాగం చేసి సాహిత్య వుద్యమాలకు ప్రాణం పోశారు. వాళ్ళ సాహిత్యం మీద జాతీయ సెమినార్లు కండక్ట్ చేసారంటే వాళ్ళ సాహిత్యం సాహిత్యకారుల్నే కాకుండా విశ్వవిద్యాలయాల బుద్ధిజీవుల్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేశాయని చెప్పొచ్చు.

అయితే..,ఇప్పటివరకు ఏ ఒక్క బి.సి. కవి కానీ, రచయిత కానీ, విమర్శకుడు కానీ బి.సి. కవిత్వాన్ని, సాహిత్యాన్ని, బలమైన వాదంగా చరిత్రలో నిలిచిపోయేలా ప్రయత్నం చేయకపోవడం చారిత్రక తప్పిదం. ఇది తప్పకుండా బి.సి. కవులు మరి ముఖ్యంగా బి.సి. విమర్శకులు ఇంట్రోస్పెక్ట్ చేసుకోవాల్సిన సందర్భం. కొన్ని సార్లు చాలా మంచి బి.సి. కవిత్వం. కథలు వ్రాసి కూడా పుస్తక రూపంలో తెచ్చుకోలేని కవులు. కథకలు చాలా మంది ఉన్నారు. కాబట్టి అటువంటి బి.సి. కవులు, రచయితలు రాసిన సాహిత్యాన్ని పుస్తకాల రూపంలో తీసుకొచ్చి పాఠకులకు, సాహితీ ప్రియులకు అందించే బాధ్యతను తీసుకునే బి.సి. విమర్శకులు, పబ్లిషర్స్ యొక్క అవసరం కూడా ఈనాడు ఎంతైనా ఉంది.

ఇప్పటికైనా బి.సి. కవులు, రచయితలు, విమర్శకులు కళ్ళు తెరిచి కనుమరుగవుతున్న తమ కుల పురాణాల గురించి, తెరమరుగవుతున్న తమ కుల సంస్కృతి, ఔన్నత్యం గురించి, తమ వృత్తిలోని గొప్పతనం గురించి, తమ వృత్తులోని కళాకారుల గురించి, వారి కళానైపుణ్యం గురించి ముందు ముందు తరాలకోసం రికార్డు చేయాల్సిన అవసరం ఉంది. అంతిమంగా రాజ్యాధికారం వైపుకు పయనించే కవిత్వ సృష్టి జరగవలసి ఉన్నది.

వెంటాడే కలాల తర్వాత ఇన్నాళ్లకు మళ్ళీ సమూహం పేరుమీద వస్తున్న బి.సి. అస్తిత్వవాద కవిత్వ సంకలనాన్ని మనసారా ఆహ్వానించాలి. 38 మందితో వస్తున్న ఈ బి.సి. యువ కవిత్వ సంకలనంలో 7 గురు కవయిత్రులు ఉండటం నిజంగా అభినందనీయం. వీళ్ళలో కొందరు ఇప్పటికే సాహితీసేధ్యం చేస్తున్న వాళ్ళే. చాలామంది కొత్తవాళ్ళు అయినప్పటికి సాంద్రతతో నిండిన అద్భుతమైన కవిత్వం రాశారు. వీళ్ళంతా వాళ్ళ వాళ్ళ కులాల్లోంచి, కులవృత్తుల నేపథ్యాల్లోంచి, వాళ్ళ తాత తండ్రులు వాడిన పనిముట్ల భాషల్లోంచి, ఆకలి మంటల్లోంచి, ఇప్పటికీ రెక్కాడితేగాని డొక్కాడని బడుగు బలహీన వర్గాల ఎండిన బతుకుల్లోంచి, గొంతెత్తి కవిత్వీకరిస్తున్నారు. నిజంగా ఈ కవుల కళ్ళనీళ్ళ కవిత్వం, బాదల్లోంచి వచ్చే కవిత్వ బాష అర్థం కావాలంటే ఆ కళ్ళ నీళ్ళలోని ఉప్పదనం, ఆ బాధల కింద దాగిన వేదనని ఆహ్వానించే సహృదయం కావాలి. అర్థం చేసుకునే సంస్కారమూ కావాలి.

యుగ యుగాలనుంచి బి.సి.లు ఆకుపచ్చని నవ్వులకు దూరమై. నిరంతరం కనిపించని ఓయసిస్సుల కోసం వెతికే ఎడారి బాటసారులైనారు. ఎంత అత్యంత దారుణంగా అణచబడి, చెరచబడినారో గత కాలపు ఎండిన గోడలపై గీసిన మాసిపోనీ రక్తపు గీతలే వాళ్ళ చరిత్రకు నిలువెత్తు సాక్ష్యం. బి.సి.లకు జరుగుతున్న అన్యాయాన్ని ధిక్కరించాల్సిన, ఒక కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టాల్సిన అవసరం గురించి ఏరుకొండ నరసింహులు ఇలా అంటాడు.

“అందుకే అందులో మేము
మ్లేచ్ఛులమై, నీచులమై, నిక్రుష్ఠులమై
చండాలురమై, శూద్రులమై
చరిత్రలో మొదటి మానవ హక్కులోధ్యమానికి
నాంది పలికిన శంభూకులమై కనిపిస్తాం.”

బి.సి.లంటే వెనుకబడ్డ కులాలు కాదు వెనకేయబడిన కులాలనేది నగ్నసత్యం. వేల వేల సంవత్సరాలనుంచి ప్రతి ఉద్యమానికి ముందుండి సమిధులైనది బి.సి.లు కాదా ! ఉత్పత్తి కులాలైన బి.సి.లు అన్ని రంగాలలో ఎంతో పురోగతి సాధించి సమాజాభివృద్ధికి తోడ్పడినా బి.సి.లను వెనకబడిన కులపోల్లు అంటున్నారే కానీ అగ్రకులాలకు ఇచ్చే గౌరవం ఇస్తున్నారా !? అందుకే బండి శ్రీనివాస్ 'యాదవవేదన' అనే కవితలో ఇప్పటికి మారని వాళ్ళ బతుకుల గురించి మా బతుకులు మారవా అని ప్రశ్నిస్తున్నాడు :

'మమ్మల్ని "వెనకబడ్డోల్లు" అని మీరంటాల్లు కాని
వెనక నిలబడ్డోల్లం అని మేమంటాం
బిసి అంటే బ్యాక్ వర్డ్ క్లాస్ కాదు
బిసి అంటే బ్యాక్ బోన్ క్లాసు అని గుర్తుంచుకోండి' అంటున్నాడు.

మంగల్లోల్ల బతుకు గురించి సొన్నాయిల కృష్ణవేణి రాసిన 'మారని బతుకు' కవిత చదివితే నిజంగా కండల్లో నీళ్ళు తిరుగుతాయి. మన బతుకులు మారతాయి బిడ్డ అని వాళ్ళ అయ్య అన్న మాటల్ని గుర్తుచేసుకొని రాసిన కవిత్వ వాక్యాలు ఈనాటి ఆధునిక కాలంలో కూడా యిప్పటికి కడు దుర్భర జీవనం సాగిస్తున్న మంగలి వాళ్ళ జీవితాన్ని ఆవిష్కరిస్తాయి. వాళ్ళ వృత్తిలో వాడే పని ముట్లు మాయమై కొత్త రకమైన పరికరాలు వచ్చిన వైనాన్ని తన కవితలో బొమ్మకడుతుంది కృష్ణవేణి యిలా :

'ఔ మల్ల మా అయ్యా అన్నట్లే అన్ని మారినై
మా అయ్యా వాడిన మంగలి కలుపు
జాడ లేకుంట వొవ్వింది
పాతకాలపు కత్తులు గోర్గాల్ మారి
బ్లేడ్లు, ట్రిమ్మర్లు అచ్చినయి
కొత్త కొత్త క్రీములు లోషన్లు అచ్చినయి
అన్ని మారినై గలని మా బతుకులే
ఎప్పటి శిప్ప ఏనుగుల్నే అన్నట్టున్నయ్'....

మంగలి వాళ్ళ జీవితం గురించి మరియు వృత్తి గురించి శక్తివంతమైన కవిత్వాన్ని రాస్తున్న వనపట్ల సుబ్బయ్య నాగర్ కర్నూల్‌లో తన కులవృత్తియైన మంగలి పనిచేస్తూ, ప్రవృత్తిగా కవిత్వాన్ని రాస్తుంటాడు. తన రోజువారి కులవృత్తిలోని అనుభవాలను ప్రత్యక్షంగా అనుభవించి సామాజిక సంఘటనలతో మేళవించి తనదైన ప్రత్యేకమైన

డిక్షన్‌లో కవిత్వం రాసే సుబ్బయ్య 'కుర్చీ' అనే కవితా సంకలనాన్ని వెలువరించాడు. కుర్చీ కవితలో మంగలి కులస్తులకు జరుగుతున్న అన్యాయం గురించి ఇలా వాపోతాడు :

'ప్రజల్నెంత వంచించిన
ప్రతిసారి కుర్చీ నీదే
క్షౌరకళాసేవాలు ఎంత చేసినా
అరవై ఏళ్ళ అసెంబ్లిలో స్థానం లేని నా కుర్చీ'

అంటూ స్వాతంత్ర్యం వచ్చి అరవై ఏళ్ళు అయిన అధికార కుర్చీకి అమడ దూరంలో ఉన్న బడుగు బలహీన బహుజన వర్గాలు మరీ ముఖ్యంగా మంగలి వాళ్ళు. అగ్రవర్ణాల వారి రాజకీయ ఎత్తుగడలకు ఏలా ఎక్స్‌ప్లయిట్ చేయబడుతున్నారో తనదైన తీవ్రమైన స్వరంతో ప్రొటెస్ట్ చేస్తాడు. బి.సి.ల లోని సేవక కులాలు తరతరాలుగా అగ్రవర్ణా వాళ్ళకు ఎంత సేవ చేసినా రాజకీయంగా ఎదగలేకపోతున్న సైనాన్ని ప్రశ్నిస్తాడు.

వృత్తులు, కులాలు పుట్టినప్పటినుంచి విశ్వకర్మలు తమ వృత్తులతో సామాజిక పురోగతిలో భాగమై పుట్టుక నుంచి చావు వరకు మనుషుల మనుగడతో మమేకమైతూ సమాజాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తూనే ఉన్నారు. కాని, ఆధునిక కాలంలో అన్ని వృత్తుల్లో మెషిన్లు వచ్చి వాళ్ళా జీవితాల్ని చిన్నాభిన్నం చేశాయి. అందువల్ల వాళ్ళుచేసే వృత్తిలో పనిలేక వేరే పనులు చేయలేక అప్పుల పాలై వాటిని తీర్చలేక ఎన్నో కుటుంబాలు ఆత్మహత్యలు చేసుకున్నాయి. కొంతమంది ఊళ్ళల్లో పనిలేక పట్టణాలకొచ్చి రోజువారి కూలీలుగా మారుతున్నారు. అందుకు సిసలైన ఉదాహరణకే కటుకోజ్వల రమేష్ కవిత "మండుతున్న కుంపటిలా" కవిత. కంసాల్లోల జీవితాలు రెడిమేడు షాపుల వల్ల పనిలేక ఎలా అతల కుతలం అయినాయో రమేష్ చాలా సాంద్రంగా కవిత్వం చేశాడు ఈ క్రింది కవితలో...

'సత్యాన్ని నిత్యం త్రాసులో కొలుస్తూ
రక్తసింధువై స్వేధబిందువై
మా చూపులా దోసెళ్ళ నుండి నాయన
కాలధర్మంలోకి ఒలికి పోయిన క్షణం గుర్తుంది
యిప్పుడు అంగట్లో ఆత్మీయతల్లేవు
మమకారం పెనవేసుకున్న ఆభరణాల్లేవు
అన్ని రెడిమేడులై

షో కేసుల్లో వేళ్ళాడటం చూస్తుంటే
సువాసనల్లేని
కాగితపూవ్వలు గుర్తొస్తాయి'

రమేష్ కవిత "మండుతున్న కుంపటిలా" చదువుతున్నంతసేపు నాకు 2001లో మొట్టమొదటి సారిగా తెలుగుసాహిత్యంలో విశ్వబ్రహ్మణుల జీవితం గురించి రాసిన నా "కుంపటి" దీర్ఘకవిత లోని వాక్యాలు కొన్ని మదిలో మెదలాయి

'కుంపటి
మాకు జీవితం
జీవించటానికి వెలుగు
కష్టాలూ చుట్టుముట్టినప్పుడు
మా కన్నీళ్ళకు చెమ్మగిల్లే
చెక్కిళ్ళను తుడిచే వేడి వేళ్ళు
మా గుండె ధైర్యం
అది మా జీవనవేదం
మమ్మల్ని పలికించే తంత్రినాదం
మా బడుగు వర్గాల పర్యాయపదం'

బి.సి కులాల్లోని ప్రతీ కులానికి ప్రత్యేకత ఉంది బి.సి. లంటేనే కళాకారుల కులాలు. బి.సి.లల్లో చాలామంది కళామతల్లి ముద్దుబిడ్డలు. ప్రతి కులానికి తమదైన భాష,నుడికారాలు ఉన్నాయి. వృత్తికి సంబంధించిన పనిముట్టు వాటి పేర్లు చాలా కళాత్మకంగా ఉంటాయి. ఎన్నో కులాలు తమ ప్రత్యేకమైన భాషతో సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయి. ఇప్పటికి చేస్తున్నాయి కూడా. అలాంటి వృత్తికి సంబందించిన భాషను వాడుక భాషతో మమేకం చేసి రాసిన అద్భుతమైన కవితలు ఈ సంకలనంలో చాలా ఉన్నాయి. అలాంటి గుండెను కదిలించే కవితే ఆగపాటి అరుణ్ కవిత "మొగి"ని మొరపెట్టుకో...

'మొగురం మొగులును తాకుతున్నా అదరపు
గుజిని కాళ్ళకు...
మోకును జబ్బలకు కేసుకొని
తాడిని తన్నే మొనగాడా
నీ తలనే తన్నే మోసంరా గీ ప్రపంచీకరణ

తాటిపై పురుగు పూసినా
తాటి గణులు రంపాలై కోసినా బెదరవు
మారు కత్తితో బదులు చెప్తావు
గీస కత్తితో మొరపెట్టి
వొడుపుతో కల్లు వోడుస్తావు
కంటికి కనపడని కత్తులు
ఏకంగా మొగినే మొరపెడితే
నీ వృత్తినే చెరపడితే
నీ కళ్ళు వడుస్తాయి... జాగ్రత్త జాగ్రత్త !!

మట్టిని కుండగా మార్చే క్రమంలో కుమ్మరి కళాకారులు ఎంత నైపుణ్యాన్ని కనబరుస్తారో సముద్రాల కుమారస్వామి తన మట్టి చక్రం కవితలో కుమ్మరి బతుకు గురించి, కుండలు తయారు చేసే విధానం గురించి వాళ్ళ కులవృత్తి బాషలో చాలా కళాత్మకంగా వర్ణించాడు.

'మట్టి మర్మము జూచి, మట్టిపెల్లల దెచ్చి
బొడిగ రాళ్ళేరి మట్టి సన్నగ దంచి
సన్నని ఇసుకను చాలినంతగా పోసి
మట్టి కుప్పను చేసి నీళ్ళతో తడిపి
కలగలసి పోయేలా తొక్కి తొక్కి
మట్టి చక్రముపై మట్టి ముద్దను చేర్చి
కుండలు, కూజాలు, పెర్వులు, అటికెలు చేసి
మన మట్టి కింతందము ఎక్కడినుండొచ్చునోయి' ...

ఈ మధ్యకాలంలో బిసి అస్తిత్వవాద సాహిత్యంలో వచ్చిన బలమైన దీర్ఘ కవిత బువ్వకుండ. బువ్వకుండ వస్తుపరంగాను మరియు కవిత్వ పరంగాను కుమ్మరి వాల్ల జీవితాన్ని చాలా అద్భుతంగా ఎలివేట్ చేసిన దీర్గ కవిత, కుమ్మరి వాళ్ళ జీవితాన్ని మరియు మానవ జీవన వికాసంలో కుండ యొక్క పాత్రను, కుండ పుట్టుకనుంచి ఇప్పటి ఆధునిక కాలం వరకు ఎలా పరిణామం చెందిందో అన్నవరం దేవేందర్ చాలా కవితాత్మకంగా వర్ణించాడు.

అది బువ్వకుండ
ఆకాశంలో శూన్యాన్ని

ముక్కలుగా కత్తిరించి
సుట్టువార మట్టిగోడలు కట్టి
సృష్టించిన గుండెకాయ

కుమ్మరి కుండను తయారుచేసే క్రమంలో కుమ్మరి పడే శ్రమను నైపుణ్యాన్ని చాలా శక్తివంతంగా కవిత్వాన్ని కుండంత అందంగా అల్లుతాడు అన్నవరం ఈ క్రింది పాదాల్లో...

మట్టిలో కుమ్మరి పురుగై తిరిగిన ఆయన
బూడిదలో బూడిదై
మొలిచిన ఆయన కాయం
ఇప్పుడు విచ్చుకుపోతున్న బోనం

ఈ సమూహం సంకలనంలోని కొంతమంది కవులు తమ కవిత్వం ద్వారా బహుజన ఈస్తటిక్స్ ప్రాణం పోశారు. అంటరానితనం ఎప్పుడో మాసిపోయింది అంటున్నారో కాని ఏడ మాసిపోయింది ఉల్లల్లో పోయిందా. వాడల్లో పోయిందా ? పట్టణాలలో కొంత లేకపోవచ్చు కాని పల్లెల్లో ఇప్పటికి ప్రాణంతో ఉందంటున్నాడు సొన్నాయిల నరేష్కుమార్ తన "కుల కళేబరం" కవితలో...

"ఊరికిద్దరుండే మీ ఆకలికి
వేలమందుడే మా ఆకలికి తేడానే లేదన్నావు
పక్క పక్కనే ఉన్నా మనిద్దరిమధ్య
తరతరాల తారతమ్యపు దూరం
కాగితాల రాతల్లో మనం సమానమే
కానీ,
ఇంకా మనూరి టకొట్లో గ్లాసుల్లా మనం దూరంగానే ఉన్నాం
సిటీలో రాసుకు తిరిగిన మన నీడలు
పల్లెల్లో పరిచయం లేని గోడలౌతాయి..."

కలిసి ఉన్నట్లు నటిస్తూ విడివిడిగా జీవించే కృత్రిమ జీవన విధానాన్ని టీకొట్లోని గ్లాసులతో పోల్చి కవి చెప్పుదల్చుకున్న విషయాన్ని చాలా బలంగా చెప్పాడు.

యుగాయుగాలుగా బహుజనులు శ్రమ దోపిడీకి గురై, తమ చేతుల కాయలతో అగ్రవర్ణాల వాళ్ళు తమ తోటల్ని ఎలా పండించుకున్నారో వాళ్ళ చెమట చుక్కలతో

వాళ్ళ పొలాల్ని ఎలా పండించుకున్నారో చింతం ప్రవీణ్ తన బిగ్‌బ్యాంగ్ కవితలో తన మాటల తూటాలతో ఇలా పిలుస్తున్నాడు.

"నెత్తురు కాల్వలు
వృత్తుల హత్యలు
చెరచబడ్డ చెమట చుక్కలు
కాలువలు గట్టిన కన్నీళ్ళు
ఇదా మా చరిత్ర
కోల్పోవడమే బతుకైన మా చరిత్ర
ఐనా ...
మీ ఇండ్లకు దర్వాజలైనోల్లం
మీ పంటకు కంచెలైనోల్లం
మీ విందులకు కంచాలైనోల్లం
మీ కుట్రలకు సమాధులైనోల్లం..."

ఈ సంకలనంలోని చాలా మంది కవులు అతి సహజమైన భాషను వాడి కవిత్వానికి వన్నె తెచ్చారు. వాళ్ళు సృష్టించిన కవిత్వ పారిభాషిక పదాలద్వారా కొత్త కొత్త పదబంధాల ద్వారా సహజమైన సంకేతాల ద్వారా వాళ్ళు ఎంచుకున్న కవిత్వ వస్తువులకు జస్టిఫై చేసే కవిత్వానికి శాశ్వతత్వాన్ని తీసుకొచ్చారు. ఇటువంటి హృదయమున్న, మనసును కదిలించే కవితలు ఈ సంకలనంలో చాలా వరకు ఉన్నాయి. అటువంటి అన్ని కవితల్ని ఇక్కడ ప్రస్తావించలేకపోతున్నాను. ఎందుకంటే అన్నిటి గురించి రాస్తుపోతే ఈ ముందుమాటే చాలా సుధీర్గమైన ముందుమాట అవుతుంది. కాబట్టి ఆ వెసులు బాటు కోసం కొన్ని కవితలనే ఇక్కడ ప్రస్తావించాను.

ఈ సమూహం కవిత్వ జీవితాల సంకలనాన్ని చదివి బి.సి. కవిత్వాన్ని రాస్తున్న బి.సి. కవులు మరియు కవిత్వ ప్రేమికులు ఇన్‌స్పైర్ అయ్యి బి.సి. అస్తిత్వవాద కవిత్వ ఉద్యమాన్ని నిర్మాణాత్మకంగా తయారు చేసి ఇంకా బలమైన కవిత్వాన్ని మరియు సాహిత్యాన్ని సృష్టించి భవిష్యత్ తరాలకు అందించి బి.సి. ఆత్మ గౌరవ జెండా లెగరేస్తారనే ప్రగాఢమైన విశ్వాసంతో...

**–డా. బాణాల శ్రీనివాసరావు**

## ఎడిటర్ వాయిస్...

బి.సి.లకు సంబంధించిన కవిత్వం తీసుకురావడం నిజంగా కత్తిమీద సామే. గత సంవత్సరం (2015 అక్టోబర్ నెలలో) లోనే ఈ "సమూహం" ప్రకటించినప్పటికి సంవత్సరం కాలం పాటు శ్రమిస్తేగాని దీనికొక రూపం రాలేదు. దానికి కారణాలు బోలెడు. అందునా 'యువ కవిత్వ సంకలనం'గా తీసుకు రావాలని ప్రయత్నించడం పెద్ద సాహసం. అయితే యువ కవిత్వమే అనుకోవడానికి ఒక బలమైన కారణం ఉంది. ఈ తరం బ్యాక్‌వర్డ్ క్లాసెస్ యువత ఆలోచనా విధానాన్ని తెలుసుకునే క్రమంలో 'సమూహం' కవిత్వ సంకలనాన్ని యువకవిత్వం వరకు పరిమితం చేయడం జరిగింది. ఒకటీ అరా యువకులు కాని వాళ్ళు ఉండొచ్చు..దాని విషయంలో సూక్ష్మ పరిశీలన అవసరం లేదు. మరొక విషయం ఏమిటంటే..,ఇదొక గొప్ప ప్రయత్నం కాకపోవచ్చు కాని మంచి ప్రయత్నం అనిపించుకుంటుందని నా నమ్మకం. నిచ్చెనమెట్ల వ్యవస్థలో అటు రాజ్యాన్ని ఒడిసిపట్టిన పై కులాలకు..,రాజ్యాంగం వైపున్న కింది కులాలకు నడుమ నిత్యం చస్తూ కేవలం ఓటుగా మారిన నడిమి కులాల అస్థిత్వపు ఆక్రోశపు కవిత్వాక్షర రూపమే 'సమూహం'

నిజానికి నా మిత్రుడు, బహుజనోద్యమకారుడు చిర్రా రాజేష్‌ఖన్నా నేను కలిసి తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగుస్తున్న క్రమంలోనే 2011-2012 మధ్య కాలంలో 'బి.సి. రాజకీయ కవిత్వం' తీసుకురావాలనే తీవ్ర ప్రయత్నం చేశాం. కానీ తెలంగాణ ఉద్యమంలో తలామునకలైన మన బహుజన కవులు, కవయిత్రులు దీన్నో సీరియస్ అంశంగా పరిగణించలేదు. అలా ఒక సంవత్సర కాలం పాటు పేపర్, సోషల్ మీడియాలో మీ కవితలు పంపండంటూ విన్నవించినా అతి తక్కువ మంది కవితలు పంపడం...వచ్చిన కవితల్లోనూ పుస్తకంగా తీసుకొచ్చే ప్రామాణికత లేకపోవడం తదితర కారణాల వల్ల ఆ లక్ష్యం అలా నీరుగారి పోయింది. ఆ తర్వాత నేను నా పరిశోధనలో తీరిక లేకుండా ఉండడం... తెలంగాణ ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొంటూనే కవిత్వ రూపంలో పరోక్ష మద్దతు తెలియజేయడం తదితర కారణాల

వలన అలా మూడేండ్లు గడిచిపోయాయి. ఈ లోపు నా పి.హెచ్.డి. పూర్తి కావడం పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ కోసం ప్రయత్నాలు మొదలయ్యాయి. ఏ అంశంపై పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌కు అప్లయ్ చేయాలనే మీమాంస నన్ను వెంటాడింది. ఆ క్రమంలోనే బి.సి సాహిత్యంపై నీ పి.డి.ఎఫ్. చేయాలని కొందరు ఆప్త మిత్రులు సూచించడం జరిగింది. ఇదే క్రమంలో మళ్ళీ బి.సి. సాహిత్యాన్ని చదవడం ప్రారంభించాను. ఇలా నా పోస్టు డాక్టోరల్ ఫెలో కోసం ప్రిపేర్ అవుతున్న సమయంలోనే బిసి కవిత్వ పుస్తకం తీసుకొద్దామని గతంలో మేం చేసిన ప్రయత్నం నా మదిలో మెదిలింది...కానీ ఒక వైపు భయం కూడా కలిగింది. మళ్ళీ ఒకసారి నిరాశ ఎదురైతే ఎలా అని...? ఈ విధంగా రకరకాల ఆలోచనలు నన్ను చుట్టుముట్టాయ్. ముందుకు వెళ్ళాలా..? ప్రయత్నం విరమించుకోవాలా? అని ఒకటే ఆలోచనలు- కానీ నేను ముందుకు వెళ్ళాలనే నిర్ణయించుకొన్నాను.

ఈ సందర్భంగానే కాకతీయ విశ్వవిద్యాలయపు విద్యార్థినైన నేను ఈ సారి నాలాగే ఆలోచించే మిత్రులతో కలిసి యూనివర్సిటీలోనే ఒక మీటింగ్ కాల్‌ఫర్ చేయడం జరిగింది. ఇలా ఒక రెండు నెలల కృషి తర్వాత నాలుగు సమావేశాల అనంతరం 'బి,సి. రైటర్స్ వింగ్' గా ఏర్పడ్డామంతా- మిత్రులు కొలిపాక శ్రీనివాస్, మడత భాస్కర్, చింతం నాగరాజు, తాడిచెర్ల రవి, రేనా ఈశ్వరయ్య, సొన్నాయిల కృష్ణవేణి, బైరి అశోక్, సముద్రాల కుమారస్వామి, దేవరకొండ భగవాన్, ఆగపాటి అరుణ్‌కుమార్, కక్కెర్ల దయాకర్, కొడారి తిరుపతి, నాగపురి కిరణ్మయి, సి.హెచ్. సూర్యనారాయణ, రాయరాకుల కార్తీకరాజు, ఎలికట్టె శ్రీనివాస్, తదితరులు ఒక సమూహంగా ఏర్పడ్డాం-నా బి.సి కవిత్వ ఆలోచనను వాళ్ళ ముందుంచగానే వాళ్ళు మంచి ఆలోచన అని వెన్ను తట్టడం...మొత్తంగా 'సమూహం' గా రావాలని సంకల్పించాం-

ఇక అక్కడ మొదలైనాయి నా అసలైన కష్టాలు... కవితలు పంపించండని పదే పదే అడగడం.. మెసెజ్‌లు పెట్టడం, పేపర్, సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేయడం ఈ సంవత్సర కాలమంతా చేశా- కొందరినైతే సంవత్సరమంతా అడిగా-ఇప్పటికీ కొందరు ఎక్కడైన కలిసిన వెంటనే అన్నా పోయెం పంపిస్తనే అని చెప్పడం వినీ

ఊరుకున్నా-ఇంకొందరు బి.సి. పోయెట్రీ ఏంటి అని ఎదురుదాడి చేసిన వాళ్ళను తట్టుకున్నా- ఈ సందర్భంగా కొందరు కొత్త బహుజన మిత్రుల పరిచయం కలగగా, చాలా మంది పాత మిత్రులను వదులుకోవాల్సి వచ్చింది- 'ఇంకొందరు మాట్లాడడమే మానేసారు...ఎక్కడ పోయెం అడుగుతాడో అని'- ఒక సందర్భంలో బి.సి. రైటర్స్ వింగ్ మిత్రులూ చాలా మంది మొహం చాటేశారు ఇదంతా అయ్యే పని కాదని. ఈ సందర్భంగా మిత్రుడు దార్ల నాగేంద్రాచారి నాకన్నా మొండిగా ఉండి ఈ కార్యం గట్టెక్కేలా చేసాడు. ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు. అదే విధంగా కొలిపాక శ్రీనివాస్,సముద్రాల కుమారస్వామి, రాజేష్‌ఖన్నా, సొన్నాయిల కృష్ణవేణి, తమ్ముడు కార్తీకరాజులు,ఇట్యాల వెంకటకృష్ణ,నరేష్కుమార్ సూఫీ ,పత్తిపాక సంతోష్ నాలో ఆవేశం చల్లారిపోకుండా అనుక్షణం మేమున్నామంటూ ప్రోత్సహించారు-వారికి ధన్యవాదాలు-

అలాగే మొత్తం ఈ సమూహం ప్రక్రియలో ఈ పుస్తకం ఒక చారిత్రక, సామాజిక అవసరమని నన్ను వెన్నుతట్టి ప్రోత్సహించారు మా గురువు గారు డా.పంతంగి వెంకటేశ్వర్లు గారు,అన్న సోమ రామ్మూర్తి గార్లు - వారికి ప్రత్యేక ధన్యవాదాలు.

ఇంకా...

**సహకరించిన కొందరికి-**

**సహకరించని అందరికి-**

**బహుజనోద్యమాభినందనాలు**

**-'బహుజన హితాయ:**

**బహుజన సుఖాయ:'**

## కవితలు...


| | | |
|---|---|---|
| చీకటి సూర్యులు | ఏరుకొండ నరసింహస్వామి | 28 |
| బానిసకొక బానిస | చిర్రా రాజేష్ ఖన్నా | 31 |
| మేమే పాలించుకుంటం | కొండ్రు బ్రహ్మం | 33 |
| మారని బతుకు | సొన్నాయిల కృష్ణవేణి | 35 |
| సముద్రం మనది కావాలి | కొలిపాక శ్రీనివాస్ | 37 |
| గరళకంఠులం | మడత భాస్కర్ | 39 |
| డిస్కవరి | రాపాక శ్రీనివాస్ | 41 |
| మండుతున్న కుంపటిలా | కటుకోజ్జుల రమేష్ | 42 |
| మరణానికి దగ్గరైన కులాలు | డా॥ కందాళ శోభారాణి | 44 |
| మట్టి చక్రం | సముద్రాల కుమారస్వామి | 46 |
| పేరులోనే విశ్వం | దేవరకొండ భగవాన్ | 48 |
| నరాలే దారాలై | రామా రత్నమాల | 50 |
| చదువుకున్న సావిత్రి బాయ్‌ల | అంబడి భాగ్య | 53 |
| మొగిని మెరపెట్టు | ఆగపాటి అరుణ్ | 55 |
| చాకిరి బండ | కార్తీకరాజు రాయ్‌రాకుల | 57 |
| యాదవ వేదన | బండి శ్రీనివాస్ యాదవ్ | 60 |
| కొలిమి | దార్ల నాగేంద్రాచారి | 62 |
| చరమగీతాన్ని పాడండి | బిల్లా మహేందర్ | 64 |
| కులనామమొక్కటే మిగిలింది | జయవీర్ కోటగిరి | 66 |

| | | |
|---|---|---|
| శివాజీ కత్తి ఎత్తి | వజ్జీరు ప్రదీప్ | 68 |
| మేల్కోవాలె | అడప రాజు | 70 |
| బిగిసే పిడికిళ్ళు | ఎటికట్టె శ్రీనివాస్ | 72 |
| నేతన్న బ్రతుకు | చేరాల సూర్యనారాయణ | 73 |
| మహాజనం | చింతం నాగరాజు | 74 |
| పేరైతే ఉంది | వంగాల యశోద | 76 |
| సుత్తి పట్టెడ | అనంతోజు మోహనకృష్ణ | 78 |
| చచ్చినా దక్కని సమానత్వం | కంచెర్ల శ్రీనివాస్ | 80 |
| మనసు కఠినం కాదు | గూడూరు ఉమ | 82 |
| పోగుల గూడు | జంగం హైమవతి | 83 |
| కాపన్న వెతలు | చేరాల సుధాకర్ | 85 |
| కొలమానాలే కులమైనదాణ్ణి | రేనా ఈశ్వరయ్య | 87 |
| పిడికెడు గుండెలు | బూర్ల వెంకటేశ్వర్లు | 89 |
| ఒక యుద్ధం చెయ్యాలె | చిర్రా రాజేష్ ఖన్నా | 91 |
| కుల కళేబరం | సొన్నాయిల నరేష్కుమార్ | 93 |
| బోసిబోయిన దాతి | వడ్ల సాయిలు చారి | 96 |
| పురగిరి క్షేత్రియ | గిరివర్మ చింతం | 98 |
| వాట్ ఈస్ అట్రాసిటీ | చింతం ప్రవీణ్ | 101 |
| మిసిలినీయస్ ఖాతా | చింతం ప్రవీణ్ | 102 |
| కాలుతున్న తనువులు | యోచన | 106 |
| బాపు.. | ఇట్యాల వెంకట కిషన్ | 108 |
| బిగ్‌బ్యాంగ్ | చింతం ప్రవీణ్ | 114 |

## చీకటి సూర్యులు 1

– ఏరుకొండ నర్సింహులు

ప్రవాహపు నిశీదిలో
ఇసుకపై మా వాల్లు గీచిన అక్షరాలు
నది రౌద్రించి ఉప్పొంగినపుడు కొట్టుకుపోయి
చెరచబడి శవంలా మారింది మా చరిత్ర

త్రవ్వకాల సౌధాల సాక్ష్యపు నీడల్లో
మా రక్తం ఇంకిపోయింది

దరిత్రిని సస్యశ్యామలం చేసిన
ఎండిన డొక్కల్ని
ఎముకల ఎడారులుగా మార్చి
వాటితో పరులకు సింహాసనాన్ని పేర్చి
దన్నెక్కడానికి జరిగిన వరదల యుద్ధంలో
రక్తాన్ని నదులుగా పారించి
అందులో నరాల కుంచెను ముంచి
సింహాసన ఊహల చిత్రాన్ని గీసి
మా చరిత్రకే
చితిని పేర్చుకున్న వాళ్ళం
అందుకే....
అవి ఇసుకపై గీసిన రక్తాక్షరాలు
ప్రవాహంలో కొట్టుకుపోబడ్డాయి

సమానత్వపు సంద్రాన్ని దాటి
అదనపు ఉత్పత్తిలో ఓడ తేలియాడి
సింహాసనంగా మారి
పన్నుల కొరడాతో
మా శవాలపై కరాళ నృత్యం చేయించిన
స్వర్ణయుగంలో
ఛింద్రపు చీకటి జీవితాలు మావి
ఇది ప్రవాహం పొడుగూతా జరిగింది

అందుకే అందులో
మ్లేచులమై, నీచులమై, నికృష్టులమై
చండాలురమై, శూద్రులమై
చరిత్రలో మొదటి మానవ హక్కులోద్యమానికి
నాందీ పలికిన
శంభూకులమై కనిపిస్తాం

అందుకే
నాటి నుండి నేటి వరకు
అతికి నూతన చరిత్రను నిర్మించబోతున్నాం

ఇటుకల్లో నాణేల్లో ఫలకాల్లో దాగిన
మా వాల్ల రక్తపు అక్షరాలకు
పేర్లు పెట్టబోతున్నాం

మా చరిత్రకు ఆధారాలుగా మార్చబోతున్నాం
మీ కర్కష మత్స్య న్యాయంలో
గిలెటిన్లకు బలైన అమరుల
ఎముకలను
పెన్నుగా, గన్నుగా మార్చి
ప్రజల చరిత్ర నిర్మించబోతున్నాం
అదనపు ఉత్పత్తిలో తేలిన
సింహాసనాన్ని పెను తుపానులో ముంచి
నూతన ప్రజాస్వామ్య వ్యవస్థకు
నాంది పలుకబోతున్నాం

## బానిసకొక బానిస 2

-చిర్రా రాజేష్ ఖన్నా

బానిసకు స్వేచ్ఛ వుంటుందా!
ఆకాశమంతా విహరిస్తున్నానని
గర్విస్తున్న గాలిపటం స్వేచ్ఛ నీది

బానిసకు స్వతంత్ర్యముంటుందా!
రెక్కల్ని విడిచిపెట్టి కాళ్ళకు కట్టేసిన
స్వతంత్ర్యం నీది
వాడి ఆదేశాలు మాత్రమే పాటించే
రక్త మాంసాల రోబో

గర్జించిన వసంత మేఘం పంచిన
భూమోంత పారించిన నెత్తురెంత
ప్రాంతీయ
జాతీయ జనతా విప్లవాల కోసం
చచ్చిందెవరు చంపిందెవరు
చచ్చి చరిత్ర కెక్కినవాళ్ళలో
నా వాళ్ళెందరు...?

పంజరంలో బంధించిన
వేటగాడు చెబుతున్న
స్వేచ్ఛా పాటం వింటూ

ధ్వనించి పోతున్నావ్
మిత్రమా
నీవనుకుంటున్నావ్ వాడు నీకు
అక్షరాలు నేర్పాడని
బతుకు నేర్పాడని

నేననుకుంటున్నాను
వాడికి నువ్వు తెలివైన బానిసవని
మైడియర్ కాస్టి ఇంటలెక్చువల్ స్లేవ్
ఏ రాయైతేనేం తల పగుల గొట్టుకోవడానికి
అన్నట్టు
ఏ పార్టీ అయితేనేం భావ దాస్యంలో ముంచడానికి
ఇంకా....
అంబేద్కర్
అడ్డు తగిలి గట్టిగా అరిచాడు
వొరేయ్...
మనుషులు మన వాళ్ళేరా
మెదళ్ళు మాత్రం శత్రువులది అని-

## మేమే పాలించుకుంటం 3

– కొండ్రు బ్రహ్మం

మనువుగాడి రాతలకు
మా తలరాత గిట్లయింది
అరికాలు నుంచి పుట్టి
ఆదిపత్యకులకు సేవచేసే
అంగడి సరుకులం మేం
మురికి బట్టలను
మల్లెగ జేసే ముతక జీవులం
గచ్చుపోదల గడ్డాల గొరిగి
మీ ముఖాలను బంతి పూలుగ జేస్తిమి
ఊపిరితిత్తుల నిండా గాలి పీల్చి
ఊది ఊది ఊపిరాగుతుంటే
పేరుకు మాత్రమే “స్వర్ణకారులం”
మా బతుకంతా “మరణకాలమే”
ధనవంతుల భవంతులకు
తవ్విన పునాదులం
బతుకుబండల్ని పగులగొట్టిన వడ్డెర్లం
నీ శాఖాహార సూత్రానికి బువ్వ దొరక్క
కత్తితో కండగ కోయడానికి సిద్దంగున్న
మటన్ కొట్టులో మాంసం ముద్దలం
కఠిన బతుకుల ‘కటికలం’

గోచి గొంగడితో గొర్ల కాపరమై
ఊరొదిలి వలసబోయిన ఎర్రగొల్లలం
జబ్బలదిరి, జబ్బుపడి
రోడ్లు పగిలినట్లు మా గుండెలు పగిలె
బ్రతుకు దూరాలతో
ఆకలి వస్త్రాలు నేసినపుడు
ఆవే మాకు ఉరితాళ్ళవుతాయని
మా శవాల మీద కప్పుతారని తెలవలే

'చాకలి మంగలి పొత్తు
ఇంటికి దాని ఇత్తు' అనే పిచ్చి సామెతలతో
మా ఐక్యతను దెబ్బతీస్తిరి
ఇగ రాజ్యమెట్లస్తది?
విభజించి పాలించే
నీ కపట సూత్రాన్ని కనిపెట్టలేని
నిష్కపట బతుకులు మావి
దశాబ్దాలుగా వెనకబడిన తరగతులం
ఇంకా వెనక్కి నెట్టేయకురి
అదిగో తూర్పున ఎర్రడాలు వేసింది
మా వాడల్లో, పల్లెల్లో ఉద్యమాల సూర్యోదయమయితాంది
ఓట్లాయుధాలతో సిద్ధంగున్నం

ఇక మేము పూలే– అంబేద్కర్ బాటలో నడుస్తం
మమ్మల్ని మేమే పాలించుకుంటాం

## మారని బతుకు 4

-సొన్నాయిల కృష్ణవేణి

ఎన్నడన్న మన్సు నిమ్మలం లేక
మా అయ్యను యాజ్జేస్కుంటే
మా అయ్య కన్న మొదాలు
మా అయ్య వాడిన కలుప
యాది కత్తది
గా కలుప మా అరుగుమీది
గోడకున్న శిలుక్కొయ్యకు
తలిగిచ్చి ఉండేది
పొద్దుగాల లేవంగనే
గా కలుపకు మొక్కేది మా అయ్య
"ఏంది నాయినా! గదేమన్నా దేవుడా!
గదానికెందుకే మొక్కుతానవంటే
"మన బతుకే గండ్లున్నది గాదు బిడ్డా" అనెటోడు.
నాకయితే గండ్లెప్పుడు జూసినా
కత్తి, కత్తెర,కటోర,గోర్‌గాల్
కత్తులు నూరే తోలుపట్ట తప్ప
గా బతుకంటేంటిదో గాన్రాక పొయ్యేది
పండుగ నాడు పటేలింట్ల
బువ్వడుక్కచ్చే అయ్యతోని

ఏంది నాయినా మన బతుకులు
గిట్లున్నయంటే
"మన బతుక్కేంది బిడ్డ,రాజా బతుకు
గిన్నేడు నీల్లుంటె, గిన్నేడు కొత్తలు గాదు బిడ్డ" అనేటోడు
నీళ్లతోనే పైసలత్తె అడుక్కునేడు
ఎందుకే బాపూ అంటె
నవ్వుకుంటనే "మన బతుకులు సుత
మారుతయి తీ బిడ్డ" అనేది మా అయ్య
ఔ మల్ల మా అయ్యన్నట్టె అన్ని మారినయ్
మా అయ్య వాడిన మంగలి కలుప
జాడకు లేకుంట వొయ్యింది.
పాతకాలపు కత్తులు,గోర్గాల్
మారి బ్లేడ్లు, ట్రిమ్మర్లు అచ్చినయ్
కొత్త కొత్త క్రీములు లోషన్లు అచ్చినయ్
అన్ని మారినయ్ గనీ మా బతుకులే
ఎప్పటి శిప్ప ఎనుగుల్నే అన్నట్టున్నయ్
సూస్కుంటుంటె మారయి గనీ,
మార్చే ప్రయత్నం జెయ్యమని
నా కొడుకన్న జెప్పాలె

## సముద్రం మనది కావాలి 5

-కొలిపాక శ్రీనివాస్

వలలు ఆయుధాలై
పడవలు ఆసరా గా
కడలి కెరటాలపై
మత్స్యకారుల జీవన నావ
రాష్ట్రాలు దాటి, తీరంవెంబడి
బయలు దేరుతుంది
కోడి కూయకముందే

సంసార సాగరమీదడానికి
సాగరంతోనే నిత్యం పోరాటం
కడుపు ఆకలి తీర్చడంకోసం
సముద్రం కడుపులో
తలపెట్టే జీవన పోరాటం
మత్స్యకారులది

పస్తులతో
నకనకలాడే
ఆకలి పేగుల కోసం యుద్ధం.!
ప్రకృతి కరుణిస్తేనే..
లేదంటే
ప్రాణమే గల్లంతు

మృత్యుద్వారపు సుడి గుండాలెన్నో
రాకాసి వాయుగుండాలు ఎన్నెన్నో

నిత్యం చావు ఘంటికలు
మోగిస్తూనే ఉంటాయ్
ప్రతీ రోజు పద్మ వ్యూహంలోకి వెళ్లిన
అభిమన్యుడి తీరు బ్రతుకు మత్స్యకారులది

ఈ పోరాటంలో
విజయతీరాలకు చేరాలంటే
చేపపడాలి.!
'వల' నవ్వాలి.!
ఇంతా చేస్తే
చూస్తుండగానే
చేపల్ని
చేపలు పట్టిన మనుషులను
మింగుతున్నది
గ్లోబల్ చేప
వికటాట్ట కోసం చేస్తూ

"చేప చేప
నువ్వెందుకు దూపకూడ్చినవంటే"
సముద్రం తలాపుకుంటే సరిపోదు
సముద్రం మనదవ్వాలి
బోట్లు, వలలు కాదని" అరుస్తున్నది
మన చేప

# గరళ కంఠులం 6

– మదత భాస్కర్

అలసిన దేహాలకు
'అమృతం' పంచుతూ
అవమానాల విష గుళికల్ని మింగుతున్న
గరళ కంఠులం...

అనాదిగా అదేపనిగా
'సురాపానకం' అందిస్తున్న
మేం
'భూ సుతులం' కాక పొయ్యుండొచ్చు
కనీసం మనషులం కాదా!
ఈ దేశంలో భాగం కాదా!

కల్లును
అమృతంలా ఆదరించిన రోజులు బోయి
గిప్పుడెందుకు మా బతుకులు
'చీపు లిక్కరు' కన్నా
'చీపై' పోయినై

మీ గుండె మీద
చెయ్యేసి చెప్పుండ్రి....

పుట్టిన కాన్నించి
పిట్టదాకా....
కల్లు తోటే కదా
కాకి అయినా మీ ఇంటి కొచ్చేది....
మరి
గిప్పుడెందుకు
మా కల్లు చేదయ్యింది...
నిజంగా
మా కల్లు పులుపెక్కిందా?

పెద్ద పెద్ద
తుఫాన్లల్ల కూడా మూడు మాట్ల
'మెర' పెట్టి వచ్చినోళ్ళం....
మీ అగ్రవర్ణపు అహంకారం జూసి
మా కిప్పుడు
'మెర మెర' అంటాంది...
ఏండ్లనాటి మీ ఆధిపత్యాన్ని
ఎదుర్కోవడానికి
'మార కత్తి' నూరుతున్నం
జనాభా లెక్కలల్ల
కాట గలపిన మా జీవితాలను
కాపాడుకోడానికి
'కాటమయ్య'ను మొక్కి
బయలుదేరినం...

## డిస్కవరి 7

– రాపాక శ్రీనివాస్

ఇంతకు
ఎవ్వడు
ఎవరికి ఏమిత్తాండు

కక్కింది తినమంటున్నారా...?
గత్తరాసన ఏసుద్ది

చెట్టు మీద దోరపల్లను
దోసిల్ల చూసి మురిసినోల్లం
ఆశగా...ఆబగా...
జేబుల్ల నింపుకోవడానికి
అగడు బడ్డోల్లమనుకుంటున్నారా...?
అడవి తల్లిని
అడవిల్నే చూసుకున్నం.
అతికించిన అద్దం ముక్కలల్ల కాదు

బలసిన సింహాన్ని
బరెగొడ్లు తరుముడు
బండెక్కి చూసి
బహుఖుషయిన

సూడంగ సూడంగ నాకోటి తోత్తాంది
బతికిన పాఠశాల
బహుజనులకు నేర్పే బతుకు పాఠమిదేనా...

# మండుతున్న కుంపటిలా..! 8

–కటుకోఝ్వల రమేష్

పొద్దున్నే పట్టెడు చప్పుడు
మా బతుకుల్ని తట్టిలేపేది
పలుగు రాళ్ళతో పట్టెడ సానబెట్టి
పని మొదలెట్టేవాడు నాయిన

ఊపిరి గొట్టంతో ఊదీ ఊదీ
నాయిన కళ్లు రెండూ..
కొలిమిలోని నిప్పు రవ్వలయ్యేవి
కడుపులో ఆకళ్ళు
సెగలు సెగలుగా రగిలినా
నాయిన పనిలోనే మునిగిపోయేవాడు

సిరాకు మంటకు
మొఖమంతా ఎర్రబడ్డా
పుస్తల తాడును పేనీ.. పేనీ...
పట్టీలకు గజ్జల్ని అతికీ అతికీ..
అస్తమిస్తున్న సూర్యుడయ్యేవాడు

పొద్దుబూకిందంటే
కాస్తంత కెంపేసుకుని
ఆనందపు ఊసుల్లోకి జారేవాడు

కల్లువాయికాలతో నవ్వుల్ని పూయించేవాడు
బంగారు నగరకు వనమ పెట్టినట్లే
మాటకు మంచితనాన్ని అద్దేవాడు
పరుగు తీస్తున్న దు:ఖాన్ని
పట్టకారుతో పట్టీ
బెత్తడు సంతోషాన్ని కమ్మెచ్చుతో సాగదీసి
బారెడు బతుకుల్లో పంచుకున్న వైనం గుర్తుంది

సత్యాన్ని నిత్యం త్రాసులో కొలుస్తూ
రక్తసింధువై స్వేదబిందువై
మా చూపుల దోసిళ్ళ నుండి నాయిన
కాల దర్మంలోకి ఒలికిపోయిన క్షణం గుర్తుంది

ఇప్పుడు అంగట్లో ఆత్మీయతల్లేవు
మమకారం పెనవేసుకున్న అభరణాల్లేవు
అన్నీ రెడీమేడులై
షో కేసుల్లో వెళ్ళాడటం చూస్తుంటే..!
సువాసనల్లేని
కాగితపువ్వులు గుర్తొస్తాయి
మనసు చివుక్కుమంటుంది

అంగట్లో ఇప్పుడు అన్నీ ఉన్నా
నిజం అబద్ధం
ఒకే మూసలో కరుగుతున్నా
అచేతనంలో వున్నా నాయినా
మండుతున్న కుంపటిలా..!

# మరణానికి దగ్గరైన కులాలు 9

–డా. కందాళ శోభారాణి

చాతుర్వర్ణ సిద్ధాంతం
బ్రాహ్మణ ఛాందసమే పరిఢవిల్లి
సమాజాన్ని ముక్కలుగా చేసింది

శూద్రులంటు శ్రామిక తెగలను
పరాన్నబుక్కులకు బానిసలను చేసి
పాపకర్మ గొంతు నొక్కింది
అనాదిగా నేటికి
శ్రామిక కులాలు చాకిరీ కులాలు
పాలక వర్గానికి బానిసలైనవి

సాంప్రదాయ వృత్తులు చతికిల బడ్డాయి
అంటిపెట్టుకున్న వనరులు చేజారిపోయాయి
కలిసిసాగిన వృత్తులు కలహించుకున్నాయి
మానవ సంబంధాలు మంటగలిశాయి
మనుషుల మధ్య తిరుగాడుతూనే
మనిషి ఒంటరయ్యాడు
పెనవేసుకొని బ్రతికిన వృత్తులు కనుమరుగైనవి
మనసు చెదిరిన మనిషి మరణానికి చేరువయ్యాడు

కుమ్మరి వాములు గానుగ మరలు
మేదరి బుట్టలు తడకలు శాలల మగ్గం
కర్రునాగలి చేసిన కమ్మరి బండి చక్రం తిప్పిన వడ్రంగి
చిర్ర చిప్పనుండి గాబులను చేసి తట్టబుట్టలల్లి
తడకలల్లి ఆవాసాలకు సొగసులద్దిన మేదరి
మానవ నాగరికత వికాసానికి చేవనిచ్చిన
చేతివృత్తులన్ని మంటకలిసి కులాలు ఒంటరయ్యాయి

ఆధునిక రాజ్యం
ఉత్పత్తి కులాలకు ఏం చేసింది?
వృత్తులను పరిరక్షిస్తనని
సంక్షేమ పథకాలను వర్తింపచేస్తనని
వాగ్ధానాలు చేసి
బిసిలు మీరంటూ నామకరణం చేసింది

తలవంపు చావుకు పాలు పడ్డప్పుడు
మానవ సహాయక ప్రకటనలకు పరిమితమైంది
శ్రామిక కులాలకు విద్యను మిధ్యగా చేసి
సంపన్నుల ఆస్తిగా చదువును ఓడిసిపట్టింది
అనాదిగా బ్రహ్మణ ఛాందస సారాన్నే ప్రభుత్వాలు
ప్రజాస్వామ్యపు నీతిగా పాటిస్తు ఉన్నాయి

## మట్టి చక్రం 10

– సముద్రాల కుమారస్వామి

మట్టి మర్మము జూచి, మట్టి పెల్లల దెచ్చి
బొడిగి రాళ్ళేరి మట్టి సన్నగ దంచి
సన్నని ఇసుకను చలినంతగ పోసి
మట్టి కుప్పను చేసి నీళ్ళతో తడిపి
కలగలసి పోయేలా తొక్కితొక్కి
మట్టి చక్రముపై మట్టి ముద్దను చేర్చి
కుండలు, కూజాలు, పేర్వులు, అటికెలు జేసి
మన మట్టి కింతందమూ ఎక్కడి నుండొచ్చెనోయి
ఆది శిల్పివయా ఓ శాలివాహనా!
ఆరాధ్యుడవయా ఓ శాలివాహనా!

బూడిదందలో పోసి బొలిపి బొలిపి
చలువ బండతో కొట్టి చక్కనాకృతిని కూర్చి
నూనె గంతులు వేసి నున్నంగ జేసి
నఖశిఖ పర్యంతం నీకు బూడిదే నిండగ
విభూతి దాల్చిన పరమేశ్వరుడు బోలు
ఆది శిల్పివయా ఓ శాలివాహనా!
ఆరాధ్యుడవయా ఓ శాలివాహనా!

తిరుగుతున్న చక్రమే తిప్పింది మనలనూ
భోగభాగ్యాలను తెచ్చింది మమజులకా
శుభ కార్యాలకు చూడ చక్కనైన
ఐరేని కుండలు అమరి యుండును చూడు
బొడ్డు గురిగి నుండి చావు కుండ వరకు
తోడు నీడగా వుండి మనిషితో మసలింది

భావి తరాలకు భాగ్య దాతవు నీవు
నేటి తరానికి ఆరోగ్య ప్రధాతవు నీవు
ఆది శిల్పివయా ఓ శాలివాహనా!
ఆరాధ్యుడవయా ఓ శాలివాహనా!

కుమ్మరి చక్రం కేవలం
మట్టి చక్రం కాదయా
అది మనందరి
బతుకు- చక్రమయా!

## పేరులోనే విశ్వం... 11

-దేవరకొండ భగవాన్

పేరులోనే విశ్వం
బతుకులో కానరాని విశ్వాసం
దినం దినం కష్టాల ఉచ్ఛ్వాసం
కన్నీళ్ళ నిశ్వాసం
విశ్వబ్రాహ్మణులం మేం-

గొళ్ళెం, తాళం
బెడం
బాణం
కన్నెర తీగె
మిన్నగు జేసిందెవరయ్యా

గీత కత్తి
వ్రాత కత్తి
చేతి కత్తెర
అన్నీ నా చేతులోనేగా రూపం పోసుకునేది
ముక్కు పుడుకలు మొక్కు పుడుకలు
మోహనహారం మెల్తాడులు
సిగ బిల్లలు చింతాకు పతకాలు
ఆభరణాలన్నింటికీ
పురుడు పొసేది మేమెగా...
మీ ఒంటికి నిగనిగల నగల అందాన్నిచ్చేది మేమేగా

మరి మా బతుకులిట్టా
అంద విహీనంగా ఎందుకైనాయి

వంట పాత్రలు
జంట పాత్రలు
సింహ మూతుల
చక్కని బొమ్మాలి
చెక్కనమ్ములు
చరిత్ర కెక్కెను
మా వృత్తులేమో అటకెక్కెను
ఇదెంత తిరోగమనం

కుమ్మెరి సారే
సాలెల మగ్గం రాట్నం
చక్కని సుక్కల
సవారి కచ్చురం
బడుగు జీవుల బండి చక్రం
బండ రాయిలకై
ఒంటి బండిని
ఓనరుగ జేస్తివి
ఇంత నైపుణ్యమున్నా
పంచవృత్తుల పంచకర్మలకు
ఐదేళ్ళ నోట్లోకి పోలేని దినాలెందుకు
దాపురించినయ్...?

ఐదువృత్తుల ఐదు వేళ్ళు
పిడికిలి బిగించకపోవడం వల్లనే

# నరాలే దారాలై 12

– రామా రత్నమాల

పరిణామ క్రమంలో మానవుని వస్త్రధారణ
నాగరికతకు ఆనవాలు
ఆ సంస్కృతికి సృష్టికర్త నేతన్న
నవనాగరిక ప్రపంచంలో
కష్టపడ్డా కడుపు నింపని
చేనేత కులవృత్తి
ఆర్థిక భరోసానివ్వని బ్రతుకు దెరువు
దుర్భర దారిద్ర్యంలో చేనేత కార్మికులు
ఆకలితో అలమటిస్తూ
సరిగంజి పెట్టి
రంగు రంగుల పడుగు పేక పోగులతో
జలతారు అంచులతో
వస్త్రాలను నేసే నేతన్న
అగ్గిపెట్టెలో అమరే
అందమైన చీరను నేసి
అంతర్జాతీయ ఖ్యాతి గడించిన
అద్భుత కలా నైపుణ్యం
ఎంత అందమైన బట్టలు నేసినా

కట్టుకోలేని కటిక పేదరికం
నరాలు నర్తించే దారాలై
అద్భుత కళాఖండాలు సృష్టిస్తే
గిట్టుబాటు లేని ధరలు
మరో మార్గం లేక
అప్పుల పాలై
ఆత్మహత్యలకు ఒడిగట్టేవారు కొందరైతే
ఊర్లో ఉపాధి లేక
భార్యా పిల్లలను వదిలి
సూరత్, ముంబై, దుబాయి
బాట పట్టేవారు మరికొందరు
దైన్యస్థితిలో వలస వెళ్ళిన వారి
స్త్రీల జీవితాలు
సిరిసిల్ల చేనేతల చితికిన బ్రతుకులు
పోచంపల్లి పట్టు శ్రామికుల పాట్లు
ఇక్కత్ నేతకార్మికుల ఇక్కట్లు
ఒకప్పుడు కళకళలాడిన
చేనేత పరిశ్రమ
నేడు వెలవెలబోతుంది
కష్టాల సుడిగుండంలో
నష్టాల ఊబిలో ఉన్న
చేనేత వారికి మనమిచ్చే చేయూత
చేనేత దుస్తుల వినియోగమై

వెతల జీవితాలలో
వెలుగులు విరజిమ్మేలా-
ఆధునిక డిజైనతో హరివిల్లు అందాలు విరిసేలా
అనన్య ప్రతిభ చాటేలా
ఫ్యాషన్ ప్రపంచంలో అగ్రగామిగా నిలిచేలా
నవ చైతన్యంతో చేనేత పరిశ్రమ
పునరుజ్జీవించేలా
పాలకులు దృఢచిత్తంతో
పథకాల రూపకల్పన చేసి
అమలు చేసినప్పుడే చేనేతకు నిజమైన చేయూత!

# చదువుకున్న సావిత్రి భాయ్‌లం 13

– అంబడి భాగ్య

ఇన్నాళ్ళు నాకసలు అర్థం కాని
ప్రశ్నలెన్నింటికో
చిక్కుముడి వీడుతున్నది–
మాకు సమధానాలె గావాలె...
పాతకాలం ఎడ్డోలం కాదు
ఏం చెప్పినా తలూపడానికి–
చదువుకున్న సావిత్ర భాయ్‌లం
ప్రశ్నల కొడవళ్ళం–

ప్రశ్నలే ప్రశ్నలు చిక్కుముడి వీడని ప్రశ్నలు???

సర్వసంగ పరిత్యాగి ఐన సన్నాసులకు
చాకలి ఆడబిడ్డతో ఏం పని?
మడిలేని జీవితాలు
మైల చేస్తే పోయేదేముందనే చులకన తప్పు!

కల్లు కోసం
గౌండ్ల వాకిలి తొక్కే మీ చూపులు
కల్లుకుండ మీద ఎప్పుడైనా ఉన్నాయా...?
మీ నిషా కళ్ళంతా గాలించేది
మా అణువణువునే గదా!
వారీ!
మేం కల్లే అమ్ముకుంటాం
శరీరాలను కాదు–

ఇంతెందుకు...
మీ దొరస్వామ్యపు చీకటి పిండాలకు
పురుడు పోసింది మా మంత్రసానులే కదా
మరి, మా బతుకెందుకు
చీకటిగా మార్చాలని చూస్తున్నరు
దొరోడా! నువ్వు దొరసాని దగ్గరే ఉండు బిడ్డా!
బహుజన మహిళ బందూకవుతున్నది జాగ్రత్త!!

బతుకు మెతుకుల కోసం
చెమట చుక్కలు ధారపోసే
మా వడ్డెర ఆడబిడ్డలు
మీ పశు వాంఛలకు
స్వేద సంద్రం కావాల్సిందేనా
గుత్తే దారులారా....?

ఇంకానా ఇకపై మీ ఆటలు సాగవు
మేం చదువుకున్న సావిత్రి భాయ్ పూలేలం
సమాజాన్ని పసిగట్టిన చాకలి ఐలమ్మలం
జనాభాలో మెజార్టీ
మా కడుపున పుట్టిన బిడ్డలే...
ఒక్కసారి మేం కన్నెర్ర జేస్తే
కాలే శరీరాలు మీవవుతయ్

అదిగో కమ్మరి కొలిమి దగ్గర
నా ఆడపడుచు నిప్పు రాజేస్తోన్నది-

## 'మొగి' ని మొరపెట్టు 14

– అగపాటి అరుణ్

మొగురం మొగులును తాకుతున్నా అదరవు...
'గుజి'ని కాళ్ళకు,,,
'మోకు' జబ్బలకేసుకొని
తాడిని తన్నే మొనగాడా!
నీ తలనే తన్నే మోసంరా గీ ప్రపంచీకరణ...

తాటిపై పురుగు పూసినా,
తాటి గఋలు ఋంపాలై కోసినా బెదరవు
మారు కత్తితో బదులు చెప్తావ్
గీస కత్తితో మెరపెట్టి
ఒడుపుతో కల్లు వడుస్తావ్
కంటికి కనబడని కత్తులు
ఏకంగా 'మొగి'నే మెరపెడితే
నీ వృత్తినే చెరపెడితే
నీ 'కళ్ళు' వడుస్తాయి.... జాగ్రత్త... జాగ్రత్త...!!

లొట్టెడు కల్లు కోసం....
పటువెడు చెమట కక్కి...

‘ఆకాశ గంగ’ ను నేలకు దింపడానికి
పొద్దుకు మూడుసార్లు ‘భగీరథ’ ప్రయత్నాలు చేస్తవు....
నీ మీద నెనరేది ఈ సంఘానికి...
ఏలికల బడా ఆమ్‌దాని ఎక్సైజ్ రాబడేనట....!
అది... నీ నోటి కాడి నుండి గుంజుకున్న కూడే కదా..?!!

ఆదమరిపించే ఆనందాన్ని
ప్రకృతి నుంచి స్వచ్ఛంగా పంచే తపన నీది...
ఆదాయం కోసం మత్తులో ముంచి
బేరస్త్రం చేసుకొనే వికృతం వారిది...

గుడుంబాతో గండి పడుతదని గాయి గాయి చేసేవారు...
కల్తీకల్లు, లిక్కర్‌తో
నీ బొండిగ మీద కాలేసి కసితీరా తొక్కుతున్న వాడు,
వాళ్ళకు ఏ మాత్రం సోయికి రాదు పాపం...!
ఆయుధం పదును చూడడానికి
అరచేతినే గీసుకునే అమాయకుడివి నువ్వు పాపం...!

ఊరంతా తాటి కమ్మలతో నువ్వు ఇండ్లు కప్పితే..
నీ ఇంటి పునాదులే కదులుతున్నాయి..
ఇంకెన్నాళ్లు సహిస్తవ్?
నెర్సు తీసి... తాటి బద్దకు రాసి
కత్తులు నూరుకో...
ఆ ‘కాటమయ్యే’ తోడు నీకు...

## చాకిరిబండ 15

– రాయరాకుల కార్తిక రాజు

బోసిపోయింది చాకిరేవు
నునుపుదేలిన చాకిబండలతో..
మునుపున్నట్టు ఇప్పుడు లేని చాకలోళ్ళతో..

మరయంత్రాలొచ్చినై కదా
మార్కెట్లోంచి ఇంటింటికీ
ఇగ చాకలితో అవసరమేముంది?

వాషింగ్ మెషీన్‌లో
బట్టల పొగులూడుతున్నట్టు
చెదురుతున్న ఆశల గూడు
నేటి చాకిరేవు

మడేలయ్య చిన్నబోయిండు
తను మొదలెట్టిన వృత్తి
వాగులోని నీటి మట్టమోలె
క్రమంగా అడుగంటి పోతోందని

నేనెప్పటికీ గర్వంగానే చెప్పుకుంట
మేం రజకులమని
మాది రజక కులమని
ఏం లేకున్న
మకిలి పోగొట్టే మనసైతే ఉన్నది గదా

పురుడు పోయటం కాన్నుంచి
సావుకాడి దాకా సాకలోళ్ళే...
మా సాకలోళ్ళు గిట్ల లేకుంటే
అసలు గీ సాంప్రదాయాలెట్ల సాగుతై?

మాసిన గుడ్డలు ఉతికెటోళ్ళని
హీనంగా చూడకుండ్రి
మకిలి బట్టని మనసుతో
మురికి బట్టలు శుభ్రం చేసే
మానవతామూర్తులు చాకలోళ్లు

రసాయనిక సబ్బులు, సరుపులు రాకముందే
సౌడమట్టినే మలినం తొలగించే
కారకంగా వాడిన మేధావులు చాకలోళ్లు

అరవై కూరలు తింటారని
అలుసుగా చూడకుండ్రి

చేసిన దాస్యానికి మూల్యం
వాళ్లు అడుక్కునే ధాన్యం
అది మా శ్రమ ఫలం

సేవకు మారుపేరు చాకళ్లు
వాళ్లు లేకపోతే వాడిపోవా మీ వాకిళ్లు
చాకలి కులం కేవలం చాకలి కులం కాదు
క్లుప్తంగా చెప్పాలంటే అది చాకిరి కులం

స్వచ్ఛ భారత్‌లో వాడే
తాడిచెట్టంత చీపుర్లెన్ని పడ్తయ్
గీ వ్యవస్థ మైల పోగొట్టడానికి

దేశంలో
ఎన్ని చాకిబండలకు చేతులు మొలవాల్నో
గీ వ్యవస్థను బండకేసి కొట్టడానికి

## యాదవ వేదన 16

- బండి శ్రీనివాస్ యాదవ్

మా కులం యాదవ
ఇకనైనా మా బతుకులు మారవా?

బుడ్డగోచి, జబ్బకు గొంగడి, నెత్తికి రుమాలు, చేతుల కట్టె
చాలి చాలని సద్దిమూట, సంకకు ఆనిగే బుర్ర
పాత టైర్ల చెప్పులు, పడిపడి ఉరికే ఉరుకుడు

సరిహద్దు సైనికులోలె గొర్లకు పహారా, ఇదే గొల్లోని నిత్య కృత్యం
రిబోక్'షూ'లపై మోజు లేదు, ఖరీదైన కార్లయావలేదు
పాత టైర్ల చెప్పులే రిబోక్ షూలు, కాలినడకే ఖరీదైన కారు

పార్క్ ఎవెన్యూలపై మనసులేదు, పసిడిపైన ధ్యాసలేదు
ఎటు చూసినా గొర్ల రొచ్చు, నాలుగు గొర్లే నగలు నట్రా

రాజకీయాలు రణాలు తెలియవు, రంగు రంగుల బార్లో తెలియవు
"రాజిగ ఓరి రాజిగ గొర్రె పాయెరో" పిలుపుతప్ప

"గొల్లోనికి ఏం ఎరుక మల్లెపూల వాసన" అంటారు, కానీ
గొల్లోనికి గొర్లమీదనే ధ్యాసాయే, మల్లెపూల మీద మోజెక్కడ?
గొల్లోల్లు ఎర్రి గొల్లోల్లు అంటారు జనం కానీ

వేల గొర్ల మందలో తన గొర్రెను గుర్తుపట్టే గొల్లోడు
'ఐన్‌స్టీన్'కు తీసిపోతడా!

మా అయ్య అన్నడు "గొల్లోనికి సదువెందుకు" బిడ్డా అని
నేనన్న "భగవద్గీతను చెప్పిందే మన గొల్లోడయ్యా" అని

కర్మయోగి అయిన గొల్లోడు
రోజురోజుకు కాటికి దగ్గరైతాండు

మమ్మల్ని "వెనుకబడ్డోళ్ళు" అని మీరంటాళ్ళు కానీ
"వెనక నిలబడ్డోళ్ళం" అని మేమంటానం.. ఇప్పుడేమంటరు?

బిసి అంటే బాక్‌వర్డ్ క్లాస్ కాదు
బిసి అంటే బాక్‌బోన్ క్లాస్ అని గుర్తుంచుకోండి

## కొలిమి 17

– దార్ల నాగేంద్రాచారి

ప్రపంచానికి పెద్దోడు కంసాలి
నేడు ప్రపంచంలో పేదోడు కంసాలి
ఒకప్పుడు
బంగారం ధర తక్కువ – పని ఎక్కువ
మరి ఇప్పుడు పని తక్కువ– ధర ఎక్కువ

బంగారాన్ని మెరిసేలా చేసాం నాడు
నేడు బంగారం మెరుస్తూ ఉన్నా....
మా జీవితాలు రాగిలా వెలవెలబోతూనే ఉన్నాయ్

ఒక్కప్పుడు
కంసాలి ఇంటి ముందు
ప్రజల హెూరు....
అది
కళ్యాణమైనా..
పండుగైనా...
తాళిబొట్టు కోసమో...
చెవి కమ్మల కోసమో...
చేతి ఉంగరం కోసమో...
పది రోజుల ముందు ఆర్డర్ ఇచ్చి చేయించే నగలు
నేడు పది నిమిషాల్లో.....

రెడిమెడ్ షాపుల్లో దొరకబట్టే....
ఇంకా....
నాలుగు రాళ్ళు వచ్చేదెట్లా...
కడుపు నిండేదెట్లా...

విశ్వబ్రాహ్మణుల చేతిలో నగరాలే వెలిసాయి
కృష్ణుడి నగరం ద్వారాక నిర్మాణానికి కారకులు విశ్వబ్రాహ్మణులు
కాకతీయ శిల్పకళకు ఆధారం విశ్వబ్రాహ్మణులే...
మనిషి మరిచినంత మాత్రన
చరిత్ర మారదు కదా–

కానీ, నేడు
బంగారానికి నగిషీ చెక్కిన నైపుణ్యం
కొలిమిలో కాలిపోతుంటే
గాల్లో తేలియాడే బూడిదలా మారింది
నేటి విశ్వకర్మ బతుకు

బ్రతికితే చాలు
బంగారు ధగధగలు
వెండి నిగనిగలెందుకంటున్న
'బ్రతుకు జీవుడు' నేటి విశ్వకర్మ

## చరమ గీతాన్ని పాడండి!! 18

- బిల్లా మహేందర్

ఎన్ని
రాత్రుల్ని ఎదురు చూశామో...?
ఇంకెన్ని రాత్రుల్ని
ఎదురు చూడాలో...?

వెలుగులే
తెలియని మా బతుకులకు
ప్రతీ పగలూ రాత్రే కదా!!

మట్టిని
నమ్ముకున్నందుకు శాపమో...
మట్టే జీవితమై బతుకుతున్నందుకు పాపమో..

మట్టిని పిసికే మా చేతులు
మీకు సౌభాగ్యాన్ని ఇస్తుంటే
మాకు చావును రాసి పెడుతున్నాయి!!

అందుకే ఇప్పుడు
పంటల లెక్కల కన్నా
మా చావు లెక్కలే ఎక్కువైనయి

నిజమే
మీరన్నట్లు మా ఆత్మహత్యలను
మీరు రాత్రికి రాత్రే నివారించలేరు
మీ వద్ద ఏ మంత్రదండమూ లేదు..

కానివ్వండీ!!
ఎన్నో పగల్ని
రాత్రిలా గడిపినోళ్ళం..
ఇంకెన్ని రాత్రిళ్లు కావాలో తీసుకోండి!!

మంత్రమే చేస్తారో
మాయే చేస్తారో
ఇంకేమైనా చేస్తారో

కాని...
మా చీకటి బతుకుల్లో
కాస్తయినా వెలుగు నింపండి
మా చావు లెక్కలకు చరమగీతాన్ని పాడండి!!

## కులనామమొక్కటే మిగిలింది 19

–జయవీర్ కోటగిరి

అన్నం సప్పబడ్డది
చేతుల్ల పిసికి పిసికి
కన్నీటి దారల్ల తడిసి తడిసి
అన్నం సప్పబడ్డది

జీవచ్చవాలకు రుచి పచేమిటి
ఆకలి మంటల్ల అనాదిగా కాలిపోతనే వున్నం కదా
ఆయుష్యును అస్వాదించడానికి
అగ్రకులాల ఇంట పుట్టినమా

పట్టాలు లేని చదువులు
పట్టా పుస్తకాలు లేని వ్యవసాయం
పస్తులుండడమే నేర్పింది

ఆకలి మాటను చెరిపేసి
తండ్లాట లేని జీవనాన్ని
తన వారికిద్దామనే తలంపైతే ఉంది కానీ
వారసత్వంగా వారికియ్యడానికి
కులవృత్తులు లేవు కుర్చీలు లేవు
సూదరోళ్ళమనే
కులనామ మొక్కటే మిగిలి ఉంది–

వేదాల్లో వేదికెక్కిన వర్ణవ్యవస్థ
రంగుల మారితనం
వింత పోకడలు పోతాంది

ఇవ్వాల వారసత్వమంటే-
కులాలు కాదు
వర్ణాలు కాదు
కులాల మూలాలు ఊడబీకే
సంఘ జ్ఞానం-

## శివాజీ కత్తి ఎత్తి.... 20

– వజ్జీరు ప్రదీప్

ఛత్రపతికి పట్టం కట్టేప్పుడు
జరిగిన అవమానంలా రోజూ
అవమానాలు ఎదుర్కొంటున్నా
సర్దుకుపోతున్న సూదరోల్లం మేం

మమ్ము ఆరె క్షత్రియున్నరు
పరిపాలనలో దక్షులన్నరు
ఛత్రపతికి మీరే వారసులన్నరు...
చివరికి ఎన్కబడేసి
ఎన్కబడ్డోళ్ళన్నరు–

ఆనాడే పండిత కుట్రలు తెలిసినా
భావదాస్యంలో అదే ధర్మమనుకున్న ధర్మాత్ములం మేం
నాయనా!
శివాజీ క్షమించు తండ్రీ–
సాహూ మారాజ్ అప్పుడే కనిపెట్టి
సామాజికన్యాయ గుట్టు విప్పినా
దాన్ని భుజానకెత్తుకోని నిస్సహాయులం

ప్రజాస్వామ్యంలో ఆయువు మేమైనా
ఓట్ల జాతరలో ఉత్సవ విగ్రహాలవుతున్నాం...

రాజ్యాధికార పర్వంలో పావులుగా మారుతూ
పదవులకు బాసి పరాభవింపబడుతున్నా...
నిశ్శబ్దం గుప్పిట బంధీలమవుతున్నాం...

నాయనా! సాహు మారాజ్
నీ సామాజిక సూత్రమే మా దిక్సూచి
ఇక ఊరుకునేది లేదు
శివాజీ చేతిలో కత్తి ఎత్తి
కదులుతున్నాం
రాజ్యాధికారం వైపు
ఇక మోసపోయేది లేదు-
ఇది పీష్వాల కాలం కాదు-
బహుజన కాలం-

బహుజనుల మా హితులని బహుగా నటించి
రాజకీయ కుటిలత్వానికి మమ్మల్ని బలి ఇస్తున్న
వామనత్వాన్ని ఇప్పుడిప్పుడే బద్దలు కొట్ట బయలుదేరుతున్నాం-

# మేల్కోవాలె! 21

– అడపరాజు

'బిసి' లందరు మేల్కోవాలె!
బడుగు బలహీనతలు తరిమెయ్యాలె!!
అగ్రాధిపత్యం ఆయువు తీరగ!
సమన్యాయం సజీవం కావలె!!

జనాభాలో సగానికి పైగా ఉండటం–
కాదు మనం!
ఎలక్షన్లప్పుడే అక్కెరకొచ్చుడు–
కాదు మన బలం!!

వెనుకబడిన కులాల పేరున
వెను–వెనక్కి నెట్టబడుతున్నోళ్ళం!
అన్నింటిలో అవసరమొస్తూనే
అసలు విషయాల్లో
పక్కకు పెట్టబడుతున్నోళ్ళం!!

ఎదిగే చోట ఎదగనీయకుండా
అగ్రాధిపత్యం–
అడ్డుపడుతున్నపుడు...
మన హక్కుల–
కాలరాస్తున్నపుడు...

పిడికిలి మారే మనకిక–
ప్రత్యామ్నాయం...

రావాలందరు...
రణమో రాజ్యమో తేల్చుకునేందుకు
అగ్రభావజాలమనే అమానుషాన్ని
అంతమొందించేందుకు!

బిసిలంటే
ఉసిరికాయ మూటలుకాదు
ప్రశ్నించే పిడికిళ్ళ తోటలు
ఉద్యమాల జల ఊటలు

# బిగిసే పిడికిళ్ళు 22

**– ఎలికట్టి శ్రీనివాస్**

మన జాగను, మన చేనును
మన బిడ్డలను, పసిగుడ్డులను
చెరబట్టెను, శెరబట్టెను
పాణాలే తీసేను
దొరలు, పెత్తందారులు
రజాకార్లు, జాగీర్దార్లు

నీచ రాచరికం కూల్చేందుకు
బిగిసే పిడికిళ్ళు
దొరస్వామ్యపు తలలు పగలగొట్టేందుకు
ఎత్తె సుత్తెలు
దాష్టీకపు మెడలు నరికేందుకు
లేపె కొడవండ్లు
గడీల గోడలనే గడగడలాడించ కదలే
సామాజిక పిడికిళ్ళు
తొలగుతాయ్
రాచరికపు సంకెళ్ళు
తొలగించాలి
నయా రాచరికపు సంకెళ్ళు

# నేతన్న బతుకు 23

– చేరాల సూర్యనారాయణ

అందంగా బట్టని నేసిన మా నేతన్న
నేడు అర్ధనగ్నంగా మిగిలిపోయారు
శ్రమను సౌందర్యమును మలిచి పెట్టి
పట్టు వస్త్ర పితాంబరములు సిద్ధం చేసిన మా నేతన్నలు..
నేడు ఉరితాళ్ళను నేస్తున్నారు.

వస్త్ర నిర్మాణంలో చురుగ్గా కదలే మా చేతులు
మార్కెటు పోటీలో
వట్టిగా మిగిలి పోతాయి
గాల్లో మేడలౌతాయ్

పోగు పోగు అతుకుతు దారంగా బట్టగా ఆవిష్కరించే
మా అద్భుత నైపుణ్యం
షావుకారి దగ్గర
అసలుపోయి నిలువెత్తు అప్పుగా నిలబడుతున్నది

నరాలనే పోగులుగా బట్ట నేసి ఇస్తున్న మా నేతన్న
తన గుండెను కండెగా మలచి నేస్తున్న మా నేతన్న
తన రక్తమునే రంగుగా అద్ది ప్రపంచపు తెర అవుతన్నడు
కానీ
ఇప్పటికి ఆ మగ్గంలో అర్ధ నగ్న ప్రదర్శనే
సగం గుంట తవ్వి మగ్గం పెట్టుకున్న మా నేతన్న
ఆ సగం గుంటలోనే కూరుకుపోతున్నడు

# మహాజనం 24

-చింతం నాగరాజు

అడవులు దాటి నదుల్ని ఈది సముద్రాల మీదుగా మోసుకెల్లి
ప్రపంచానికి నాగరికతను అందిచినోళ్ళం
అపుడు మమ్మల్ని జంబూద్వీప చక్రవర్తులన్నారు

చెట్లను కొలుస్తూ పాముల్ని పూజించి ప్రకృతిని ఆరాధించిన వాళ్ళం
మిగతా ప్రపంచమంతా మిమ్మల్ని
నాగజాతి అని పిలిచిండ్లు

దొంగ చాటు దురాక్రమణలతో దిక్కు తోచక బందీ ఐనోళ్ళం
ఆనాడు మమ్మల్ని బానిసలన్నరు

చంపుతాడనీ ప్రాణం పోతుందనీ తెలిసి కూడా
ధర్మ యుద్ధాన్ని ఏనాడూ మీరనోళ్ళం
దశావతార పురాగాథల్లో మమ్మల్ని రాక్షసులన్నరు

వినొద్దు చదవద్దు ముట్టొద్దనే వర్ణాశ్రమ ధర్మాలతో
మమ్మల్ని శూద్రులన్నారు

ఆత్మహత్యలు ఆకలిచావులు వలసలతో
దేశమంతా దు:ఖమైనోళ్ళం
ఆ మధ్య మమ్మల్ని అణగారిన వర్గాలన్నరు

లెక్కల్లో తేలకుండా అట్టడుగునే మునిగి ఉన్నోళ్ళం
ఇప్పుడు మమ్మల్ని బీసీలంటున్నరు

ప్రాణం పోసిన కళల బిడ్డల్ని చంకనెత్తుకుని తిరుగుతున్నోళ్ళం
మమ్మల్ని సంచారజాతులు బిచ్చగాళ్ళు అంటున్నరు

ఏదేమైనా.... ఎన్ని పేర్లైనా... మేము మూలవాసులం

రాజ్యాధికారం కోసం ఇప్పుడిప్పుడే మౌనాన్ని వీడి కాలు కదుపుతున్నోళ్ళం
బలిసినోళ్ళంతా మమ్మల్ని
ఉసిరికాయ మూటలంటున్నరు

ఛ...?
ఎంత దిగజారి పోయినం...!!
మూడువేల కులాల మహాజన కూటమి ఒక్కటి కావాలే
అగ్రవర్ణాల ఊడిగం చేసుడు బందుపెట్టాలే
జారుకుంట వచ్చిన ప్రతిమెట్టు మళ్ళా పైకెక్కాలె

వాళ్ళను ఎల్లగొట్టాలే
ఎక్కడైతే మొదలైనమో మనం అక్కడికే చేరుకోవాలే

# పేరైతే ఉంది 25

-వంగాల యశోధ

వాళ్ళు ఎంత నైపుణ్యవంతులో కదా
శరీరంలో ఎముకలున్నాయో లేవో అన్నట్లుగా
చిన్న ఇనుపరింగులో దూరిపోతారు

కన్నబిడ్డల కడుపు నింపడానికి
మనిషి రూపాన్ని పక్కన బెట్టి
డప్పు దరువుకు గంతులేసే వానరంలా
వీళ్ళు గజ్జకట్టి చిందేస్తారు

ఉన్నాడో లేడో తెలియని దేవుడిపై భారం వేసి
ప్రాణాన్ని గాలిలో దీపం చేసి
తనువును తాడిపై నిలబెడతారు
ఎంత చేసినా...
కుటుంబం గడవక
పక్క మీద పరాయి పురుషుల
ఆకలికి ఆహారమవుతారు

ఐనా,

వాళ్ళెంత దేశభక్తులో కదా
దరిలేని జీవితాలు గాడి తప్పుతున్న
ఐదేండ్ల కొకసారి ఓటుగా మారి
ప్రజాస్వామ్యానికి ప్రాణం పోస్తున్నారు
భూమికి ఆకాశానికి మధ్య
జీవితాన్ని వేలాడదీసుకున్న వాళ్ళు
ఎంత అదృష్టవంతులో కదా
మనిషిగా నమోదు కాకున్న
కులంగా నమోదు చేయడ్డారు
బీసీలుగా–

## సుత్తి- పట్టెడ 26

-అనంతోజు మోహనకృష్ణ

రెడిమెడ్ నగలతో
సాంప్రదాయ బంగారపు పనులు
అంతరించిపోతున్నాయి
కేడియం కెమికల్స్‌తో అతికి
91.6 బంగారంతో
మేం చేసిన నగలు మెరిసిపోతుంటే
మా ఆరోగ్యాలు చెడి
మా జీవితాలు వెలవెలబోతుంటాయి

ఇప్పటికే పెరిగిన బంగారం ధరలతో
బతుకు భారమైపోతే
ఇది చాలదనట్టు ప్రభుత్వాలు కొత్తగా
బంగారం కొనుగోలుపై పన్నులేస్తూంటే
పట్టెడ మీద పడాల్సిన సుత్తిదెబ్బ
మా బతుకులపై పడి
అంధకారం అలుముకుంటుంది

ఒకవైపు అర్థరాత్రి దొంగలు
పనివారి ఇళ్ళలో పడి భీభత్సం సృష్టిస్తుంటే
మరో వైపు చేతిపనులు చేసుకునే బంగారపు పనోళ్ళను

బంగారానికి లెక్కలు చెప్పమంటూ
పోలీసులు దాడులు చేస్తుంటే
బిక్కచచ్చి బతకలేక బతుకుతున్నం

ఇంటిల్లిపాది అర్ధరాత్రి అపరాత్రి
తేడాలేకుండా పనిచేసినా
మూడు పూటల తిండి కోసం
అప్పు చేయక తప్పటం లేదు
ఈ దుస్థితి మారాలంటే
బంగారపు పని చేసే వారందరం
సంఘటితం అవుదాం
సంఘం పెట్టి మన హక్కులను
సాధించుకుందాం
అసంఘటిత కార్మికులగానైనా
గుర్తించమని నినదిద్దాం....
కంసళ్ళో... అవుసళ్ళో...
కదిలిరండు... దండుగా
మన హక్కులను సాధించుకుందాం....

## చచ్చినా దక్కని సమానత్వం 27

-కంచర్ల శ్రీనివాస్

రాజ్యంలో
అలుముకున్న వర్ణ వివక్ష ఎంత కక్ష పులుముకుందో
రాజ్యాంగపు
తారలెన్ని రాలినా తరాలెన్ని మారినా
తన రంగు వెలవదు నయా జమానాలోనైనా....
పంచములనే కాదు శూద్రుడ్ని సృష్టించటంలోనూ అదే నయ వంచన

అరవైనాలుగు కులాలను అణగ దొక్కి వెనుకబడేసిన
పెత్తందారీ ప్రభువులారా
మీ ఓట్లు దాచుకునే బ్యాంకులు కారు బీసీలు
సమానత్వం అంటే
విద్యా ఉద్యోగం రాజకీయ హక్కుల కల్పన
జన సంఖ్య ఎక్కువున్న మాకు ఎక్కువ హక్కులే కదా సంక్రమించాలి
మీ సమంగా కూడా లేవేమి

సమానత్వం చచ్చాకకూడా దక్కటం లేదు
చివరికి స్మశానం దగ్గర కూడా
ప్రేమలు ఒలక బోసే వగలమారి అగ్రవర్ణ ప్రేయసీ
నువ్వూ నేను కలిసి నిద్రించే స్థలం కావాలి
నాతో కలిసి చావనసరం లేదు

మా రిజర్వేషన్లకు అడ్డుపడకపోవటం
కాలధర్మం చెందిన నా కులపోల్లకు
శ్మశానంలో మీ పక్కన చోటివ్వటం
ఊరి చివర మా సూదరోళ్ళ వాడల మాదిరిగానే
ఎక్కడో విసిరేసిన మా బొందల గడ్డలు
ఆ జానెడు జాగా దక్కని అవస్థలు ఇంకా ఎన్నేళ్ళు

సమానత్వం చచ్చాకకూడా దక్కటం లేదు
చివరికి స్మశానం దగ్గర కూడా

## మనసు కఠినం కాదు 28

-గూడూరు ఉమ

అరె జగమంతా జనమంతా
అరె కులస్తులను
కటికోల్లని కసాయోల్లని అంటే ఏమనిపించలే
కానీ శ్రీశ్రీ అంతటోడు
కటిక కసాయి అన్నడనేసరికి
కత్తి పట్టబుద్ది కాలే
పసుల గొంతు కోసి
పండుగ చేసుకోవడానికి
మాకేం మనసు లేదనుకున్నారా?
జానెడు పొట్టనింపుకోవడానికి
జంతువుల సంపుతన్నామే కానీ
యాట కూర మొత్తం మేమే తింటామా ఏందీ?
అదిలిచ్చి అడుక్కుతినే
అగ్ర కులస్తులను చేతులెత్తి మొక్కుతారు
బుక్కెడంత బువ్వ గొంతు దాటం కోసం
మీ నీసు మొఖాలను సంతృప్తి పరచడం కోసమే
కత్తి పట్టకున్నాం, కానీ
కష్టపడడం మాకు తెలియదా?

## పోగుల గూడు 29

**- జంగం హైమావతి**

మా తాతల కాలంలో
అగ్గి పెట్టిలో పెట్టే  చీరను నేసినందుకు
నేర్పరి నేతన్నా నీకు
వందనాలన్నారు...

ఈ నయా జమానాలో
మా శ్రమను పోగుల గూడుగా చేసి,
కాలే కడుపులతో బ్రతుకునీడుస్తుంటిమి
ఏం చేయాలి మరి..?

రాట్నాన్ని తిప్పుతున్న మా అవ్వకు తెలియలే...
గీ రాట్నం మా జీవనాన్ని పురోగమనంలోకి కాదు!
తిరోగమనంలోకి నెట్టి వేస్తుందని...

సరి చాసి పోగులను కుంచెతో సరి చేసే
మా అయ్యకు ఎరుకగాలే!
గా పోగులే మా మెడకి
ఉరితాళ్ళుగా
మారే దినాలొస్తాయని

పోగు తెగిన బతుకులు
భీవండి
బొంబాయి
దుబాయిల కాడ
కుదబడే రోజులొస్తాయని
మేమూహించలే

గీ గ్లోబలైజేషన్ వ్యవస్థలో
నేత గుడ్డని
రెడీమేడ్‌లు డామినేట్ చేస్తుంటే
మా సాలెల మగ్గాలు
అటకమీద బందీగా బడి
బూజల్లుకుని రోదిస్తున్నాయి...

రాబోయే తరానికి
మా నేత బట్టలు
మ్యూజియంలో
చూడాల్సొత్తదమో మరి..
కోల్పోయిన బహుజన రాజ్యపు కుర్చీలాగా-

## కాపన్న వెతలు 30

-చేరాల సుధాకర్

తొలకరి వానకై ఎదురు చూసి, ఎదురుచూసి
చీకటి పడగానే ఎప్పుడు తెల్లారుతుందోనని
ఎక్కడ పొలం దున్నితే బాగా పాలుస్తుందో అని
తర్జన భర్జనపడి వేకున జామునే లేసి
ముల్లుకర్ర, పార, నాగలి, కాని, దుత్త సిద్ధం చేసుకొని
పెద్దకాని మీద, నాగలి, గుంటకేసికొని చేనుకు చేరుకొని
వానలేక బీడుబడ్డ భూమిలో సాలుపెట్టి
ఇరువాలు దున్ని మూడు, నాలుగు సార్లు, గుంటకకొట్టి
పుల్ల పొరక, చెత్త, చెదలు కుప్పవేసి కాలబెట్టి
నెల చదును చేసి అచ్చుకొట్టి
మళ్ళీ వానొస్తే విత్తనాల పెట్ట జూచి
పట్టణం బోయి పదిషాపులు తిరిగి
ఆ గింజలు, ఈ విత్తులు ఆ కంపని, ఈ కంపనీ
అన్ని విని సావుకారు వద్ద ఖాతా వెట్టికొని
విత్తనాలతో ఇంటికి కాపువచ్చి

వర్షం పడంగనే చేనుకురికి తడిచూసి
పిల్లజెల్లను వెంట బెట్టుకొని చేనుకాడికిపోయి
నడుముకు తువ్వాల గట్టి విత్తనాలు పోసుకొని
అచ్చులోన గింజపెట్టి మొలిచేదాక కన్నార్పక చూసి

మొక్కచుట్టు గడ్డితీసి ఎరువేసి పెంచి
ప్రతి పూత కాతవుతుందని కలలుగని
పంటల కోసం మంటల్లో నృత్యాలు చేసి
పంటా, ఫలం చేతి కందాలని పూజలు చేసి
పండిన పంటను కోసి కుప్ప మార్చి
వారివి, వీరివీ చూసి ఇంకోంచెం ఎక్కువ పండితే
నాలుగు రొక్కాలు ఎక్కువస్తాయని కాపన్నకు నిరాశే

ఇంతచేస్తే
మార్కెట్టుకు గింజలమ్మ పోతే
కొనెటోడు, అడ్తిదారు, గుమాస్తా, దాడునాయి, చాటకూలి...
మార్కెట్ మాయాజాలంలో
మాయగాళ్ళ నోట్లో అన్నం
కాపన్నకు మిగిలేది సున్నం

# కొలమానాలే కులమైనదాణ్ణి 31

–రేనా ఈశ్వరయ్య

కొలమానాలే కులమైన దాన్ని
నేనెట్లయిత బీసీని

అమ్మ ఆలి ప్రేయసీ
ఏమీ కాలేకపోయిన
అసంపూర్ణ అక్షర మాలని
కులమే గుర్తింపైన చోట
గుడులు బడులు
తరాలుగా మాకు మడికట్టుకున్న వాడలే

ఆవేశాలు ఆవేదనలు దు:ఖాలు
వేదనలు సంవేదనలు
అన్నీ నాలో చల్లపడే
ఎడారి వొయసిస్సును నేను

వ్యధలు కథలు అన్నీ మోసిన గతం
చీకటి విరిచిన నెలవంక నా నులక మంచం

దొమ్మరిదనే ముద్రతోనే పుట్టిన దాన్ని
వెలయాలనే పేరు మోస్తున్న దాన్ని

ఎవరికి ఏమీ కాని దాన్ని
ఆధార్‌తో ప్రభుత్వ లెక్కల్లో చేరిన దాన్ని
వోటుకోసమే బీసీ జాబితాలో చేర్చబడిన దాన్ని
రాజ్యం చేసిన రంకుకు వ్యభిచారినైన దాన్ని

కొలమానాలే కులమైన దాన్ని
నేనెట్లయిత బీసీని

# పిడికెడు గుండెలు

# 32

–బూర్ల వెంకటేశ్వర్లు

మా బాపు
దారాలను
పత్తి పువ్వుల జాక్కున్న ప్రాణ కిరణాలని
ముద్దిచ్చుకునెటోడు
మా అవ్వ
రాట్నం లడీల నడుమ సోపతి జేసి
ఒక కదురు మీద దారాల్ని
పిడికెడు గుండెల్లెక్క సుట్టేది

మనిషిలోపట జ్ఞాన దారాలు
కండలతోని కలిసున్నట్టే
మనిషి తిత్తి మీద బట్టపేగుంటేనే
బతుకు అనెటోడు మా బాపు
ఎంత పైసున్నా
ఎల్తిలేని బట్టుంటెనే మానం మర్యాద అనేది
మా అవ్వ
ఇంటినిండ బట్టలుంటే ఇంకేం కొదువ అనేది
లోకం

దిగూట్లె దగీపం లెక్క ఎలిగేటి మా నాయిన్న
మొగ్గం నేశీ నేశీ
నీళ్ళల్ల దీపం లెక్క ఐపోయిండు
కుండెలు సుట్కీ సుట్టీ అవ్వ

దారప్పొగు లెక్కనే ఐంది
పడుగు పేకలల్లెక్క అటుగొట్టుకొని
ఇటుగొట్టుకొని
పట్టు వస్త్రం కావలిసినోళ్ళు
చాయగిలాసలు కడుగుతుండ్రు
పొద్దుకు నడక నేర్పినోళ్ళు
పొయ్యిల పిల్లి లేవక
పైస పైసకు తండ్లాడుతుండ్లు
రాట్నం అటుకు మీదకెక్కింది
మొగ్గాలు మూలకుపడ్డయ్ః
కాళ్ళు రెక్కలు దగ్గలు దగ్గరపడుతున్నయ్
పానాల మీద ఆశలు సల్లపడుతున్నయ్

అయ్యా!
మీకు ఇనపడుతున్నదా
మీ మానానికి బట్టగట్టినోళ్ళు
బతికి బట్టగడుతలేరు
నోటిమాట బైటపడనోళ్ళు
నోరు దెరిసి చస్తున్నరు
మనిషికి మొలదారం సుట్టినోళ్ళు
సిరి వెలుగులతోని బతికినోళ్ళు
ఉరితాళ్ళకు వేలాడుతన్నరు
అయ్యా!
మీకు కనపడుతన్నదా!

# ఒక యుద్ధం చెయ్యాలే 33

–చిర్రా రాజేష్ ఖన్నా

ఉడతల్ని పట్టి వేటగాన్నంటే  సరిపోదు
ఊర పిచ్చుకల్ని కొట్టి విలుకాన్నంటే
విలువ వుండదు
అడవిని  జయించాలనుకున్నవాడు
సింహంతో కదా పోరాడాల్సింది
సామ్రాజ్యాన్ని గెలవాలనుకున్నవాడు
చక్రవర్తిని కదా వోడించాల్సింది
కోల్పోయిన నీ రాజ్యాన్ని తిరిగి
పొందాలంటే
యుద్ధమే కదా చేయాల్సింది

ముల్లును ముల్లుతోనే తియ్యమన్నరు
వజ్రాన్ని వజ్రంతోనే కొయ్యమన్నరు
అందుకే కదా బాంచెన్ అన్న
బక్కోడు ఆయుధమవుతున్నది

ఆయుధాన్ని ఆయుధంతో ఓడించే కదా
ప్రపంచ చరిత్రలన్ని రాసుకున్నది
మరి వీడెవడో ప్రజా స్వామ్య పద్ధతిలో
పోరాటం అంటడేంది–

గాంధీ మార్గమన్నోడి గోచి ఊడపీకి
'కరో యా మరో' నినాదమిచ్చిన దెవఢ్రా
అని గుండెల మీద తన్ని
బొండిగెల పానముండంగనే బొందపెట్టాలే

నెలలు దాటినంక కూడా
నార్మల్ డెలీవర్ నొప్పుల కోసం
సూది మందుల తాపత్రయమేంది
సిజేరియన్ చేసైనా బిడ్డను బైటికి తీయాల్సిందే

పోరాటం- విప్లవం
గందుకే
చెడ్డీలు తొడుగని వియత్నాం పోరలు
యుద్ధ ట్యాంకుల్ని గెలిచిన
వీరత్వం గావాలె
మన రాజ్యం మనకు దక్కాల్నంటే
ఒక యుద్ధం చెయ్యాలే-

## కుల కళేబరం 34

-సొన్నాయిల నరేష్కుమార్

ఔనా!
నువ్వూ నేను కలిసే ఉన్నామా ఇప్పుడు
ఔను కదా
అపార్ట్‌మెంట్లో రెండు ఫ్లాట్లూ ఒకే బ్లాక్‌లో కదా
ఇప్పుడు
అంతరాలే లేవంటావ్ కదా...!!!
రిజర్వేషన్లు వద్దనే అంటావ్
సకల శాస్త్రాలనూ చదివినోడివి కదా శర్మా
నా కన్నా ముందే
పవిత్ర యాగ గోమాంసాన్ని తిన్నోడివి నీకన్నీ తెలుసులే

అదంతా చరిత్ర...
ఇప్పుడేదీ చూపించు అంటూ ఉపన్యాసం చెప్తావ్ కదా
పద పట్నంలో కాదు గానీ
మనూరెళ్ళి మాట్లాడుకుందాం...
మా వాడలోనే
మా ఇంట్లోనే మాట్లాడుకుందాం

వద్దన్నావ్ శర్మా....! అన్నీ వద్దన్నావ్
చదువొద్దన్నావ్

సంఘ జ్ఞానమొద్దన్నావ్
శర్మా....
ఊరికిద్దరుండే మీ ఆకలికి వేలమందుండే
మా ఆకలికి తేడానే లేదాన్నావ్...
పక్కపక్కనే ఉన్నా మనిద్దరి మధ్య
తరతరాల తారతమ్యపు దూరం
కాగితాల రాతల్లో మనం సమానమే
కానీ...
ఇంకా మనూరి టీ కొట్లో గ్లాసుల్లా మనం దూరంగానే ఉన్నాం

సిటీలో రాసుకు తిరిగిన మన నీడలు
పల్లెలో పరిచయం లేని గోడలౌతాయ్

ఐనా మా పిచ్చిగానీ
శబరెంగిలి తిన్న రాముడూ
తిన్నడు పెట్టిన మాసం లొట్టలేసుకుతిన్న శివుడూ
ఎప్పుడో మాతో సంధి చేసుకున్నరు
నీతో మాకేం పని

నీ గుళ్ళో బొమ్మలెవడిక్కావాలి
నీ మనసులాగనే
మనువు మదమెక్కిన ఆ దేవుడు మా కొద్దు
పశు మాంసం తినే నేనూ
నరమాంసం తినే నువ్వూ
ఎప్పటికీ ఒకటికాలేం వదిలెయ్ నన్ను!!!

ఆ శర్మా....!
వెళ్ళేముందు ఒక్కమాట
ఆకలితో వచ్చే ఎవ్వడినైనా...
మా సోదరుడనే అనుకుంటం
ఆ కాలపు ఆలోచనతో వస్తే
తడిమి కొట్టి తుడిచేస్తం-
తుడుచుకుపోతావా...?

## బోసివోయిన దాతి 35

– వడ్ల సాయిలు చారి

ఇప్పుడునేను... ఏంచేయాలి?
ఎట్లా బతకాలి?
నాకు నాగలికి ఉన్న బంధం తెగిపోయింది
ఆసామికి నాకున్న అనుబంధం అంతకన్నా తెగిపోయింది
ఇప్పుడు నేనేం చేసేది
బతికేందుకు దారేది
పొద్దు పొడుస్తూనే దాతి చుట్టూ తుమ్మ మొద్దులు
ఆసాముల ఎదురు చూపులు
ఇప్పుడంతా....
బోసివోయి బోడిదయ్యిన దాతి
ఆకాశమంత ఎత్తుకు ఎగిరి
తల ఎత్తుకు జీవించేలా చెక్కిన
నా పెద్ద బాడిసె
దిక్కులేనిదై దిగాలు పడుతుంది
పలుగురాతి పొడిచెక్కమీద
పదునుగా నూరుకొని
దుంపను, పాలెను, కొలను తయారు చేద్దామంటే
నవీన కాలంలో...
నాగలే లేకుండాయే...
గుంటకలేదు, గొర్రులేదు, జంబులేదు

ఎక్కడానికి బండిలేదు
ఆనకాలం అడ్లులేవు
అయిటి బత్యం అసలే లేదు
ఆధునికి పోకడలతో ఆసామి
ఆకాశానికి చూస్తుంటే
నా ముఖం చిన్నబోయి నేలకేసి చూస్తుంది
ఇప్పుడు నాబతుకు గెగ్యలెక్క అయింది

# పురగిరి క్షత్రియ 36

– గిరివర్మ చింతం

రాజ్య పురహింసను థిక్కరించి
పురములనొదిలి
గిరులను చేరిన పురగిరి క్షత్రియ పెటిక
పీఠాలను ధిక్కరించిన రెవల్యూషనరీ పెటిక

బహుజన హితాయ:
బహుజన సుఖాయ:
బుద్ధుని ప్రవచనాలకు కంచె కాసిన ' మల్లు '
వీరమల్లు పెటిక.

పురానికి గిరులకు వారధిగా నిలిచి
చెట్టు చేమా కొండలు కోనలే ఇల్లు చేసుకుని
ప్రకృతిలో సంచరించి
ప్రకృతి పల్లవికి చరణాలు  తొడిగిన వాగువంకలు పెటికలు
ఇదంతా గతం
గోదారి బిడ్డల జీవితం

కాలక్రమేణ
వస్తు మార్పిడి వ్యవస్థలో
పెటిక తూకాలుగా మానవసంబంధాల వారధైన పెఱుకలు
ఆపై జనపనార...జూట్ మిల్లులు

ఆనక వ్యవసాయం...
చేపట్టిన ఒక్కొక్క వృత్తి హైజాక్ కాగా
బతుకులు హైజాక్ కాకుండా
ఆత్మరక్షణలో పడ్డ కులం పెటిక

ప్రపంచీకరణ ప్లాస్టికొచ్చి
జూట్ బ్యాగులను కాస్త గల్లంతు చేయగా
కులవృత్తి కాస్త గోదారిలో కలిసింది

కాలం మారింది
బతుకూ మారింది...
గోదారి దరి చూపించలేదు
ఆద్దరి ఈద్దరి ఆవల ఈవల
బతుకంతా విలవిల...

సంచారకులైన వ్యాపారకులైనా
ఏదీ కాస్తంతైనా నిలువ నీడివ్వలేదు

ఇన్నేండ్ల కాలంలో
పాతిక లక్షల జనాభాలో పాంచ్ శాసనసభ్యులు
ఇదా రాజ్యంలో మా వాటా?

తరతరాలుగా రాజ్యాధికారము రాజ్యం
మాకు అల్లంత దూరంలోనే
ఇంకానా ఇకపై చెల్లదు...

మల్లులై యుద్ధమల్లులై
కులగోత్రమే 'మల్లు' ఐన మల్లన్నలు
అన్యాయాన్ని చూసి శివాలెత్తుతున్నరు
మా వాటా ఏదంటూ...

ఉరకలెత్తుతున్న గోదారే మాకు ఆదర్శం
ఎత్తైనా వంపైనా  మా పయనం నిటారే...

ఇప్పుడు రాజ్యాధికార సైరన్ మోగిస్తున్నం...
రాజ్యమా పారాహుషార్!
గోదారి బిడ్డల ప్రవాహ చైతన్యం
మిమ్మల్ని మూడు చెరువుల నీళ్ళు తాగించడం కాయం

## వాట్ ఈజ్ అట్రాసిటీ 37

–చింతం ప్రవీణ్

పెఱుకోన్ని తురుకోన్ని నమ్మొద్దని
కులాన్ని మతాన్ని కలిపినోడా...
సాకలి మంగలి పొత్తు
ఇంటికి రాదు ఇత్తంటూ
మా కులాలను విడదీసినవ్ గదా!
ఏం చాణక్య నీతిరా నీది

మా సోదరులు
మీకై ఎక్కుపెట్టిన దూషణ బాణాన్ని
సరాసరి మా వైపు తిప్పారు కదా
ఏం యుద్ధతంత్రం రా నీది

మీ ప్రాస కోసం మీ యాస కోసం
మీ వెకిలి కోసం మీ వెర్రి కోసం
మీ వేల వేల సంతోషాల్లో
మీ వేల వేల ఉషారు నిషాలల్లో
నగ్నంగా దొర్లుతున్నది
మా శూద్ర కులాల పేర్లే కదా!

అసలు నిజానికి అట్రాసిటీ అంటే ఏమిటి
వాట్ ఈజ్  అట్రాసిటీ!

చాకలి మంగలి పొత్తు
ఇంటికి రాదు ఇత్తు
అయ్యా
ఇది తిట్టా?
కవిత్వమా

దొమ్మరిదానా
పిచ్చకుంట్లోడ
బహురూపులోడ
అయ్యా!
ఇవి తిట్లా...?
పలకరింపులా..?

గొల్లోనికి మల్లె పువ్విత్తే
బోటిపేగుల చాలోడా
సాకలి– కోసం సన్నాసులు కొట్టుకోవడం
అయ్యా...!
ఇవన్నీ తిట్లా?
పొగడ్తలా?

వాట్ ఈజ్ అట్రాసిటీ
మాకెందుకు వర్తించదు అట్రాసిటీ

## మిసిలినీయస్ ఖాతా 38

–చింతం ప్రవీణ్

ఊళ్ళకు ఊళ్ళే చిరునామా అయిన వాళ్ళకి
ఒక్క చోట నికురమని ఏం చెప్పగలం

కూడు గూడు ... గుడ్డ
మనిషి ప్రాథమికావసరాలైనా
కొండోల్లు, కోతులోల్లు, బండారోల్లు, బహురూపులోల్లు...
కూడు గుడ్డ కోసం
దేహాన్నే గూడుగా మార్చుకున్న సంచారులు

మనకే తెలియని మన చరిత్రను
మన జాతుల సంస్కృతిని
వినసొంపుగా కథలు కథలుగా చెప్పే
సంచారుల బతుకు
ఇప్పుడో కథలా ముగిసిపోబోతోంది

థియేటర్లు లేన్పుడు సినిమా ఐనోళ్ళు
దవాఖానాలు లేనప్పుడు వైద్యం ఐనవాళ్ళు

మైదానాల్లేనపుడు రంగస్థలమైనోళ్ళు
'బ్రతుకే ఒక నాటకమంటూ'... ఊసూరుమంటున్నారు

ఊర్లకు ఊర్ల సరిహద్దులు ఔపోసన పట్టిన వాళ్ళు
నేడు బతుకు సరిహద్దులను గీసుకొంటున్నారు

సంచార జానపదులు ఆడే ఆటలన్నీ పాడే పాటలన్నీ
రాజ్యమే ఆడిపాడుతుంటే
నివ్వెరపోయి చూస్తున్న కొండ చిలుక నేటి సంచారి

డూప్‌లేని స్టంట్‌లకు కేరాఫ్ అయిన వీళ్ళు
వ్యవస్థీకృత స్టంట్‌లకు 'డూప్' అయిపోతున్నారు.

ఆటపాట మాటల జానపద జాగోరేల గొంతుక
జనాలకు దూరంగా శూన్య సంచారం చేస్తున్నది
చిలుకల్లేని ఊర్లో చిలుకల్లా తిరిగే వీళ్ళ జాతకం
నేమార్చలేనంటే ఆ చిలుకా ఎగిరెళ్ళిపోయింది

జగమంతా ఇళ్ళనుకునే వాళ్ళకు
జానెడు జాగా జమానతు పడక
దగా పడుతూనే ఉన్నారు ఏండ్లకేండ్లు-

ఆధారో, ఆసరో, రేషనో-
ఏ కార్డు వీళ్ళను నమోదు చెయ్యదు
బీపీఎల్లో పక్కా ఇళ్ళో
ఏదీ వీళ్ళను నిర్ధారించదు
స్వార్థానికైనా సరే ఓటరు కార్డు వీళ్ళను గణించదు
కులగణనో, జనగణనో లెక్కతేల్చని
మిసిలినీయస్ ఖాతా సంచారి

ఈ దేశంలోనే ఉన్న
సుపరిచిత జాతుల అపరిచిత మొఖం సంచారి
కూడు గుడ్డ కోసం
దేహాన్ని గూడుగా మార్చుకున్నవాడు సంచారి

## కాలుతున్న తనువులు 39

-యోచన

ఆకలికి ఆత్మరక్షణకు
అనుకోకుండా ఆదిమానవుని చేతిలో
ఆయుధమయ్యాను
ఆది నుండి ఆధునికత వరకు
అన్నింటిలో నా హస్తముంది
చేతివృత్తుల పనిముట్లలో నా నెత్తురంటనిది ఏది
సేద్యం మానవాళికి సాధ్యమయ్యిందంటే
అది నా స్వేద ఫలితమే
అదృష్టరేఖలు అరిగిన నా అరచేతికి అన్నమంటదు
పంచ భూతాలై ప్రపంచాన్ని నడిపించే
పంచదాయి కులాలకు కంచంలో మెతుకులు కరువు
యంత్రమనేది ఎరుగనప్పుడే
అల్ట్రాస్కానింగ్ అంచనాలను మించిన
కడుపుల పిండం కదలికల్ని వివరించిన
మహాపురుషుడు పోతులూరి కులమిది
పరిణామ కాలజ్ఞాన గ్రంథాన్ని వ్రాసిన
తాత్విక కలమది

సామాజిక చైతన్య పోరాటం అప్పుడే మొదలయ్యింది
ఒంటరి ప్రయాణంలో ఒడవని ముచ్చట
పది జిల్లాల ప్రజల ఆకాంక్ష
తెలంగాణా జాతిపిత జయశంకర్ త్యాగమే
తనువుగాలుతున్నా తపన వీడని తనయుల గన్నది
శ్రీకాంతాచారి, రాజ్‌కుమార్‌చారి లాంటివాల్లు
ఇంకెందరో నిలువెత్తు సాక్ష్యమయ్యారు
ఎందరి తల్లుల కడుపుకోతో
ఇంకా ఎన్ని నిప్పుల గుండాల్ని దాటాల్నో
ఏ రోజు కోసం ఎదురుచూస్తున్నామో
ఆ రోజే మారోజు వీరన్న మరణం చాటింది
జ్ఞానం సాహిత్యం నైపుణ్యం పోరాటం
వారసత్వమైనట్టే
ఆర్థిక రాజకీయ సామాజిక స్థిరత్వాలను
అంటరానితనమేదో వెంటాడుతూ
ఇంకా ఒంటరి వాన్నే చేస్తుంది

## బాపు...! నేను నీ జీవన కొనసాగింపుని 40

**–వెంకట కిషన్ ఇట్యాల**

బాపు...!
నన్నెవరైనా మీ తండ్రెవరయ్యా అని అడిగితే...
నెత్తికి తువ్వాల...,పెయిమీద బురద చుక్కల పొక్కల బనీను
జబ్బ మీద నాగలి నడుముకి దగ్గరగా గుంజికట్టిన ధోతి
గర్వంగా చెప్తాను నా తండ్రి ఒక రైతని

తన చెమట చుక్కలతో ఈ నేలని సారవంతం చేసినోడు
తన పిడికిలితో ఈ దేశానికి నాగరికతని నేర్పినోడు
అతడు జీవితాన్నే పోరాటంగా నెరిగిన సాగిపోయే నాగలికొన
అతడి దెబ్బలు తింటూనే కరిగిపోతూ వాడిని కోల్పోని గడ్డపార

అతడు బొజ్జలూ నిమిరే, మీసాలు మెనలేసే పరాన్న జీవి కాదు,
పండితుడు కాడు ప్రవచనాలు చెప్పే మతగురువు కాడు
అతడు వాస్తవములో బ్రతికే ఒక బుద్దుడు
అతడు తనతో బాటు కింది వర్గాలు
ఎదగాలని కోరుకొనే సాహు మహారాజు వారసుడు
అతడు పనినే జ్ఞానంగా నెరిగి శూద్రుడు
అతడు ఆలోచనలనకి ఆచరణకి తేడా తెలయనివాడు
అతడే నా తండ్రని నిన్ను గర్వంగా చూపిస్తాను బాపు!

నా బాపు...!
రెండు కాళ్ళు దూరంగా పెట్టి
నడుముకు రెండు చేతులు అనించుకొని
మాటకైన పనికైన సిద్ధమనే కట్టెలాంటి నీ శరీరపు పోజు
కూచున్న కాడికెళ్ళి లేచి జబ్బమీది తువ్వాలనొకసారి తీసి
పచ్చ జెండాలాగా గాల్లోకి ఊపి చెమట చుక్కలింధనంగా
సాగిపోయే శ్రమ రైలుబండి లాంటి నీ దేహం
బొచ్చెమీది ఎంటుకలు మొత్తము
ఊడిపోవాంగ తట్ట పారవట్టి మోసి కట్టి
మానవ శ్రమకి మించిన మహాద్భుతము లేదని లోకానికి చూపినోడా!
నువ్వే చెమట కులానికి అచ్చంగా నిలువుటద్దం బాపూ

బాపు...!
అప్పులిచ్చిన దొర పంట చేతికి రాకముందే
ఇంటికొచ్చి అవ్వనక్కని తిడితే
వాడి దొరతనానికి ఎదురొడ్డి నిలిచిన నిన్నంగదోలుటకు
కాళ్ళు పట్టుకొని క్షమాపణ అడగాలన్నపుడు
తలవంచేది లేదని నిబ్బరంగా నిలిచిన నీ గుండె
ఆత్మహత్యలు చేస్కుంటున్న నేటి రైతులకు ఆదర్శమూ బాపూ!

నువ్వు నేర్చుకున్న శాస్త్రము నేను చదివిన చదువు
రైతు బిడ్డలమైనందుకు అప్పు కాగితాల మీద బారువడ్డీ
చక్రవడ్డీలు బతుకు పుస్తకములనే నేరిస్తిమి

పుట్టెడు కట్టపడి కొట్టమటువంటి రెండిండ్లు కట్టితివి
తట్టెడు ఇసుక పిడికెడు సిమెంట్ వాడకుండానే
మన పొలములోనే సాంచాలతోని ఇటుకలు తయారు చేసి
వాము పెట్టి కాల్చి
లోకము నోరెల్లపెట్టంగా చేసి చూపించిన ఓ పర్యావరణ మిత్రుడా!!

నిన్ను మించిన గురువెవరు బాపు నాకు...
పట్నము పోయినపుడు కొని తెచ్చుకొని సందుగల దాచుకుని
చదివిన నీ వెనుకటి దినపత్రికలు చూస్తే
నీ జిజ్ఞాస ముందు నీ జీవితేచ్ఛ ముందు
మెరుగైన వసతులున్న నేనెంత అల్పున్ని బాపూ!

పొయ్యి అంటు పెట్టాలంటే అగ్గిని కూడా కుమ్మరి పెంకలో
పక్కింటి నుండి అడుక్కచుకునే మంచి రోజులాయే
మరి నీ అంగి కీసలో రూపాయి ఉంటే
అదే మన ఇంటికి ఆస్తి అనుకునే కాలము అది
బతుకమ్మ పండుగప్పుడు సోపతులందరు
తుపాకీలు పటాకలు కొనుక్కుంటే నాకు కావాలని అడిగితే
ఏమీ చెప్పకుండా పొలము దగ్గరి నుండి చెరువు కట్ట మీదికి తీసుకపోయి
సిపాయోల్లు (సి.పి.ఐ) చేస్తున్న రెడ్ ఆర్మీ ట్రైనింగ్ చూపించి
నన్ను నేను మర్చిపోయేలా చేసిన మూలవాసివి బాపూ

ఆరేయ్...! గడ్డపోడా ఇటు రారా అని నిన్ను వయసుకైనా
విలువనివ్వకుండా దొర కొడుకు పిలిచినపుడు
నువ్వేవడివిరా అక్కడ్నే ఉండు నేనత్తున్న అని దొర కొడుకునురికిచ్చిన
అన్న ధైర్యము వెనుక ఉంది నువ్వే కదా బాపు!

వ్యక్తి స్వేచ్ఛని గుర్తించే నీ వ్యక్తిత్వమెంత గొప్పది బాపు!
ఏ వరుసవాల్లైన సరే మనుషులందరికి
నీ కంటే చిన్నోల్లకి వెంకన్నవయితివీ...
పెద్దోల్లకి కొడుకా... బిడ్డ.... వెంకన్నవయితివి

అందరి కడుపుల కువారమంత నీకే చెప్పుకోవాలని
ఎదురు చూసేలా చేసే మట్టి హృదయం బాపూ నీది

నువ్వు పంచాయితీలెన్నడు చెప్పలే.. కచ్చీరు కాడ కూచోలే...
కానీ నువ్వు తొవ్వపొంట భుజాన నాగలెత్తుకొని పోతుంటే
తీర్పు నీ చెవున పడితే దొరోడు ఎంతటోడైనా ఒరేయ్ అంటూ
నాగలి కింద పడేసి కండ్లెర్రజేసిన చాకలి ఐలమ్మ వారసునివి బాపూ
సకలము సబ్బంద మంది బాధ్యతని గుర్తుచేసిన
నీ తీర్పు ఏ పెద్ద మనిషి చెప్తడే బాపు!

రోహిణి చొర్రంగనే దుక్కి దున్ని ముర్కసిలలో
గింజలు జల్లి చిన్న పూసాలో ఎల్లితే పెసాల్లు ఎల్లకుంటే పశువులకు
దాణగా పంట లేకుంటే బురదలోనే కలదున్ని పంటకి పాటులాగా
భూదేవినైతే వదిలి బతుకవు
కాలము మన్నిస్తే
ఆశ్వినికార్తి పంట కూడా పండిస్తాననే ఉషారుతనము నీది
ఇంటి ముంగట ఊరవిశ్కెలకు వరిగొలుసు..,
పంటపైన పడితినే పురుగులకు మధ్యలో బంతిపూల చెట్లు
పచ్చని పైరుని చూసి ఆకలిగా ఉరికొచ్చే పశువులకు దడి
అవ్తల నీళ్ళు ఎక్కువ పారించి పెంచిన గడ్డి ఎంత పెద్ద సైంటిస్టువే బాపు
నువ్వు ఎంత భూతదయనే బాపు నీకు

నారుపోసి నీరు పెట్టి
కోతకోసి కుప్ప పెట్టి సకల కులంపనులోల్లకి
కలిమిడిగా ఉండేటోళ్ళకి కుంచము పట్టి కొలిచి
షావుకారికమ్మి మిగిలిన చిన్న పిరమిడ్ వడ్ల కుప్పమీద జార ఒరిగి

కాలు మీద కాలేసుకొని చేతులు పైకి చాపి ఎల్లెలుకల పండి
నువ్వు సూర్యుడి దిక్కు తీక్షణంగా చూస్తుంటే
ఆయనేమో మబ్బుల చాటుకి దాక్కుంటుంటే...
ఎహే పో...! యూ ఆర్ మై ఫరెవేర్ హీరో బాపు!

కొడవండ్లు, గొడ్డల్లు, గడ్డపారలు , పారలు సర్ఫియ్యడానికి
కమ్మరి కుమారస్వామి మామ ఇంటికి పోతే
కమ్మరైన కళాత్మకంగా వంచుతుంటే చెరి కొద్ది సేపు మనము
సుత్తె పట్టి కొట్టినము కొలిమిని లయ కొద్ది తింపినము
వడ్ల బ్రహ్మయ్య తాత దగ్గరకు పోతే దుగోడ బర్మ పట్టి సగము పనిచేసి
కుమ్మరి రాయమల్లు తాత కుండలు చేస్తుంటే
మట్టి పెడ్డల్ని మెత్తగా పగలకొట్టుడు మొదలు
మట్టి నీళ్ళు పోసి తొక్కి గారె పైకి ఎక్కించి కుండ తయారవుతుంటే
చెడకొట్టునతమో కొత్త రూపము కోసమో,
చూడకుండా వేలుపెడుతూ కట్టె పెడుతూ ఎండ పెట్టి వాయి పెట్టి
కాలినంక బూడిదలోంచి దగ్గుకుంటూ కుండల్ని తీసి
కాలిన రంగుబట్టి ఒక దిక్కుపెడుతూ వాళ్ళింట్లోనే తింటూ...
ఎంత సక్కని సబ్బండ బతుకులు బాపూ...

మోటకొట్టి గూడేసి ఏతాము తొక్కి ఆయిల్ ఇంజన్ నడిపి
కరెంట్ మోటార్ నుండి కమాండింగ్ మోటార్ వరకు
పట్టుకార స్క్రూ డ్రైవరు టెస్టర్ పది పైసల పాణా నుండి
చైన్ పాణా వరకు నీ చేతిలో తోలుబొమ్మలాయే
ఎంత పెద్ద ఇంజనీరువే బాపు నువ్వు
ఏ చదువులన్న అడుగుతున్నాయా నీ అనుభవాన్ని నేర్పమనీ

ఐతే ..ఎన్ని చేసినా
సూదరుల జీవితాలెందుకు మార్తలేవో ఇన్నాళ్ళు తెల్వలే బాపూ

మహా శక్తి వంతులైన మూలవాసుల మూలుగని సమూలంగా పీల్చే
మహాద్భుతమైన మేధో సంపన్నుని బుద్ధి గుజ్జుని గుంజి పిప్పిచేసే
నా కాళ్ళు చేతులు విరగ్గొట్టి నన్నో చేతకానివాన్ని చేసి
నన్నో ఆలోచనారహితున్ని చేసే
నాకే మాత్రము సంబంధము లేని నాదికాని లోకములో
మనదే అయిన మనది కాకుండా పోయిన  మన రాజ్యంలో
నేను బతుకుతున్నాని తెలిసిన దగ్గరి నుండి
మనసు మనసులో లేదు బాపూ

కొట్లాట అనివార్యమైనపుడు ఎయ్ ఎయ్ మంటూ ముందుకే తప్ప
వెనుకడుగేసేది లేదని తలలు పగిలిన రక్తమోడిన
భీకర స్ఫూర్తి వాక్యాలు పలికే ఓ నా మహావీరా!
ఓ మహామంత్రి నా తండ్రి...!
నన్నొక వీరున్నీ శూరున్నీ మహాపరాక్రమవంతునిగా
తీర్చిదిద్దన నా బాపూ!
నువ్ నూరిపోసిన సబ్బండ వర్ణాల శ్రమ శక్తి
రాజ్యాధికార శక్తి కాబోయే రోజుల కోసం శ్రమిస్తున్నా బాపూ
నేనిప్పుడు పూలే అంబేడ్కర్ దారిలో సాగిపోతున్నా  బాపూ

బాపూ...!
మీ బాపు ఎవరని నా కొడుకును ఎవరైన అడిగితే...
మనందరి బాపూ పూలే అని చెప్పమంటా

## బిగ్ బ్యాంగ్ 41

-డా॥. చింతం ప్రవీణ్ కుమార్

ఒక్కసారి చరిత్రను యాజ్జేసుకుంటే...

మా నెత్తురును
ముడి సరుకుగా
మీ రాజ్యకాంక్షకు ఎరవేసి
మీ తరతరాలూ
పదవులను పక్కలేసుకున్నరు

మా వృత్తులకు
ఉరితాళ్ళు పేని
ఏండ్లకేండ్లు వెట్టి చేయించి
టన్నుల కొద్ది శ్రమదోపిడి చేసిండ్లు

మా చెమటని ఎరువుగా మార్చి
మీ పంట పొలాల్లో పారించి
పచ్చని నోట్లను పండించుకున్నరు

మా కన్నీటిని
ఆవిరి చేసి
మీ వెకిలి నవ్వుల్లో హింసించి
పైశాచికానందం పొందిండ్లు

నెత్తురు కాల్వలు
వృత్తుల హత్యలు
చెరబడ్డ చెమట చుక్కలు
కాలువలు గట్టిన కన్నీళ్ళు
ఇదా మా చరిత్ర–
కోల్పోవడమే బతుకైన మా చరిత్ర–
ఐనా...
మీ ఇళ్లకి దర్వాజాలైనోళ్లం
మీ పంటలకి కంచెలైనోళ్లం
మీ విందులకు కంచాలైనోళ్లం
మీ కుట్రలకు సమాధులైనోళ్లం

శతాబ్దాలకు శతాబ్దాలు
మీ భవనాలకు పునాదులైన మా ప్రాణాలు
గిప్పుడు
పునాదులు తొలుచుకుని
బయటకొస్తున్నయ్
మీ కోట బురుజుల మీద
సామాజిక జెండా ఎగరేయడానికి...

సామాజికం అనంగనే
సగం సచ్చిపోతున్నవేంది  దొరా...
మీకు బానిసలుగానే ఉంటమని
మాతో కలిసి
మా భావితరాలను
బాండ్ పేపర్ రాసిమ్మంటారా?
మాకు స్వేచ్ఛా  రాజ్యాధికారం కావాలంటే
నీ రాజరికం పోతదని రంది తగిలిందా?

బాంచెన్ అన్న ఒక్కొళ్ళమే
మా ఎరుక మేం చేసుకుంటున్నం
మీ గురించి కూడా తెలుసుకుంటున్నం

ఏం బుగులైతున్నదా?
ఔను మల్లా!
నోటికి ముంత
ముడ్డికి తాటాకు సిద్దాంతం
మీ మీద అమలు చేసే అద్భుతకాలం
ఇప్పుడే కళ్ళు తెరుస్తోంది.

## తెలుగు సాహిత్యంలో బి.సి. అస్తిత్వవాదం..?

**సా**హిత్యం జీవితాన్ని వ్యాఖ్యానించాలనుకున్నప్పుడు ఎవరి జీవితాలను వ్యాఖ్యానించాలనే ప్రశ్న ఉదయించడం సహజం. ఇంకా,సమాజంలో ఏ తరహా జీవితాలను వ్యాఖ్యానించాలనే ప్రశ్న ఉదయించడం కూడా సహజమే. ఈ పరంపరలో ఉదయించిన ప్రశ్నలతో పాటు తెలుగులో వర్గం కేంద్రంగా సమాజాన్ని అర్థం చేసుకోవటం వల్ల కులం, లింగం, ప్రాంతం వంటివి అధికార వ్యవస్థలను నడపడంలో, ఏర్పరచటంలో, నియత్రించటంలోను నిర్వహిస్తున్న కీలక పాత్ర గురించి సరైన అవగాహన ఏర్పడలేదని అస్తిత్వవాదం విమర్శ పెట్టింది. ఈ విమర్శలో చారిత్రాత్మక వాస్తవికత ఉంది. ఈ పరంగా చూస్తే వర్గాన్ని దాటి కాలం, లింగం, ప్రాంతపు జీవితాలను సాహిత్యం వ్యాఖ్యానించాల్సి ఉంటుంది. వాటి అస్తిత్వాలని నమోదు చేయవలసి ఉంటుంది.

అస్తిత్వ ఉద్యమాలు 1960 దశకంతో వచ్చినవి. అస్తిత్వ ఉద్యమాల ప్రధానమైన డిమాండ్ గుర్తింపు అనేది అందరికి తెలిసిందే. రాజ్యం అమలు చేసే అనేక అణచివేత రూపాలను గుర్తింపు రాజకీయాలు విమర్శిస్తాయి. కాని వాటికి ప్రత్యామ్నాయమైన వ్యవస్థ నిర్మాణమనే సంగతిని పట్టించుకోలేదు. తెలుగు సాహిత్యంలో అస్తిత్వ ఉద్యమాలు స్త్రీ వాదంతో మొదలయ్యాయి (1985-95). దీన్ని విప్లవ కవిత్వానంతర ఉద్యమమని విమర్శకులు అంగీకరిస్తున్నారు. సమాజంలో అనేక సముహాలుంటాయని, వాటికి ప్రత్యేక గుర్తింపుంటుందని అస్తిత్వవాదం చెబుతుంది. ప్రపంచంలోని అనేక జాతులు, తెగలు, సముహాలు ఆధిపత్య సంస్థలు,ఆధిపత్య సముహాల వల్ల ఉనికిని కోల్పోయాయని అస్తిత్వవాదం విమర్శించింది. వర్గ దృష్టి నుండి సమాజాన్ని విశ్లేషించిన మార్క్సిస్టు విశ్లేషణ సరైంది కాదని, లైంగిక దోపిడి, లైంగిక హింస, పితృస్వామిక అణచివేత స్త్రీల ప్రధాన సమస్యలనీ, వాటిని వర్గ విశ్లేషణ ఉపరితల సమస్యగా చిత్రించి అప్రధానం చేసిందని స్త్రీ వాదులు వాదించారు. స్త్రీలు అణగారిన సముహంగా పరిగణించిన వారు స్త్రీ విముక్తికి  ప్రత్యేక మహిళ పోరాటాలే పరిష్కారమని భావించారు.

స్త్రీవాదం. స్త్రీవాదం తర్వాత దళిత వాదం. స్త్రీవాదం,దళిత వాదం తెలుగు సాహిత్యంలో దాదాపు ఒకే కాలంలో ఆవిర్భవించాయి. వాటి ప్రారంభం 1975 లో అయితే 80, 85 నాటికి వాటికి ఒక గుర్తింపు వచ్చింది. జాషువా 1920ల్లోనే వ్రాసినప్పటికి దళిత సాహిత్యానికి ఒక సొంత గొంతుక ఏర్పడలేదు. స్వాతంత్రోద్యమ కాలంలో దళితుల విషయంలో రెండు ప్రధాన దృక్పథాలున్న మాట మనకు తెలిసిందే. అవి 1) గాంధీ దృక్పథం 2) అంబేద్కర్ దృక్పథం. అయితే దళిత వాదం గాంధీ ప్రచారాన్ని తిరస్కరించి అంబేద్కర్ దృక్పథాన్ని అంగీకరించింది. 1909 లో "మాలవాండ్రపాట", ఆ తర్వాత 1911 లో 'గురజాడ' మంచి అన్నది మాలయైతే...గరిమెల్ల 1919 లో 'పంచములు'...1916 లో మంగిపూడి 'నిరుద్ధ భారతం',జాల రంగస్వామి 'అంటరాని వాడెవ్వడు',కుసుమ ధర్మన్న 'హరిజన శతకం' మొదలైనవి వెలువడినప్పటికి ఆ కాలంలో దళితవాద సాహిత్యం అనే ముద్ర లేదు. ముఖ్యంగా దళితవాద సాహిత్యం ఒక ఉద్యమంలా మారింది మాత్రం కంచికచర్ల కోటేషు హత్య తరువాతే. చీరాల సమీపంలో ఉన్న కారంచేడు (1985), చుండూరు (1991) ఊచకోతలు కుల సమస్యను ప్రధాన కేంద్రం చేశాయి. ఆ నేపథ్యంలో తెలుగులో దళిత సాహిత్యం పురుడు పోసుకొంది.

మహాత్మ జ్యోతిబా ఫూలే, సావిత్రిబాయ్ పూలే కాలంలో శూద్రులు, అతిశూద్రులు ఇద్దరినీ అగ్రవర్ణాలు సమానంగా చూసేకాలంలో వారిద్దరు నిమ్నజాతుల ఉద్ధరణ చదువుల వల్లనే సాధ్యమవుతుందని, కుల వ్యవస్థకు సంబంధించిన చారిత్రక భౌతికవాద సిద్ధాంతాన్ని రూపొందించడం కోసం 1873-74లో 'సత్యశోధక సమాజాన్ని' స్థాపించారు' నిమ్నజాతి ప్రజల కోసం గులాంగిరీ, పూజారి తత్వం బయట పడింది లాంటి మహోత్తరమైన పుస్తకాలు వ్రాసి నిమ్న జాతులైన శూద్రులు, అతి శూద్రుల ఉద్ధరణకు కృషి చేశారు. ఆ తర్వాత డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ పూలే నిర్మించిన భావజాలాన్ని కుల నిర్మూలన వాదంగా ముందుకు తీసుకెళ్లాడు. పూలేను తన గురువని చెప్పుకునే పరిస్థితి గమనిస్తే పూలే, అంబేద్కర్‌లకు శూద్రులు, అతి శూద్రులు ఒకేలా అణచివేయబడుతున్నారనే భావన ఉండి ఈదేశంలోని బిసి, యస్.సి, యస్.టిలు కలిసి పనిచేస్తేనే, బహుజన రాజ్యం సిద్ధిస్తుందని, కనుక వారంతా కలిసి ఆర్థిక రాజకీయ, సాంస్కృతిక పోరాటాలకు సిద్ధం కావాలని..,అలా చేస్తేనే వారి జీవితాలు బాగుపడుతాయని వారిరువు భావించారు. ప్రారంభంలో బిసి, యస్.సి, యస్.టి, మైనార్టీలు అందరూ దళితులే అని కాన్షీరాం అభిప్రాయంతో ఏకీభవించి, ఆ నినాదంతో

బడుగువర్గాల వారు ఒక తాటి పైకి వచ్చే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత కాలంలో "దళిత సాహిత్యాన్ని దళితులే రాసుకోవాలనే" నిబంధనలతో దళిత సాహిత్యం ప్రత్యేకంగా వేరైంది.

అగ్ర వర్ణ సాహిత్యాన్ని పక్కన బెట్టి తెలుగు సాహిత్యాన్ని పరిశీలిస్తే... అస్తిత్వోద్యమాల నేపద్యంగా వెలువడిన దళిత కవిత్వంలో ముప్పాతిక భాగం బి.సి కవులదే. అప్పటిదాకా దళితులంటే ఎస్సీ,ఎస్టీ,బి.సిలు అనే విశాల భావన ఉండడం చేత  దళితుల సమస్య అంటే అణగారిన వర్గాలందరిదీ అనే ప్రాతిపదిక మీద సాహిత్య సృజన జరిగింది. అణిచివేతకు గురైన ప్రతీ ఒక్కరు దళితులేనన్న బాబాసాహెబ్ తాత్విక చింతనను అందిపుచ్చుకుని విశాల భావజాలంతో ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనారిటీల ఉమ్మడి కవిత్వంగా 1995లో చిక్కనవుతున్న పాట,1996లో పదునెక్కిన పాట కవితా సంకలనాలు వెలువడ్డాయి. ఈ సంకలనాల్లో ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనారిటీలు ఉమ్మడిగానే అగ్రవర్ణాల భావజాలంపై తమ కలాలను దూసారు.  ఆ తర్వాత దళితుల సాహిత్యం దళితులే రాసుకోవాలనే ఒక సంకుచిత భావన మొదలై బి.సి సాహిత్యం,దళిత సాహిత్యం వేరుపడ్డాయి. ఈ సందర్భంలో " ఎవరి దు:ఖాన్ని వారే రాసుకునేటప్పుడు దూడకొమ్ము, ఎద్దు కొమ్ము సంస్కృతి గురించి బీసీలు కవిత్వం రాస్తే అది దళిత కవిత్వం ఎలా అవుతుందని సతీష్ చందర్ సంధించిన ప్రశ్నలు బీసీలు తమ పునాదుల్లోంచి తమ కులవృత్తుల్లోంచి కవిత్వం రాసేలా చేసాయి. అసలు కారంచేడు, చుండూరు ఘటనల తర్వాత అసలు దళితులు ఎవరనే చర్చ ప్రారంభమైంది. బిసిలను దళితులుగా గుర్తించడానికి సతీష్ చందర్, శిఖామణి, కలేకూరి ప్రసాద్ లాంటి వాళ్ళు నిరాకరించారు. ఇదిలా ఉంటే ఇంతకన్నా ముందు 1986లో తెలుగు దేశం హయాంలో మురళీధర్ కమీషన్ సిఫార్సులను అన్ని పార్టీల అగ్రవర్ణాల మూకుమ్మడిగా వ్యతిరేకించడం..,1990ల్లో మండల్ కమీషన్‌ను మూకుమ్మడిగా వ్యతిరేకించిన అన్ని పార్టీల అగ్రవర్ణాల వాళ్ళ దుర్బుద్ధి...మొత్తంగా ప్రతీ సంఘటన నడిమి కులాలైన బీసీ సమాజాన్ని తమ అస్తిత్వం కొరకు ఆలోచించేలా ప్రేరేపించింది. ఈ విధంగా అప్పటిదాకా దళిత కవిత్వంలో గొంతు కలిపిన బీసీ కవులు...తమ సొంత గొంతుకకై ఆరాటపడ్డారు.

అప్పటి దాకా దళిత సాహిత్యంతో గొంతు కలిపిన బిసి కవులు, రచయితలు ఇప్పటి వరకు వచ్చిన దళిత సాహిత్యంలో నాలుగింట మూడో వంతు బిసి సాహిత్యకారులదే అయినా దళిత సాహిత్యం అనగానే ఎస్సీలదని వాళ్ళ

ప్రకటించుకోవడం.. ఈ సందర్భంలోనే బిసిల కవిత్వం పుట్టుకొచ్చింది. ఈ నేపథ్యంలోనే 2001 లో వెనుకబడిన కులాల కవిత్వంగా 'వెంటాడే కలాలు' అనే కవితా సంకలనం వెలువడింది. నల్గొండ జిల్లా కోదాడలోని 'స్పృహ సాహితీ' సంస్థ ప్రచురించిన ఈ సంపుటిలో ఇరవై మూడు మంది బిసి కవుల కవితలున్నాయి. జూలూరి గౌరిశంకర్ ప్రధాన సంపాదకులుగా వెలువడిన ఈ కవితా సంకలనంలో ఎస్వీ సత్యనారాయణ, సీతారాం, ప్రసేన్, ఎన్. గోపి, నాళేశ్వరం శంకరం, బాణాల శ్రీనివాస్‌రావు, ప్రసేన్, దెంచనాల శ్రీనివాస్,ననుమాసస్వామి, జూపల్లి ప్రేమ్‌చంద్, మందరపు హైమావతి, అనిశెట్టి రజిత, బెల్లి యాదయ్య, వెంకట్ మొదలైన బిసి కవుల కవితలున్నాయి.

ఒకప్పుడు తెలుగు సాహిత్యంలో అగ్రవర్ణాల వాళ్ళే సాహిత్య సృజన చేసేవారు. ఇప్పుడు అన్ని సామాజిక వర్గాలకు చెందిన వారు, ఆయా సామాజిక వర్గపు సమస్యలను ఏకరువు పెడుతూ ఆ సమస్యలనే ఇతివృత్తంగా కవిత్వం, కథలు వ్రాస్తున్నారు. ముఖ్యంగా ఎవరి సామాజిక వర్గానికి సంబంధించిన ప్రత్యేక సమస్యలు, అనుభవాలు, అనుభూతులు,జీవితాలు అన్నింటిని వాస్తవికతా కోణంలో సాహిత్యంలోకి తీసుకొస్తున్నారు.ఇక్కడ మనం గమనించాల్సిన విషయం ఒకటుంది. ఇటీవల అణచివేయబడ్డ వర్గాల నుంచే ఎక్కువ కథలు వస్తున్నాయి.అందులో బిసి కథలు, ఎక్కువగా వచ్చాయి.. భవిష్యత్‌లో వచ్చే అవకాశం ఉంది. అయితే కవిత్వం రావలసినంతగా రాలేదు.

ఇంకా గమనించాల్సిన విషయం ఏమిటంటే ఎవరి అనుభవాలను వారు రాయడమే కాదు... ఎవరిదయిన భాషలో వారు రాయాలనే స్పృహ బలపడ్డాక మండలికాల్లో కథ, నవల రాయడం విస్తృతమైంది. ఈ పరంగా మనం గమనిస్తే ... బిసిల్లో సేవాకులాలు అయిన (బిసి–ఎ), చెమట కులాలైన (బిసి–బి) వ్యవసాయ కులాలైన (బిసి–డి) లకు ఒక్కొక్కరికి ఒక్కో పని భాష, ఒక్కొక్కరికి ఒక్కొ భాష ఉంది. ఇంకా ఒకవైపు కుల సంస్కృతి సాంప్రదాయాలు మరోవైపు కులవృత్తికి సంబంధించిన పని సంస్కృతి.., ఇవి రెండు పరిశీలిస్తే తెలుగు సాహిత్యంలో బిసి జీవితాలు, బిసి అస్తిత్వ వాద పరిశీలన వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

సమాజంలో ముప్పాతిక భాగం వెనుకబడిన తరగతులు,అత్యంత వెనుకబడిన తరగతులు అయినప్పటికీ సాహిత్యంలో వెనుకబడిన, అత్యంత వెనుకబడిన తరగతులకు సంబంధించిన జీవితాలను సాహిత్యంలో ప్రధాన భాగం చేయకపోవడం ప్రధాన

లోపం. అయితే దీనికి గల ప్రధాన కారణం కూడా ఉంది. దళితులు బ్రాహ్మణ భావజాలాన్ని అంబేద్కరిజం జ్ఞానంతో కొంతమేరకు త్యజించి తమ ప్రత్యేక గొంతుక కోసం చైతన్యవంతమైన అస్తిత్వ పోరాటాన్ని బలంగా ముందుకు తీసుకెళ్లడం ఈ విధంగా కొంతమేరకు వాళ్ళ అస్తిత్వాలను నిలుపుకోవడం జరిగింది. బి.సిలు ఇంకా బ్రాహ్మణ భావదాస్యం నుండి విముక్తినొందకపోవడం, పాతకాలపు గాంధీగిరిని నమ్ముకొవడం.., ఫూలే తత్వాన్ని ఆచరణలో పెట్టకపోవడం తదితర కారణాలు బి.సిలు గుర్తింపబడక పోవడానికి ప్రధాన కారణాలు. ఇంకా బి.సిలంతా ఒక "ఉమ్మడి కులంగా" కాకుండా వెనుకబడిన తరగతులుగా ఉండడం,ఉమ్మడి సంస్కృతి లేకపోవడం.., ఉమ్మడి ఐక్యపోరాట రూపాలు లేకపోవడం.., ఒక బలమైన సొంత గొంతుకను కలిగి ఉ ండకపోవడం వంటి కారణాల చేత "బి.సి వాదం – బి.సి సాహిత్యం" ఒక రూపాన్ని సంతరించుకోలేక పోయింది.ఒక ఉద్యమంగా ముందుకు వెళ్ళలేక పోయింది.

నిజానికి బి.సి.ల జీవితాలు ఎక్కడైనా ఒకేలా ఉన్నప్పటికీ...తెలుగు సాహిత్యానికి సంబంధించి మాట్లాడుకుంటున్నాం గనుక ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్,తెలంగాణాలో ఉన్న బిసిల పరిస్థితుల గురించి మాట్లాడుకోవాలి. అయితే..,ఆంధ్రప్రదేశ్‌లో బిసిల పరిస్థితి కన్నా తెలంగాణా బిసిల పరిస్థితి కొంచెం భిన్నం.బ్రిటిష్ పాలనలో ఉన్న సీమాంధ్రతో పోలిస్తే నిజాం పాలనలో ఉన్న తెలంగాణా ప్రాంతానికి గల హక్కులు, అధికారాలు, స్వేచ్ఛ వేర్వేరుగా ఉన్నాయి. తెలంగాణ ప్రాంతానికి సంబంధించి మాట్లాడుకుంటే నిజాం దోపిడీ పీడనలకు బలైంది శూద్రులనబడే బిసిలే. ఇక్కడి దేశ్‌ముఖ్‌లు, దొరలు, పటేల్, పట్వారీలు, మాలీ పటేళ్ళు సాగించిన దౌర్జన్యకాండ అంతా భరించింది ఎదుర్కొన్నది శూద్రులే...గడీల పాలనలో బిసి స్త్రీల దౌర్భాగ్యపరమైన పరిస్థితులతో పాటు అంటరానితనం, వెట్టి చాకిరి, చదువు, ఉద్యోగం వంటి అనేక విషయాల్లో నిత్యం బలయ్యింది బి.సిలే...అంతెందుకు తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్నది బి.సిలే. హత్యలు, అవమానాలు, అత్యాచారాలకు గురైంది బిసిలే. అత్యాచార కాండ కొనసాగింది బిసి స్త్రీలపైనే. ఆతర్వాత కాలంలో సామ్రాజ్యవాద ఫ్యూడలిస్టుల కుట్రలో ఉన్న వ్యవసాయ భూములు కోల్పోయి, ఆ తర్వాత ప్రపంచీకరణ సాహవాసంతో వాణిజ్య పంటలవైపు మొగ్గు చూపి...దశాబ్ద కాలంలోనే నేల సారవంతం దెబ్బతిని...దిగుబడి రాక కనీస మద్దతు ధర లభించక ఆత్మహత్యలు చేసుకున్నదీ బిసి రైతులే. 1990 లో మొదలైన ప్రపంచీకరణ పుణ్యమా అని కుల వృత్తులు కోల్పోయి

స్పెషల్ ఎకనామికల్ జోన్‌ల పేరిట భూములు కోల్పోయింది అత్యంత వెనకబడిన కులాలైన సన్నకారు రైతులైన బిసిలే. అలాగనీ ఆంధ్రప్రదేశ్‌లో బిసిల పరిస్థితి ఏమంత మెరుగు కాదు. అక్కడా వాళ్ల పరిస్థితి మరింత భిన్నం అక్కడ రాజకీయం,సాహిత్యం అంతా కమ్మ, రెడ్డి,బ్రాహ్మణ,నాయుడుల చేతుల్లో ఉండడం చేత బిసిలు కేవలం ఓటర్లుగా మారిన విషయం తెలిసిందే...మరో ముఖ్యమైన విషయమేమిటంటే అక్కడి రాజకీయ నాయకులే వ్యాపారవేత్తలు కాబట్టి "గావు పట్టేవాడు, గావుకేక పెట్టేవాడు" వాడే కాబట్టి ప్రజలు నిమిత్తమాత్రంగా మిగిలిపోయారు. ఇవన్నీ విషయాలు గమనించిన పిదప బిసిల బ్రతుకు చిత్రం దేశంలో ఎక్కడైనా ఒక్కటే అనే విషయం స్పష్టమవుతున్నది. 1932 లో పూనా ఒప్పందాన్ని వ్యతిరేకించి, బిసి రిజర్వేషన్లను వ్యతిరేకించిన గాంధీజీతో మొదలైన కుట్రలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. కాకపోతే వ్యక్తులు మారారు, కాలం మారిందంతే. బిసిల బ్రతుకు మాత్రం మారలేదు.

పైన చర్చించిన అన్ని అంశాలను క్రోడీకరించిన తర్వాత "తెలుగు సాహిత్యంలో బి.సి అస్తిత్వవాద పరిశీలన" అనే అంశంపై విస్తృతంగా పరిశోధనలు జరుగవలసిన అవసరం ఉన్నదని,సాహిత్యం కూడా ఇంకా వెలువడాల్సిన అవసరం ఉన్నదని నేను భావిస్తున్నాను.

ఇంకా..,ఒక వ్యక్తికి బహుళ గుర్తింపులు ఉంటాయనే ఎరుక తెలంగాణా బి.సి కవుల,రచయితల రచనల్లో వైవిధ్యం రావడానికి కారణమైనది అల్లం రాజయ్య, ఎస్వీ సత్యనారాయణ, ఊ.సా, జూలూరి గౌరీశంకర్, కాలువ మల్లయ్య, బి.ఎస్. రాములు. అశోక్‌కుమార్, అన్నవరం దేవేందర్, సంగిశెట్టి శ్రీనివాస్, సీతారాం, పెద్దింటి అశోక్ కుమార్, పి.చంద్, ఆడెపు లక్ష్మిపతి, అంబటి సురేంద్ర రాజ్, అంబల్ల జనార్థన్, బాణాల శ్రీనివాసరావు, ఐత చంద్రయ్య, కుమ్మర ప్రసాద్, నారగోని, ఎన్నం ఉపేందర్, సంగం సూర్యారావు, జూకంటి జగన్నాథం, నేరెళ్ళ శ్రీనివాస గౌడ్, దొరవేటి చెన్నయ్య, యాకుబ్, మొదలైనటువంటి అనేక మంది రచయితలు తెలంగాణాలోని బహుళ ఆస్తిత్వాల గురించి కథలు, విమర్శనాత్మక వ్యాసాలు రాశారు. అంతే కాకుండా ఈ బహుళ అస్తిత్వాలు ఏర్పడడానికి గల కారణాలు ఏకరువు పెడుతూ రచనలు కొనసాగాయి.

అటు ఆంధ్రప్రదేశ్ 13 జిల్లాలో ఇంకా ముఖ్యంగా అత్యంత వెనుకబడిన రాయలసీమ, ఇంకా ఉత్తరాంధ్ర ప్రాంతాల్లోని బి.సిల జీవితాలను సాహిత్యీకరించిన రచయితలను, అక్కడి వెనకబడిన, అత్యంత వెనకబడిన తరగతుల జీవితాలు అక్కడి సాహిత్యంలో ఏవిధంగా ఉన్నాయో పరిశీలించవలసి ఉంది. ఇంకా తీర ప్రాంతంలోని చేపల వేట ప్రధాన వృత్తిగా బ్రతికే బి.సి. వృత్తికారుల జీవితాలు, అనావృష్టి కారణంగా గూడు చెదిరిపోయే వాళ్ళ జీవితాలు...మొదలైన బి.సి జీవితాలన్నీ చిత్రించిన కథా, నవలా రచయితలను సాహిత్యాన్ని పరిశీలించవలసి ఉంటుంది– కోస్తాంధ్రలో చాకలి వాళ్ళ జీవితాన్ని విపులీకరించిన 'రేపు' లాంటి నవలలను పరిశీలించవలసి ఉంది. జి. లక్ష్మీనర్సయ్య, జుగాష్ విలీ, దుర్గాప్రసాద్, జాపల్లి ప్రేమ్‌చంద్, శాంతినారాయణ, పలమనేని బాలాజీ, జి.ఆర్.మహర్షి, స్వామి, మందారపు హైమావతి, లతో పాటు బి.సీయే తరమైనప్పటికి చాకలి, మంగళి వృత్తులకు సంబంధించి ఆచార్య ఇనాక్ గారు వ్రాసిన 'పిండీకృతశాటి' లాంటి కథలను పరిశీలించవలసి ఉంది.

ఇంకా..,తెలంగాణానే ఒక వెనుకబడిన ప్రాంతం అందులోనూ వెనుకబడిన తరగతుల పరిస్థితి మరి దుర్భరం. కులవృత్తులే ప్రాతిపాదికగా బ్రతికే ఈ వర్గం జీవితాలకు అక్షరరూపం తీసుకున్నది తెలంగాణ కథలే. ప్రపంచీకరణ పుణ్యమా అని కులవృత్తులు కోల్పోగా ఏదో ఒక పని చేసుకుందామంటే తెలంగాణలో నిరుద్యోగిత స్థితి, వ్యవసాయం చేసుకుందామంటే ఉన్న భూములను స్పెషల్ ఎకనామికల్ జోన్ (సెజ్) ల పేరిట, రింగురోడ్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారాల పేరిట స్వాహా చేస్తున్న వైనాన్ని ముఖ్యంగా ఇక్కడి కథల్లో చూడవచ్చు.ఇటు ఏ పని దొరకకా అటు పూర్తి స్థాయిలో కులవృత్తులను నమ్ముకోలేక ఆత్మహత్యలకు పాల్పడ్డ పెఋక, పద్మశాలి, కమ్మరి, కౌంసాలి వంటి కులాల బ్రతుకు చిత్రాన్ని కాలువ మల్లయ్య, నేరెళ్ళ శ్రీనివాస్‌గౌడ్, పెద్దింటి అశోక్ కుమార్ కె.వి. నరేందర్, అల్లం రాజయ్యల వంటి వారు తమ కథల రూపంలో చిత్రించారు.

ఇవే గాక తెలంగాణలో నీళ్లు, నిధులు, నియమకాలు ఏ విధంగా అన్యాక్రాంతం అయ్యాయో తెలుపుతూ కథలు వెలువడ్డాయి. తెలంగాణాను పట్టి పీడిస్తున్న పత్తి రైతు ఆత్మహత్యలు, వలసలు నిరుద్యోగుల ఆకలి చావులు, ఫ్లోరైడ్ దుష్ఫలితాలు, బీడుపడ్డ పొలాల దుస్థితిని చాలా మంది రచయితలు ఈ సమస్యలను వివిధ కోణాల నుండి వెలుగులోకి తీసుకువచ్చారు. ఇంకా తెలంగాణా బిడ్డలపై సవతి తల్లి ప్రేమను కురిపిస్తున్న

పాలకుల ఊసరవెల్లి రాజకీయాలకు విసుగెత్తి తుపాకులు చేతపట్టి జనాలకు దూరంగా అరణ్యాలతో యువకులు తలదాచుకుంటున్న వైనాన్ని తెలిపే కథలు చాలానే ఉన్నాయి. ఇందులో చాలా మట్టుకు బిసి జీవితాలను పట్టిచ్చే కథలున్నాయి. వాటిని పరిశీలించవలసి ఉన్నది. మరి ముఖ్యంగా సాహిత్యంలో గేయానికి ప్రత్యేకమైన ప్రాధాన్యత ఉన్నది. పాట తెలుగు సాహిత్యంలోనే కాకుండా మొత్తం సాహిత్యంలో తన స్థానాన్ని కలిగి ఉండి జనాల గొంతులో హెూరెత్తుతూనే ఉంది. తెలంగాణాకు సంబంధించి పాట ప్రజల గుండె. పాట తెలంగాణ కొండ గుర్తు. బతుకమ్మ పాట నుంచి మొదలుపెడితే బతుకును కోల్పోతున్న జీవితాల పాటల వరకు అన్ని పోరాటాల్లో పాట ప్రధాన భూమికను పోషించింది. ఆంధ్ర ప్రాంతానికి సంబంధించి కూడా పాట పోషించిన పాత్ర తక్కువేమి కాదు. మొత్తంగా పల్లె, పల్లెలో అంతరించిపోతున్న కులవృత్తులు, ప్రపంచీకరణ మూలంగా వలసెల్లి పోతున్న బతుకుల గురించి పాట గొప్ప బాధ్యతను నిర్వహించింది. ఈ పాటల్లో బి.సి. జీవితాలను పట్టిచ్చే పాటలను ప్రత్యేకంగా పరిశీలించి విశ్లేషించవలసి ఉన్నది.

ఈ రకంగా తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ 23 జిల్లాల్లో ఉన్న బిసి కవులు, కవయిత్రులు,కథకులు,రచయితలను...అదే విధంగా బిసిల సమస్యలపైన ఏకరువు పెడుతూ వారికి మద్దతునిచ్చిన కథకులను, వారి కథలను గుర్తించి, పరిశీలించి, విశ్లేషించవలసి ఉన్నది. మొత్తంగా సాహిత్యంలో లోటును పూరించే భాగంగా 'తెలుగు సాహిత్యంలో బి.సి ఆస్తిత్వవాద పరిశోధన' చేయ్యాల్సిన అవసరం ఉంది.

పరిశోదన లక్ష్యాలు ఈ విధంగా ఉన్నాయ్...

1) తెలుగు సాహిత్యంలో బిసిల జన,జీవిత చిత్రణను విశ్లేషించడం, సమీక్షించడం.
2) ఆయా కులవృత్తి, ఉత్పత్తి సాధనాల్లో, ఉత్పత్తి సంబంధాల్లో వచ్చిన మార్పులను కథల్లో చిత్రించిన తీరును పరిశోధన పరిధిలోకి తీసుకురావడం.
3) తొలితరం కథల్లో, నవలల్లో తెలంగాణా బిసి ప్రజలెదుర్కొన్న వెట్టిచాకిరీ, దొరలగడీల పాలనలో బిసి స్త్రీలు ఎదుర్కొన్న లైంగిక హింస, కుల వృత్తుల వాళ్ల జీవనం, శ్రమదోపిడి మొదలైనవి ఏ విధంగా చిత్రించబడ్డదో విశ్లేషించడం.
4) తెలుగు ప్రాంతానికి చెందని వారు చిత్రించిన కథల్లో తెలుగు మాట్లాడే బిసిల జీవితాల పరిశీలన.

5) బిసిలు కానివారు వాళ్ల వాళ్ల సాహిత్యంలో బిసిల జీవితాన్ని ఏ విధంగా అక్షరీకరించారో తెలుసుకోవడం, బిసిల పట్ల, వాళ్ల సమస్యల పట్ల సానుభూతి, అంకిత భావమున్న రచయితలను గౌరవిస్తూ వాళ్ల సాహిత్యాన్ని భవిష్యత్ తరాలకు పరిచయం చేయడం.

6) నిజాం పాలన నుండి తెలంగాణా ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడే వరకు గల బిసిల జీవితాల్లో గల మార్పులు, సంఘర్షణ మొదలైనవన్నింటిని సాహిత్యం ఏ విధంగా నమోదు చేసిందో పరిశీలించడం. ముఖ్యంగా తెలంగాణకు సంబంధించి తొలిదశ నుండి మలిదశ ఉద్యమం వరకు బిసి ఉద్యమకారుల ఉద్యమం, వాళ్ళ త్యాగాలు, పొందిన ఫలితాలను విశ్లేషించి, విడమర్చి చెప్పే సాహిత్యాన్నంతా ప్రత్యేకంగా ఒక దగ్గర నమోదు చేయడం.

7) శూద్రులైన బిసిలు అతి శూద్రులైన యస్.సి, యస్.టి కలిసి పనిచేసేలా చైతన్యపరిచే సాహిత్యాన్ని, శూద్ర, అతిశూద్ర సమస్యలను ప్రతిబింబించే సాహిత్యాన్ని విశ్లేషించి, పరిశీలించడం.

8) 1990 ల ఆరంభం నాటికి ఉదారవాద ఆర్థిక విధానాల అమలుతో గ్లోబలైజేషన్ దుర్మార్గపు దాడి మన గ్రామాలని, గ్రామీణ జీవితాల్లో ముఖ్యంగా బిసి జీవితాల్లో తెచ్చిన మార్పులను, ప్రపంచీకరణ వలన మొదలైన వలసలను చిత్రించిన కథలను, నవలలను ప్రత్యేకంగా పరిశీలించడం.

9) భూ సంబంధాలు – భూమి వ్యాపార వస్తువుగా మారి పెట్టుబడిదారుల చేతుల్లో పడ్డాక భూమిని కోల్పోయి, వ్యవసాయం కోల్పోయి రోడ్డున పడ్డ సన్నకారు బిసి వ్యవసాయదారుల దుర్భరమైన జీవితాలు, కులవృత్తులు కోల్పోయి పట్టణాలకెళితే నిరుద్యోగం తాండవిస్తున్న పట్టణాలలో పని దొరకక ఆత్మహత్యలు చేసుకున్న వారి జీవితాలు, పనిభారం, మానసిక ఒత్తిళ్లతో మద్యపానం లాంటి దురాలవాట్లతో కుటుంబ యాజమాని చనిపోతే రోడ్డున పడ్డ బిసి కుటుంబాల జీవితాలను కథల్లో నవలల్లో పరిశీలించాల్సి ఉంది.

10) నిజాం దోపిడీ, పీడనలు భరించలేక, దొరల అరాచకాలు భరించలేక బొగ్గు బావుల్లోకి వెళ్లిన వాళ్ళు తొలితరం నుండి నేటి వరకు ఎక్కువ శాతం బిసిలే. అక్కడి నుండి గ్లోబలైజేషన్ ధాటికి తెరుచుకున్న ఓపెన్‌కాస్ట్ గనుల వరకు బిసి కార్మికుల జీవితాలను ఉత్తర తెలంగాణా జిల్లాలైన కరీంనగర్, వరంగల్, ఖమ్మం, అదిలాబాద్‌లలో విస్తరించిన బొగ్గుగని పరిస్థితులను చిత్రించే కథలను, నవలలను పరిశీలించాల్సి ఉంది.

11) సింగరేణి తర్వాత తెలంగాణాలో ఎక్కువగా మంది బి.సిలు వ్యవసాయం కోల్పోయినాక ఆధారపడేది బీడీ పరిశ్రమ మీదే – కరీంనగర్, వరంగల్, అదిలాబాద్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో విస్తరించిన బీడీ పరిశ్రమలకు సంబంధించిన మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, లైంగిక హింస, కూలీ రేట్లలో తేడాలు, చిన్న సిగరేట్ ప్రభావంతో బీడీ పని కుదేలైన తీరు తెలియజేసే 'బతుకు పోరు' లాంటి నవలలను, ఇంకా పరిశీలించాల్సి ఉంది.

12) తీర రేఖ ప్రాంతమైన ఆంధ్రప్రదేశ్ 13 జిల్లాల్లో రొయ్యల పెంపకం, చేపల పెంపకం, కొబ్బరి తోటల్లో వెట్టి చాకిరీ చేస్తున్న ఆంధ్రా బి.సిల జీవితాలు అక్కడి సాహిత్యంలో ఏ విధంగా ప్రతిబింబించబడ్డదో పరిశీలించాలి... అక్కడి పెట్టుబడి దారులు, గుత్తేదార్ల దగ్గర కూలీలుగా పనిచేస్తూ చాలీచాలనీ డబ్బులతో అరకొర జీవితాలను గడుపుతున్న వాళ్ళ జీవితాలను చిత్రించిన కథా రచయితల, కవుల సాహిత్యాన్ని పరిశీలించవలసి ఉంటుంది.

14) ముఖ్యంగా తమకు సంబంధం లేని 'ఫాక్షనిజం' గొడవల్లో సమిధలైన బి.సి, ఎం.బి.సి జీవితాలను చిత్రించే సాహిత్యాన్ని పరిశీలించి... వాళ్ళనలా ఆ దీనస్థితికితెచ్చిన వ్యవస్థను గురించి సాహిత్యపరంగా విశ్లేషించవలసి ఉంది.

15) అతి ముఖ్యమైన విషయమేమిటంటే బిసిల్లోనే అత్యంత వెనకబడిన కులాలైన చాకలి, మంగళి,పెఱుక,విశ్వకర్మ, గానుగ మొదలైన కులాల జీవితాలకు సంబంధించిన సాహిత్యానికి ప్రత్యేక గుర్తింపును అన్వేషించడం – సాహిత్యంలో ఈ అత్యంత వెనుకబడిన కులాల జీవితచిత్రణ ఏవిధంగా జరిగిందో పరిశీలించి, విశ్లేషించవలసి ఉంది.

ఇంకా...

బి.సి అస్తిత్వ ఉద్యమాల సాహిత్య రూపం కోసం అణుక్షణం శ్రమించిన ఇప్పటికీ శ్రమిస్తున్న జి.లక్ష్మీ నరసయ్య, ఉప్పుల సాంబశివరావు, కుమ్మర ప్రసాద్, జూలూరి గౌరీ శంకర్, బాణాల శ్రీనివాసరావు,సీతారాం తదితరుల అస్తిత్వ సాహిత్య కృషిని ప్రత్యేకంగా వెలుగులోకి తీసుకురావడం బి.సి. రైటర్స్ వింగ్‌గా మా బాధ్యత అని తెలియజేస్తూ... మా కంటే ముందుతరాల వాళ్ళయిన ఆ కవుల, రచయితల, బి.సి.ఉద్యమకారుల కృషిని గౌరవిస్తూ మా

ముందుతరాల వారికి మా కృషిని తెలియజేస్తూ ఒక సామాజిక వారసత్వ బాధ్యతను భుజాన వేసుకుని శాస్త్రీయబద్ధమైన ఆలోచన విధానంతో ముందుకెళ్ళడమే లక్ష్యంగా బి.సి.రైటర్స్ వింగ్‌గా ముందుకొస్తున్నాము.

అయితే ఇక్కడొక ప్రశ్న ఉదయించవచ్చు...బి.సి సాహిత్యం అంటే ఏమిటి? అనే ప్రశ్న.., బి.సిలు రాసిందే బిసి సాహిత్యమా? బిసిల కోసం రాయబడింది బి.సి సాహిత్యమా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి.

అయితే బి.సి ల జీవితాలను చిత్రిస్తూ బి.సిలు వ్రాసిన, బి.సి.యేతరులు వ్రాసినదంతా బి.సి సాహిత్యమే.

అయితే బి.సిలు తమ సాహిత్యంలో అన్ని సామాజిక వర్గపు జీవిత చిత్రణ చేస్తూనే ముఖ్యంగా బి.సీల కంటే అత్యంత వెనుకబడిన 'దళిత జీవితాలను' చిత్రిస్తూ వచ్చారు...అగ్ర వర్ణ పేదల గురించి వ్రాశారు. ఇప్పటికీ వ్రాస్తూనే ఉన్నారు. అయితే బి.సిల జీవితాలకు సంబంధించిన విషయాలను ఏకరువు పెడుతూ వ్రాసిన అగ్రవర్ణ, దళిత రచయితలు ఒకటి, అర...అక్కడక్కడ దర్శనమిస్తారు. సందర్భానుసరించి ఎక్కడో ఒక చోట బి.సి జీవితాలకు సంబంధించిన పాత్రలు దర్శనమిస్తాయి. కాని పూర్తి బి.సి జీవిత చిత్రణ, జీవిత సంఘర్షణ కనీసం బి.సిల్లో అత్యంత వెనుకబడిన తరగతుల అతలాకుతలమైన జీవితాలు మనకు వారి సాహిత్యంలో కనపడదు. ఇది సాహిత్యంలో ప్రధాన లోటు. కొందరు రచయితలు తప్ప మిగతా రచయితలను పరిశీలిస్తే బి.సిల జీవితాల పట్ల ఒక దృక్పథం కాని, ఒక సానుభూతి కాని లేక పోవడం కనిపిస్తుంది.ఈ లోటును పూరించేలా తెలంగాణా,ఆంధ్ర ప్రాంతాల్లోని 23 జిల్లాల్లో,తెలుగేతర రాష్ట్రాల్లో ఉన్న బిసి కథకులు, రచయితలు అదే విధంగా బి.సిల సమస్యలపైన ఏకరువు పెడుతూ వారికి మద్దతునిచ్చిన కథకులను, నవలాకారులను వారి కథలను, నవలలను ప్రత్యేకంగా గుర్తించి, పరిశీలించి, విశ్లేషించవలసి ఉన్నది.తెలుగు సాహిత్యంలో సామాజిక వర్గాలకతీతంగా వచ్చిన సాహిత్యానికి కొదవ లేదు. అనేక మంది రచయితలు, రచయిత్రులు వివిధ కోణాల నుండి కవిత్వం, కథలు, నవలలు వ్రాస్తున్నారు. ఈ మొత్తం సాహిత్యంలో నుంచి బిసిల జీవితాలను

చిత్రించే సాహిత్యమేదో పరిశీలించి, అందులో చిత్రించబడిన జీవితాలను విశ్లేషించవలసి ఉన్నది. వీటన్నింటి లక్ష్యంగా పురుడు పోసుకున్నదే బి.సి.రైటర్స్ వింగ్.

ఉద్యమాల, సామాజిక ఉద్యమాల పోరుగడ్డ వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయంలో 18,అక్టోబర్,2015న జాఫర్ నిజాం హాల్‌నందు ఆవిర్భవించింది బి.సి.రైటర్స్ వింగ్. సాహిత్యం ఏకరువు పెట్టిన బి.సి జీవితాలను వెలికి తీయడం..,పరిశోధించడం..,విశ్లేషించడం..,బి.సిల కోసం పనిచేసిన మహానుభావులను గుర్తుంచుకోవడం..,బి.సి భావితరాల కోసం శాస్త్రీయత కలిగిన సాహిత్యాన్ని అందించడం..,పిడివాదపు బ్రాహ్మణ భావదాస్యం నుండి బి.సిలను మానసికంగా బయటకు తీసుకువచ్చేలా సాహిత్య సృజన చేయడం..,ఫూలే పని విధానాన్ని కొనసాగించడం...ఆయన ఆశయాలు కొనసాగించడం... కుల నిర్మూలన కోసం అహర్నిశలు కృషి చేసిన డా॥ బాబా సాహేబ్ శాస్త్రీయపరమైన ఆలోచన ధోరణిని అందిపుచ్చుకుంటూ శూద్ర అతిశూద్రుల కోసం ఆయన రచించిన సాహిత్యాన్ని బి.సి భావితరాలకు పరిచయం చేయడం..,రాజ్యాధికార దిశగా సాగుతున్న బి.సి రాజకీయ పోరాటాలకు సాహిత్యాన్ని అందించడం.., బి.సిల్లో అత్యంత వెనుకబడిన సమూహాలకు అత్యంత ప్రాధాన్యతనివ్వడం.. బహుజన, దళిత సోదరీ సోదరీమణులంతా ఈ దేశమూల వాసులే అనేటటువంటి ఆలోచన విధానాన్ని పెంపొందించే సాహిత్యాన్ని ప్రచారం చేయడం మొదలైన దీర్ఘకాలిక లక్ష్యాలతో బి.సి.రైటర్స్ వింగ్ ఆవిర్భావం జరిగింది.

ఈ సందర్భంగా 'బి.సి.రైటర్స్ వింగ్' మొదటి ప్రచురణగా "సమూహం-బి.సి అస్తిత్వవాద యువ కవిత్వ సంకలనం" వెలువడుతోంది...దీన్ని దళిత బహుజన సామాజిక ఉద్యమకారులందరు ఆదరిస్తారని..,బి.సి.రైటర్స్ వింగ్‌కు వెన్నుదన్నుగా నిలుస్తారని కోరుకుంటూ...

**-డా. చింతం ప్రవీణ్ కుమార్**

వ్యవస్థాపక అధ్యక్షులు

బి.సి. రైటర్స్ వింగ్